thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 238 కరీంనగర్ మంగళవారం, 5 నవంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇండో-చైనా బలగాల ఉపసంహరణ శుభపరిణామం

బ్రిస్బేన్: తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్, డెస్పాంగ్ నుంచి భారత్-చైనా బలగాల ఉపసంహరణ స్వాగతించదగని పరిణామమని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ అన్నారు. బ్రిస్బేన్‌లో భారత సంతతి ప్రజలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఘర్షణల అనంతరం తలెత్తిన ప్రతిష్ఠంభన తొలగించడంలో ఇరుదేశాల కొంత పురోగతి సాధించినట్టు చెప్పారు. "ఇరుదేశాల సంబంధాల విషయంలో కొంత ప్రగతిని మేము సాధించాం. మేము మాత్రం బలగాల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. మరిన్ని చర్యల దిశగా అడుగువేసేందుకు అవకాశాలు తెరుచుకున్నాయని భావిస్తున్నాం" అని జైశంకర్ చెప్పారు.



## విమానాశ్రయాల కంటే మెరుగ్గా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ: సీఎం రమేశ్

తిరుపతి (రైల్వే): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర రైల్వే పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సీఎం రమేశ్ సారథ్యంలోని స్టడీ టూర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. దేశంలో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల కంటే మెరుగ్గా తీర్చిదిద్దుతామన్నారు.

రాబోయే 50 సంవత్సరాలు పాటు రైల్వే స్టేషన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్టేషన్‌లో పనులను పరిశీలించిన బృందం.. అధికారులకు పలు సూచనలు చేసింది మంగళవారం సికింద్రాబాద్‌లోనూ పనులు పరిశీలించి.. సమావేశం ఏర్పాటు చేసి ఒక నివేదిక రూపొందించి పార్లమెంట్‌కు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## సర్పంచ్‌లకు మార్చిలోగా బకాయిలు చెల్లిస్తాం: మంత్రి పొన్నం

హైదరాబాద్: తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠి (చిట్‌చాట్)లో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారు? అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు.




దిల్లీ: పండగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఇటీవల వరుసగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు కాస్త నెమ్మదించాయి. సోమవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.1300 మేర తగ్గి రూ.81,100కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం గరిష్ఠంగా రూ.82,400 మేర పలికిన సంగతి తెలిసిందే. ఇటీవల కాలం లక్ష రూపాయల మార్కు దాటిన కిలో వెండి ధర సైతం దిగొచ్చింది. గురువారం రూ.99,500 పలకగా.. దిల్లీలో సోమవారం దీని ధర రూ.4600 తగ్గి రూ.94,900కు చేరింది. బంగారం వర్తకులు, రిటైలర్ల నుంచి ఆశించిన మేర డిమాండ్ లేకపోవడంతో బంగారం, వెండి ధరల తగ్గుముఖం పట్టడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ఔన్సు 2740 డాలర్ల వద్ద కొసాగుతుండగా.. వెండి ఔన్సు 32.80 డాలర్లుగా ఉంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు, 7న ఫెడరల్ రిజర్వ్ 7న వడ్డీ రేట్ల ప్రకటన వంటి ప్రధాన ఈవెంట్లు ఈ వారంలో ఉన్నాయి. ప్రస్తుతం ఒపీనియన్ పోల్స్ ప్రకారం రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమోక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య పోటాపోటీ నెలకొంది. మరో వైపు ఫెడ్ ఈ వారంలో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ తగ్గించొచ్చని భావిస్తున్నారు. ఈ రెండు అంశాలు ఈ వారం బంగారం ధరలను దిశా నిర్దేశం చేయొచ్చని అనలిస్టులు చెబుతున్నారు. చైనా కూడా ఈ వారంలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇది కూడా అంతర్జాతీయంగా బంగారం ధరలను ప్రభావితం చేయొచ్చని భావిస్తున్నారు.

## జవాబు చెప్తావా ఢిల్లీ బాబు.. కాంగ్రెస్ హామీలపై రాహుల్‌ని నిలదీసిన కేటీఆర్




హైదరాబాద్: అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. వంద రోజుల్లో ప్రతి గ్యారెంటీ నెరవేరుతందని చెప్పిన మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని హెచ్చరించారు. ఇప్పటి వరకు 330 రోజులు ముగిశాయని, ఏడాది నిండడానికి ఇంకా 35 రోజులే మిగిలిందన్నారు. కాంగ్రెస్ హామీలపై ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలాయని, చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలయ్యాయని మండిపడ్డారు. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్‌తో మూసీ సర్కార్ పబ్బం గడిపిందని విమర్శించారు. ఈ ప్రజా పాలనలో ధర్నాలు, రాస్తారోకోలు తప్ప చెప్పుకోవడానికి ఏమున్నదని ప్రశ్నించారు. "వంద రోజుల్లో నెరవేరుతుంది ప్రతి గారంటీ" అని చెప్పిన మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్. మూడు వందల ముప్పై రోజులు ముగిసింది, ఏడాది నిండడానికి 35 రోజులే మిగిలింది! ఏడాదికి 35 రోజులు మాత్రమే మిగిలింది- 2 లక్షల జాబ్ లు ఎక్కడ అంటున్నారు నిరుద్యోగులు. ఏడాదికి 35 రోజులే మిగిలింది %-% ఎకరాకు రూ.15000 రైతు భరోసా ఏమైంది అంటున్నారు రైతన్నలు. ఏడాదికి 35 రోజులే మిగిలింది - పెంచిన రూ.4,000 పెన్షన్ ఎక్కడంటున్నారు అవ్వ తాతలు. ఏడాదికి 35 రోజులే మిగిలింది-నెల నెల ఇస్తామన్న రూ.2500 ఎక్కడబోయాయి అంటున్నారు అడబిడ్డలు. ఏడాదికి 35 రోజులే మిగిలింది-పెంచి ఇస్తామన్న రూ.6,000 పెన్షన్ ఎక్కడని నిలదీస్తున్నారు దివ్యంగా అన్నలు,అక్కలు. ఏడాదికి 35 రోజులే మిగిలింది-ఉద్యోగులు మా పీఆర్సీ ఎక్కడ, మా డీఏలు ఎక్కడని సమ్మెలకు సై అంటున్నారు. ఏడాదికి 35 రోజులే మిగిలింది - కౌలు రైతులు రూ.15000 ఎక్కడ, రైతు కూలీలు రూ.12000 ఎక్కడ అంటున్నారు. ఏడాదికి 35 రోజులే మిగిలింది - తులం బంగారం ఎక్కడా అంటున్నారు మా బంగారు తల్లులు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పన్నీరయ్యే - చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలాయే. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్ తో పబ్బం గడిపిన మూసి సర్కార్. ఏముంది ఈ ప్రజా పాలనలో గర్వకారణం ధర్నాలు,రాస్తారోకోలు తప్ప? జవాబు చెప్తావా ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ?' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.




హైదరాబాద్: తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్‌కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎన్ఆర్ఐ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. భారాస పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవా ద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.
**మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గం** : రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గమని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు అప్పుల పాలవడానికి కారకులు భారాస, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా? అని మండిపడ్డారు.

కాంగ్రెస్, భారాస పార్టీలకు మాజీ సర్పంచ్ కుంటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోన్న ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. 'కొనుగోళ్ల ప్రక్రియ ఎలా కొనసాగుతోంది? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?'అని ఆరా తీశారు.

కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ఏమైనా సమస్యలు తలెత్తితే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హైదరాబాద్ మినహా మిగతా 9 ఉమ్మడి జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించిన సంగతి తెలిసిందే. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకొని రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.
**మూసీ పరివాహక ప్రాంతాల్లో 8న సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర! :** ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు.
**భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం...** నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమం త్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.

## ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయం పెంచాలి: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టిపెట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జాయింట్ వెంచర్లలో వివాదాలు పరిష్కరించి ఆదాయం పెంచాలన్నారు. దీని కోసం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సమావేశమైంది. మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థిక, పురపాలక, రెవెన్యూ, పరిశ్రమలు, గృహనిర్మాణ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి



హాజరయ్యారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన పురపాలక, గృహనిర్మాణ, న్యాయశాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు.

సమస్యకు పరిష్కారం చూపేలా వారం రోజుల్లోగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. తమకు ప్రోత్సాహకాలు అందిస్తే నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని కాలుష్యకారక పరిశ్రమల నిర్వాహకులు మంత్రివర్గ ఉపసంఘానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో.. ఈ విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించుకునేలా సహకరించి, ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.




హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ఆ పార్టీలో నేతలకు స్వేచ్ఛ ఎక్కువ ఉండటంతో నోటికొచ్చినట్టు మాట్లాడుతారు. దీంతో అధికారంలో ఉన్న సమయంలో ఇబ్బందులు తప్పవు. తెలంగాణ రాష్ట్రంలో అదే పరిస్థితి నెలకొంది. పార్టీలో ఉండి, సొంత పార్టీపై కొందరు విమర్శలు చేస్తున్నారు. అలాంటి పార్టీపై పీసీసీ ఓ కన్నేసి ఉంచింది. గీత దాటినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. తీన్మార్ మల్లన్న హద్దు మీరి ప్రవర్తిస్తున్నారని టీ పీసీసీ దృష్టికి వచ్చింది. ఇదే అంశాన్ని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డితో ప్రస్తావించారని తెలిసింది. తీన్మార్ మల్లన్నను సీఎం రేవంత్ రెడ్డి మందలించినట్టు సమాచారం. తీన్మార్ మల్లన్న కాకుండా.. నోరు జారిన ఇతర నేతల గురించి సీఎం రేవంత్ ఆరా తీశారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది.

## 24 గంటల ఉచిత కరెంట్.. కేసీఆర్ సాధించిన ఘనత : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్: 24 గంటల పాటు కరెంట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా జాతీయ కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది భారాస, కేసీఆరేనని తెలిపారు. కానీ ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర కాంగ్రెస్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ సాధించిన ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో భారాస సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శమని పేర్కొన్నారు.




అమెరికా ఎన్నికల్లో పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ కమలా హారిస్‌ను ఎస్ఎన్ఎల్‌లో చూపించడంపై వివాదం రాజుకొంది. అభ్యర్థుల ఈక్వల్ టైమ్ నిబంధనను ఇది ఉల్లంఘించిందని విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాదు.. హారిస్ విషయంలో ఎన్‌బీసీ పక్షపాత వైఖరితో వ్యవహరించిందని ట్రంప్ వర్గీయులు దుమ్మెత్తి పోశారు. చివరికి ట్రంప్‌నకు కూడా అవకాశం ఇవ్వడంతో వివాదం ముగిసింది.

**అసలేమిటీ నిబంధన...** అమెరికా చట్టాల్లోని కమ్యూనికేషన్ యాక్ట్-1934 ప్రకారం ఏదైనా బ్రాడ్‌కాస్ట్ స్టేషన్ ఒక అధ్యక్ష అభ్యర్థికి సంబంధించిన ప్రసారానికి ఎంత సమయం కేటాయిస్తుందో.. ప్రత్యర్థి కోరితే అంతే సమయం ఇవ్వాలి. పబ్లిక్ ఎయిర్‌వేవ్స్‌ను ఒక అభ్యర్థికి అనుకూలంగా దుర్వినియోగం కానీయకుండా వీటిని ఏర్పాటు చేశారు. న్యూస్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్వ్యూలు, టాక్‌షోల వంటి వాటికి మినహాయింపులు ఉన్నాయి.

**ఏం జరిగింది..?...** నవంబర్ 2వ తేదీన అమెరికాలోని ఎన్‌బీసీలో ఎస్ఎన్ఎల్ కార్యక్రమాన్ని ప్రసారం చేశారు. దీనిలో కమెడియన్ మాయా రూడాల్ఫ్ అచ్చం కమలా హారిస్ వలే మేకప్ వేసుకొని వచ్చారు. ఇదే కార్యక్రమానికి కమల కూడా హాజరయ్యారు. దీనిపై ఫెడరల్ కమ్యూనికేషన్ కమిషన్ (ఎఫ్‌సీసీ) కమిషనర్ బ్రాండన్ కార్ తీవ్రంగా స్పందించారు. ఇది ఈక్వల్ టైమ్ రూల్‌ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో బ్రాడ్‌కాస్టర్లు పబ్లిక్ ఎయిర్‌వేవ్స్‌ను పక్షపాతంగా ఉపయోగించకుండా ఈ నిబంధనలు ఏర్పాటు చేశారన్నారు. ప్రత్యర్థి అభ్యర్థికి కూడా తగిన సమయాన్ని ఇవ్వనంతవరకు ఇది ఉల్లంఘనే అని పేర్కొన్నారు. జరిగిన లోపాన్ని ఎస్ఎన్ఎల్ ప్రొడ్యూసర్ లోరెన్ మిషెల్ కూడా అంగీకరించారు. అసలైన అభ్యర్థులను షోలోకి తీసుకురాకూడదన్నారు. అలా చేస్తే ఈక్వల్ టైమ్ నిబంధనలు పాటించడం కష్టమైపోతుందని పేర్కొన్నారు.

**తాజాగా ట్రంప్‌నకు అవకాశం..** ఎఫ్‌సీసీ నిబంధనల ఉల్లంఘనలను సరిదిద్దేందుకు ఎట్టకేలకు ఎన్‌బీసీ ఛానల్ ట్రంప్‌నకు కూడా అవకాశం కల్పించింది. దీంతో ఆయనకు 90 సెకన్ల ప్రసార సమయం లభించింది. ఆ ఛానల్‌లో నాస్కార్ ఎక్స్‌ఫినిటీ 500, వైకింగ్స్-కోల్ట్స్ గేమ్ సమయంలో రిపబ్లికన్ల యాడ్‌ను ప్రసారం చేసింది. దీనిలో ట్రంప్ మేక్అమెరికా గ్రేట్ ఎగైన్ అని రాసివున్న టోపీని ధరించి తన అభిమానులకు సందేశం ఇచ్చారు. దీంతో ఎన్నికల చివరి దశలో వివాదానికి ముగింపు పలికినట్లైంది.




హైదరాబాద్ : తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. 2025 జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో పేర్కొంది. ఈ సంవత్సరం మే 20వ తేదీ నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో టెట్‌కు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసి జనవరిలో పరీక్షలు జరుపుతామని గత ఆగస్టులో జాబ్ క్యాలెండర్ విడుదల సమయంలో ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. టెట్ పేపర్-1కు డీఈడీ, పేపర్-2కు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతుండటంతో వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్షకు హాజరుకానున్నారు. టెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు తొమ్మిది సార్లు పరీక్షలు నిర్వహించగా...జనవరిలో పదోసారి జరగనుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత మే పరీక్షతో కలుపుకొని ఆరుసార్లు పరీక్షలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండోసారి టెట్‌ను నిర్వహిస్తుండటం విశేషం.

## మూసీ పరివాహక ప్రాంతాల్లో 8న సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర!



హైదరాబాద్: ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు.

**భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం...** నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.




హైదరాబాద్: హైదరాబాద్‌లో 37వ పుస్తక ప్రదర్శన తేదీలు ఖరారయ్యాయి. డిసెంబర్ 19 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు పుస్తక ప్రదర్శన సొసైటీ ప్రకటించింది.

ఈ మేరకు సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్, పుస్తక ప్రదర్శన సలహాదారు ఆచార్య రమా మెల్కోటె సహా పలువురు ప్రముఖులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనకు సంబంధించిన లోగోని ఆవిష్కరించారు. మొత్తం 300 స్టాళ్లను ఏర్పాటు చేస్తామని.. ఇందుకోసం త్వరలోనే లాటరీ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

## పోరుబాట పట్టిన మాజీ సర్పంచులు.. ఎక్కడికక్కడ అరెస్టులు

హైదరాబాద్: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు.

**మాజీ సర్పంచుల కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణం: కేటీఆర్...** పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు.

**ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన వారిని అరెస్టు చేయడమేనా?: హరీశ్‌రావు...** మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు.



గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్

ఖమ్మం జిల్లా: ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయిగూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు.మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం



చేశారు. అర్హులైన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91 వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయని.. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసిన వారిని అరెస్ట్ చేస్తారా



హైదరాబాద్, నవంబర్ 4: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్టులను, అక్రమ నిర్బంధాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా.. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు ఈరోజు (సోమవారం) పోరుబాటకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించిన మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌కు వచ్చారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న హోటల్‌లో మాజీ సర్పంచ్‌లంతా సమావేశమయ్యారు. అయితే విషయం తెలిసిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. మాజీ సర్పంచ్‌లను హోటల్ నుంచి బయటకు రానీయకుండా అడ్డుకున్నారు. పోలీసులను తప్పించుకుని బయటకు వచ్చిన పలువురు మాజీ సర్పంచ్‌లను ఖాకీలు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాల దండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులు తదితరులు ఉన్నారు. అయితే పోలీసుల తీరుపై మాజీ సర్పంచ్‌లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తాము శాంతియుతంగా పోరాడుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని వారు ప్రశ్నిస్తున్నారు మాజీ సర్పంచ్‌ల అరెస్ట్‌తో హోటల్ వద్ద కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

## కార్తీక మాసం తొలి సోమవారం.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



హైదరాబాద్ : కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడతోపాటు ప్రధానాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో కార్తిక దీపాలను వెలిగించారు. ఇక వేయి స్తంభాల గుడిలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ : విజయవాడ కనకదుర్గ అమ్మవారిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. అంతకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనం ఎంతో సంతోషంగా ఉంన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి తీరుతామన్నారు.

ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారు. కులగణన ద్వారా తెలంగాణ ఒక దిక్సూచి కావాలన్నారు. కులగణన మీద అందరూ పలు విధాలుగా మాట్లాడుతున్నారు. ఎవరు ఏం చెప్పినా మేం కులగణన పూర్తి చేస్తామన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల వేళ.. డీజీపీపై ఈసీ బదిలీ వేటు..!

ముంబయి: మరికొన్ని రోజుల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలోనే రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డీజీపీపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. గత ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లను ఆమె ట్యాప్ చేసి సమాచారాన్ని భాజపాకు చేరవేశారంటూ ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేయడమే అందుకు కారణం. ఈమేరకు సంబంధిత వర్గాలు సమాచారం వెల్లడించాయి. మహాయుతి కూటమి, మహా వికాస్ అఘాడీలపై డీజీపీ రష్మీ శుక్లా పక్షపాతం వహిస్తున్నారని ప్రతిపక్షాలు తీవ్ర వ్యాఖ్యలు చేశాయి. గత ప్రభుత్వ హయాంలో నేతల ఫోన్లను ట్యాప్ చేశారని.. నేతలు ఏం చేయబోతున్నారనేది తెలుసుకొని ఆ సమాచారాన్ని ప్రస్తుత డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు చేరవేశారంటూ శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమెను 'భాజపా డీజీపీ'గా పేర్కొన్నారు. ఆమె కాషాయ పార్టీతో కలిసి పనిచేస్తున్నారని.. ఇలాంటి పోలీసులు ఉంటే త్వరలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు సరిగ్గా నిర్వహించలేమని ఆరోపించారు. ఈ విషయంపై ఎంవీఏలోని పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ప్రతిపక్షాలపై రాజకీయ హింస పెరిగిందని.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించాయి. ఆమెను తొలగించాలని లేఖలో కోరాయి. దీనిపై ఈసీ స్పందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించాలని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచించారు. తమ విధులను నిర్వహించడంలో పార్టీలకతీతంగా భావించేలా చూడాలన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఫిర్యాదుల మేరకు డీజీపీని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆమె తదుపరి అర్హత కలిగిన ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లను పంపించాలని సీఎస్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. కాగా.. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఓటింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర డీజీపై ఈసీ బదిలీ వేటువేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టులో కేఏ పాల్ పిటిషన్

హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఇవాళ( సోమవారం) తెలంగాణ హైకోర్టులో విచారణ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ వాదనలు వినిపించనున్నారు. పాల్ పిటిషన్‌పై ఈరోజు హైకోర్టు విచారణ చేపట్టనున్నది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేయనుంది బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఈరోజు విచారణ చేపట్టనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులున్నా పరిగణనలోకి ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఇవాళ హైకోర్టులో విచారణ జరగనుంది. కాగా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జూలై 3వ తేదీన హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారని.. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజూరాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్? రెడ్డిలు కొద్ది రోజుల క్రితం వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ కార్యాలయంలో పిటిషన్ ఇచ్చినా స్పీకర్ చర్యలు తీసుకోలేదని కోర్టుకు పిటిషనర్లు తెలిపారు. ఈ తీర్పుపై అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది.



# సర్ప పూజకు ఉద్దిష్ట మైనది నాగుల చవితి

కార్తీక శుక్ల పక్ష చవితిని "నాగుల చవితి" అని పిలుస్తారు. ఇది సర్పపూజకు ఉద్దిష్టమైన దినం. కార్తీక శుద్ధ చవితి నాడు నాగవ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి చెపుతున్నది. శ్రీనాధుని శివరాత్రి మహాత్మ్యంలో ఇలా వర్ణింప బడినది. "చలి ప్రవేశించు నాగుల చవితి నాడు, మెరయు వేసవి రథసప్తమీ దివసమున, అచ్చ సీతు ప్రవేశించి బెచ్చు పెరిగి, మార్గశిర పౌష మాసాల మధ్యవేళ". పై గీతాన్ని బట్టి నాగుల చవితి కార్తీక మాసంలో వస్తుందని అర్ధమవు తున్నది. నాగులు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు వీరంతా వేరువేరు జాతుల వారంటారు మానవ శాస్త్రజ్ఞులు. అస్సాం దక్షిణ భాగంలో ఉన్న నాగాయ్ కొండలలో ఇప్పటికీ నాగజాతి వారున్నారు. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెపుతున్నది. కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగ రాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వారమని ప్రకటించు కునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు ఆనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులై నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని బౌద్ధ వాఙ్మ యంలో అనేక గాథలు తెలుపు తున్నాయి. ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళికట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజుల, నాగి మల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్ప రూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావనిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాలలో పేర్కొనగా యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లులూ, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన బిడ్డలు చని పోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధిం చడం ఆచారంగా ఉంది. పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి " నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా "రైతు" కు పంటనష్టం కలగకుండా చేస్తాయి. అలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయ పడుతూ ఉంటాయి. ఆదినుండీ ఆంధ్రులు, నాగారాధకులుగా ఉన్నారు. "నన్నేలు నాగన్న నాకులమునేలు, నాకన్న వారల, నాయింటి వారల, అప్తుల మిత్రుల, నందరను నేలు, పడగ దొక్కిన, పగ వాడనుకోకూ, నడుము దొక్కిన నావాడను కొనుమూ తోక తొక్కిన తొలగుచు పొమ్ము, ఇదిగో! నూక నిచ్చెదను మూకను నాకిమ్ము, పిల్లల మూకను నాకిమ్ము" అని నాగేశ్వరుని ప్రార్థించడం అనవాయితీగా ఉంది. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టి తోనైనా చేసి పూజించడం ఆచారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటిగా ఉంది. అనంత, వాసుకి, శేష, పద్మనాభ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒక్కొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తిని గ్రీకు భాషలో "స్పీరిమా" అంటారు. స్పీరిమా అంటే సర్ప వలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను ' వెన్నుబాము' అని అంటారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవ జూపడమే నాగపూజ ప్రధాన ఉద్దేశమని విజ్ఞుల భావన. కుండలినీ శక్తి మూలాధార చక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ... కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో ' సత్వగుణ' సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విష సర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే ' శ్రీమహావిష్ణువు నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసే సత్కర్మనే నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని భావన.

# ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ - నవంబర్ 5...భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన దినం




రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ. తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా - టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విట్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌డ్రాప్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (%×జ=జ%), అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (%×ఖీ=జ%), స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది. ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపించబడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది, అలాగే పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపట్టడం, ప్రోత్సహించడం చేస్తోంది.. మానవాళి బాధలను తగ్గించవచ్చు , నివారించవచ్చు తద్వారా శాంతికి మరింత సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదం చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పవన్ ఉంటే చాలు... బీజేపీ ఫ్యూచర్ ప్లాన్స్ అదరహో!



ఏపీలో సొంత బీజేపీ నేతల కంటే జనసేన నేత పవన్ కళ్యాణ్ నే కేంద్ర బీజేపీ నేతలు ఇష్టపడుతున్నారు. ఆయననే గట్టిగా నమ్ముకుంటున్నారు. ఏపీలో బీజేపీ నేతలకు కొదవ లేదు. అదే సమయంలో ఏపీ కూటమి ప్రభుత్వంలో మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. ఈ క్రమంలో బీజేపీ నేతలు తమ పార్టీని అభివృద్ధి చేసుకోవడానికి ప్రయత్నం చేయవచ్చు. కానీ మిత్రుడు అయిన పవన్ కే ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పవన్ కళ్యాణ్ విషయంలో చూపిస్తున్న అభిమానం ఎంతటితో ఇటీవల హర్యానా కి పవన్ వెళ్ళినపుడు కనిపించిన సన్నివేశమే ఒక ఉదాహరణ. పవన్ కళ్యాణ్ ఒక క్రౌడ్ పుల్లర్, అంతే కాదు ఆయన రాజకీయంగా కూడా బీజేపీ భావ జాలానికి దగ్గర అవుతున్నారు. అదే విధంగా ఆయన బలమైన సామాజిక వర్గంతో పాటు విశేషమైన యువత మహిళల మద్దతు కలిగి ఉన్నారు. ఆయనలో బలమైన నాయకుడిని బీజేపీ చూస్తోంది. ఏపీలో తాము ఎప్పటికైనా జెండా పాతాలీ అంటే అది పవన్ లాంటి సునామీతో జత కట్టడం వల్లనే సాధ్యమని బీజేపీ పెద్దలు గాఢంగా విశ్వసిస్తున్నారు. ఇదిలా ఉంటే పవన్ తో నిరంతరం ప్రధాని కార్యాలయం టచ్ లో ఉంటోంది అని అంటున్నారు. ఆయనతో అనేక విషయాలు కూడా పంచుకుంటున్నారు అని అంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి కార్యక్రమాల గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పవన్ తో తరచుగా చర్చిస్తూ ఉంటారని అంటున్నారు. ఇక పవన్ సైతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల మీద తన అభిప్రాయాలను కూడా పంచుకుంటూ ఉంటారు అని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాల మీద కూడా పవన్ ద్వారా జనంలోకి తీసుకుని వెళ్ళేందుకు కూడా కేంద్రం చూస్తోంది అని అంటున్నారు. పవన్ సైతం కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనేక సార్లు మీడియా ముఖంగా బయటా పంచుకుంటున్నారు అని అంటున్నారు. ఇక కేంద్ర పెద్దలతో పవన్ కూడా పూర్తిగా టచ్ లో ఉంటున్నారు అని అంటున్నారు. ఆయన ఇటీవలనే కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు బర్త్ డే విషెస్ చెప్పారు అని గుర్తు చేస్తున్నారు. అలాగే జాతీయ స్థాయిలో ఏ సంఘటన జరిగినా కూడా ఆయన రియాక్ట్ అవుతున్నారు అని కూడా అంటున్నారు. ఈ విధంగా పవన్ తోనే అంతా అన్నట్లుగా బీజేపీ కేంద్ర పెద్దలు వ్యవహరించడానికి ఎన్నో కారణాలు తెర వెనక ఎన్నో వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. ఈ వైఖరి ధోరణి చూస్తుంటే సరైన సమయంలో పవన్ కి బిగ్ ఎలివేషన్ పొలిటికల్ గా ఇస్తూ ఆయన జనసేన పార్టీని బీజేపీలో కలుపుకోవడానికి కూడా చూస్తారు అని అంటున్నారు. ఏపీ రాజకీయాల్లో బీజేపీ శకం మొదలవ్వాలీ అంటే పవన్ అన్న బలమైన తుఫాను వీచాల్సిందే. అది తమకు అనుకూలంగా ప్రత్యర్థులను తుడిచిపెట్టే విధంగా వీస్తేనే కమలం ఆంధ్రాలో వికసిస్తుంది అన్నది బీజేపీ పెద్దలకు తెలుసు అని అంటున్నారు. అందుకే పవన్ ని వారు చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే పవన్ కూడా పక్కా జాతీయ వాదిగా మారుతున్నారు అని అంటున్నారు.

# గల్ఫ్ లో అమెరికా భారీ యుద్ధ విమానాలు.. ఇరాన్ గుండెల్లో రైళ్లు

ఇజ్రాయెల్ పై అమెరికా అధ్యక్ష ఎన్నికల కంటే ముందే దాడి చేస్తామంటూ హెచ్చరించిన ఇరాన్ కు అమెరికా గట్టి సంకేతమే పంపింది. తమవ్యూహాత్మక బాంబర్లను పశ్చిమాసియాకు తరలించింది. ఇరాన్ దూకుడును ఏమాత్రం సహించమని తేల్చి చెప్పింది. బి-52 స్ట్రాటో ఫోర్ట్రెస్ .. అమెరికా కు చెందిన భారీ యుద్ధ విమానాలు ఇవి. వీటిని ఇరాన్ ను కట్టడి చేసేందుకు మోహరిస్తామని చెప్పిన 24 గంటల్లోనే అన్నంత పనీ చేసింది అగ్ర రాజ్యం. మినాటో ఎయిర్ బేస్ లోని 5వ బాంబ్ వింగ్ కు చెందిన బి-52 స్ట్రాటజిక్ బాంబర్లను తొలుత సెంట్రల్ కమాండ్ ఏరియాకు చేరవేసింది అమెరికా. తర్వాత



ఫైటర్ జెట్లు, ట్యాంకర్ ఎయిర్ క్రాఫ్ట్ లు, బాలిస్టిక్ మిసైల్స్‌నూ తరలించింది. ఇరాన్ ను ఎదుర్కొనేందుకు తాము ఈ విమానాలను మోహరిస్తామని అమెరికా శుక్రవారం హెచ్చరించింది.

శనివారం అంటే 24 గంటల్లోనే బి-52 స్ట్రాటో ఫోర్ట్రెస్ లు గల్ఫ్ చేరుకోవడం గమనార్హం. ఇరాన్ కానీ.. దాని మద్దతు ఉన్న సంస్థలు అమెరికా సైన్యం లేదా తమ దేశ ప్రయోజనాలను దెబ్బతీయాలని చూస్తే అడ్డుకుని తమవారిని కాపాడుకుంటామని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాయలం పెంటగాన్ ప్రతినిధి మేజర్ జనరల్ పాట్ రైడర్ స్పష్టం చేశారు.

**గట్టి సమాధానం ఇస్తాం..** అమెరికా బాంబర్లను తరలిస్తున్న సంగతి తెలిసి ఇరాన్ మండిపడింది. అగ్ర రాజ్యానికి తాము గట్టి సమాధానం చెబుతామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఇలాగైతే తమ అణు విధానాన్ని పునః పరిశీలించాల్సి ఉంటుందని ఖమేనీ సలహాదారు కమాల్ ఖర్రాజ్ కూడా స్పష్టం చేశారు. ఒకవేళ తమపై దాడికి దిగితే అణు విధానంలో మార్పులు చేస్తామనేది దీని ఉద్దేశంగా తెలుస్తోంది. ఇటీవల ఉక్రెయిన్ డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు రష్యా సైతం ఇదే విధంగా అణు విధానంలో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ కమాండోలు రంగంలోకి అమెరికా బాంబర్ గల్ఫ్ కు వస్తుండగా.. ఇరాన్ హెచ్చరికల నడుమ ఇజ్రాయెల్ కమాండోలు రంగంలోకి దిగారు. లెబనాన్ లోని పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. లెబనాన్ తీరంలో ఓ హెజ్‌బొల్లా సీనియర్ ఆపరేటివ్ ను అదుపులోకి తీసుకొన్నారు. దీనిపై లెబనాన్ సైన్యం, ఐరాస శాంతి పరిరక్షక దళం దర్యాప్తు మొదలుపెట్టాయి.

# 4,000 ఏళ్ల నాటి పురాతన కోట వెలుగులోకి.. ఎక్కడ ఉందంటే..!

సౌదీ అరేబియాలో అద్భుతం చోటుచేసుకుంది. ఆధునిక కాలంలో ఒయాసిస్‌లో దాగి ఉన్న 4,000 ఏళ్ల నాటి పునరాతనమైన కోట వెలుగుచూసింది. అల్-నాతాహ్ అని పిలువబడే ఈ పట్టణం గోడల ఒయాసిస్ ద్వారా చాలాకాలం పాటు దాచుకున్నాయి. పురాతన కోటను చూసిన వారంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఫ్రెంచ్ పురావస్తు శాస్త్రవేత్త గుయిలౌమ్ చార్లౌక్స్ నేతృత్వంలోని బృందం చేసిన పరిశోధన ప్రకారం ఆ ప్రదేశంలో పురాతన 14.5 కిలోమీటర్ల పొడవైన గోడను కనుగొన్నారు. క్రీ.పూ. 2400 సంవత్సరంలో అక్కడ 500 మంది నిర్వాసితులు ఉన్నట్లుగా తెలుస్తోంది. మనషి సంచార జీవనశైలి నుంచి పట్టణ జీవనశైలికి క్రమంగా మారడాన్ని దీనిని చూస్తే అర్థం చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. దాదాపు వెయ్యి ఏళ్ల తరువాత దీనిని వదిలివెళ్లినట్లుగా



ఆర్కిటెక్చరల్ నిపుణులు చార్లక్స్ తెలిపారు. అల్-నాతాహ్ నిర్మించినప్పుడు సిరియా నుంచి జోర్డాన్ వరకు మధ్యధరా సముద్రం వెంబడి లెవాంట్ ప్రాంతంలో నగరాలు అభివృద్ధి చెందాయి. ఖైబర్ అనే పూర్తి ఎడారి ప్రాంతం కాగా.. సంచార జాతులు ఎక్కువ జీవించేవారని తెలుస్తోంది. ఈ ఏరియా పూర్తిగా శ్మశాన వాటికలతో నిండి ఉండడాన్ని చూడొచ్చు. పునరాతన కోటతో కూడిన ఈ పట్టణం సంచార ఉనికి నుంచి స్థిరపడిన జీవనశైలికి ప్రారంభ కాంస్య యుగంతో నేరుగా సంబంధం కలిగి ఉంది. ఫ్రెంచ్-సౌదీ బృందం సైట్ యొక్క వైమానిక సర్వేలను నిర్వహించింది. 50 వేర్వేలు నివాసాలు, 14.5 కిలోమీటర్ల పొడవైన గోడను కలిగి ఉంది. దట్టమైన క్లస్టర్డ్ నిర్మాణం ఫొటోలను ఈ సర్వే బృందం సేకరించింది. సైట్ సుమారు 2.6 హెక్టార్లలో కలిగి ఉన్నట్లు వెల్లడించింది. ఇది స్థిరవాసుల ప్రణాళికబద్ధమైన నగరమని, అక్కడి మౌలిక సదుపయాలు, వారి రక్షణ, సామాజిక పరస్పర చర్యలను చూపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు బసాల్ట్ అని పిలువబడే నల్లని అగ్నిపర్వత శిలలు అల్-నతాహ్ గోడలను కనిపించకుండా చేశాయి. అక్రమ తవ్వకాల ద్వారా ఈ కట్టడం ఇప్పుడు బయటపడింది.

# చురకలు

## సంపాదకీయం

## నాడు జగన్... నేడు చంద్రబాబు సేమ్ టు సేమ్ జరిగిందా..?

ఏపీలో ఏదో జరిగిపోతోందని.. రాష్ట్రం అప్పుల మయం అయిపోతోందని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన విషయం గుర్తుంది కదా! వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు ఊరూ వాడా ప్రచా రం చేసిన విషయం గుర్తుంది కదా! ఏపీని శ్రీలంకతో కొన్ని రోజులు, ఉగాండా వంటి అత్యంత దుర్భర ఆఫ్రికన్ దేశంతో మరికొన్ని రోజులు పోలుస్తూ... నాయకులు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. జగన్ జమానా అప్పులు ఖజానా నినాదాన్ని కూడా ఊరూ వాడా ప్రచారం చేశారు. కట్ చేస్తే.. ఈ విషయం ఒక్కటే కాదు.. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ.. ఇలానే ప్రచారం జరిగింది. ఈ ప్రాజెక్టు ఎత్తును జగన్ తగ్గించేస్తున్నారని, ఇక, ఇది ఒక మధ్యతరహా ప్రాజెక్టుగానే (ప్రకాశం బ్యారేజీ టైపు) మారిపోనుందని కూడా చెప్పుకొచ్చారు. కేంద్రంతో లాలూచీ పడ్డారని కూడా వ్యాఖ్యానించారు. గుండెలు బాదుకున్నారు. కన్నీరు పెట్టుకోలేదు అంతే! కథ ఇక్కడితో కూడా ముగియలేదు. గౌతం అదానీకి రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు. రోజూ అవే విమర్శలు. అవే కథనాలు. అవే వార్తలతో రాష్ట్ర వ్యాప్తంగా హోరెత్తించారు. ఇక్కడ యూటర్న్ తీసుకుంటే.. ఇప్పుడు ఇవే కథనాలు, ఇవే విమర్శలు అటు వైసీపీ శిబిరం నుంచి వినిపిస్తున్నాయి. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అప్పులు మయం చేస్తోందని, వచ్చిన నాలుగు మాసాల్లోనే 72 వేల కోట్ల అప్పులు చేశారని వైసీపీ అనుకూల మీడియా ప్రచారం చేస్తోంది. అంతేకాదు.. పోలవరం గురించి గత నాలుగు రోజులుగా కథనాలు రాసన్తానే ఉన్నాయి. ఎత్తు తగ్గించేస్తున్నారని.. బ్యారేజీ అయిపోయిందని కూడా రాసుకొచ్చారు. ఇక, ఇదేసమయంలో అదానీకి చంద్రబాబు రాష్ట్రాన్ని రాసిచ్చేస్తున్నారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. అటు పక్షం ఇటు, ఇటు పక్షం అటు మారింది. విషయం మాత్రం అలానే ఉంది. దీనికి కారణం.. అధికారం దక్కించుకోవడం ఒకరి పక్షం, చేజారిన పక్షం ఇంకొకటి. కానీ, వాస్తవం మాత్రం.. ఎప్పుడూ జరిగేదే. అది కేంద్రం నిర్దేశించేదే. అన్ని రాష్ట్రాలకూ అప్పులు చేసుకునే వెసులు బాటు కేంద్రమే కల్పించింది. కాబట్టి అప్పుడైనా.. ఇప్పుడైనా అప్పులు తప్పవు. అదానీకి ప్రాజెక్టులు అప్పగిస్తే.. మోడీ కళ్లలో ఆనందం కోసం .. ఆనాడు జగన్ వ్యవహరించారు. ఇప్పుడు కూడా సేమ్ టు సేమ్ జరుగుతోంది. అలానే.. పోలవరం ఎత్తు విషయంలో వివాదం లేకుండా కేంద్రం చేసిన మధ్యే మార్గ నిర్ణయం ఎత్తు తగ్గింపు. తద్వారా.. ఒడిశా, తెలంగాణల నుంచి వస్తున్న వివాదాలకు చెక్ పెట్టింది. ఇది ఎప్పుడు జరిగినా.. కేంద్రం తీసుకున్న నిర్ణయానికే ఏపీ కట్టుబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాలు సామాన్య ప్రజలకు తెలియదు. కానీ, రాజకీయంగా మాత్రం ఈ విషయాలు ఇరు పక్షాలకు ఆయుధాలుగానే మారాయి. అంతే తేడా..!

## తెలంగాణ విముక్తి కోసం జీవితాంతం పోరాడిన నల్ల నరసింహులు - నవంబర్ 5.... నరసింహులు వర్ధంతి

1945 దశకంలో పెను ఉప్పెనై పోటెత్తిన తెలంగాణ సాయుధ విముక్తి పోరాట కెరటాల్లో ఒక ఉత్తుంగ తరంగమై విప్లవించాడు నల్లా నరసింహులు. 1945 నుండి 1951 వరకు నిజాం ప్రభుత్వ దన్నుతో రజాకార్లు దేశముఖ్ లు, సర్దేశ్ ముఖ్ లు, దేశాయిలు, సర్ దేశాయిలు, జమీన్దార్లు, తెలంగాణ ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక అణచివేత, హత్యాకాండ, దోపిడికి వ్యతిరేకంగా, జరిపిన ప్రసిద్ధి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సందర్భంలో జనగామ ప్రాంత దళ నాయకత్వం వహించిన పోరాట యోధుడు ఆయన. నాడు నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిజాం తరుపున పన్నులు వసూలు చేసే అప్రత్యక్ష అధికారాన్ని చేజిక్కించుకున్నారు కొందరు భూస్వాములు. లక్షల, వేల కొద్ది ఎకరాల భూమిని తమ స్వాధీనంలో పెట్టుకాగా, ఆ భూములను సాగుచేసి పండించే రైతులు మాత్రం కొలుదార్లే, కూలీలై, పెట్టి బానిసలై బతుకుల నీడుస్తున్న దయనీయ కాలంలో చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపు దిద్దుకుంది. దానికి నాయకత్వం వహించిన 'ఆంధ్ర మహాసభ' లో అత్యంత కీలక పాత్ర వహించి వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ వీరోచిత విముక్తి పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసి చేసి, ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి, చిత్ర హింసలకు గురై, కేసుల పాలై, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి, ధైర్యంగా తన వాదనలను వినిపించి తెలంగాణ టైగర్' అని కీర్తించబడ్డ అసామాన్య వీరకిశోరం నల్ల నరసింహులు. భారత స్వాతంత్ర్యం, హైదరాబాద్ విలీనం సందర్భాల మధ్య కాలంలో జరిగిన వేలాది మంది మరణాలకు, ఊచ కోతలకు, మాన భంగాలకు, హత్యలకు పైశాచిక హింసకు సాక్షమై నిలిచిన సంధి సమయాన్ని చారిత్రాత్మక 10 లక్షల ఎకరాల భూ విముక్తి తర్వాత దాన్ని పేదలకు పంచిన ప్రజా విజయ ఘటనకు ప్రతీకగా నిలిచిన వాడు నల్ల నరసింహులు. నరసింహులు గ్రామం కడవెండి. అతి మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవాడు. దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా.. ఏండ్లకు ఏండ్లు అజ్ఞాతంలో ఉంటూ విప్లవించిన సాయుధ యోధుడు ఆయన. తెలంగాణ ప్రాంతం భూస్వాముల, నిజాం తాబేదార్ల ఉక్కు పాదాల



కింద నలిగిపోతూన్న సందర్భంలో ఆంధ్ర మహాసభ రూపంలో కమ్యూనిస్టు కార్యక్రమ వేదిక ఒక కొత్త పరిస్థితి తెచ్చింది. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, నైతిక విలువలతో, మానవత్వంతో తమకున్న ఆస్తులను ప్రజల పరం చేశారు. గ్రామీణ తెలంగాణను సంఘటిత పరుస్తూ భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామ దళ నిర్మాణం చేపట్టారు. అలా జనగామ తాలూకాలోని ఎన్నో గ్రామాల్లో దళాలను నిర్మించి, స్వయంగా నాయకత్వం వహించి పార్టీ అగ్ర నాయకుల సమన్వయం తో విప్లవించిన కొదమ సింహం నరసింహులు. అటు భూస్వాములకు, ఇటు రజాకార్లకూ సింహ స్వప్నమై నిద్రలేకుండా చేశాడు. మొట్టమొదటి తిరుగు బాటు తన స్వంత ఊరు నుండే మొదలుపెట్టి 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దోపిడి దారులైన భూస్వాములను తరిమికొట్టేందుకు 'సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చాడు. ఆ పిలుపు యుద్ధ భేరీగా మారి, తెలంగాణ నేల నాలుగు చెరగులా ప్రత్యేకించి భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకు పోయిన నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాలలో ఎర్ర జెండాల నీడలో లక్షలాది మంది నిరక్షరాస్య సుశిక్షత ప్రజాసైన్యం ఎక్కడిక్కడ గడీలపై, ఖాసీం రజ్వీ నాయకత్వంలో పని చేసే రజాకార నిజాం పోలీస్ క్యాంపులపై మెరుపు దాడులు చేస్తూ ముందుకు సాగింది. వేలకొద్ది ఎకరాల భూములను విముక్తం చేస్తూ, బహిరంగంగానే దున్నే వాడికే భూమిని పంచిపెడ్తూ, వందలు వేలమంది కర్కశ నిజాం సైన్యాలకు, రజాకార్లకూ బలై ప్రాణాలను కోల్పోతూ 1951 వరకు కొనసాగింది. పోరాట దళాలలను, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి, నాయకత్వం వహించి, కదన రంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు పట్టుబడి చిత్ర హింసలను సహించి, అనేక కేసుల్లో ఇరికించబడి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి అజేయంగా నిలిచిన ధీరుడు నల్లా నరసింహులు. పోలీస్ చర్య అనంతరం యూనియన్ సైన్యాలు నిషిద్ధ కమ్యూనిస్ట్ సభ్యులను అడవుల్లోకి తరుముతూన్న సందర్భంగా, పట్టు బడి, ఉరి శిక్ష విధించ బడగా, అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళన ఫలితంగా ఉరితీతకు 12 గంటల ముందు ఉరిశిక్ష నిలిపివేయబడడం విశేషం. ఇంతకూ నల్లా నరసింహులు ఎవరు ? అని నాటి యూనియన్ సైనిక జనరల్ జె.ఎస్. చౌదరి నల్లగొండ జైలుకు చూడ్డానికి వచ్చినప్పుడు ఆ జిల్లా ఎస్.పి. ధన్ రాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహులు "టైగర్ ఆఫ్ తెలంగాణ" అని పరిచయం చేయడం గమనార్హం. నెహ్రూ ప్రభుత్వాన్ని కూల దోయడానికి ప్రయత్నిస్తున్నారని స్టేట్ కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు నివేదికల వల్ల నిషేధానికి గురై, అజ్ఞాత నాయకులను లొంగి పోవాల్సిందిగా హెచ్చరించిన నేపథ్యంలో నరసింహులు వంటి అనేక మంది యోధులు జనావా సాలను వీడి, నల్లమల్ల,రాచకొండ అరణ్యాల్లోకి నిష్క్రమించగా, చివరికి విచిత్రమైన పరిస్థితుల్లో 1951 అక్టోబర్ లో 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తున్నట్టుగా కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన వెలువడడం ద్వారా ఉద్యమం అనూహ్యంగా చల్లారి పోయింది. భారత దేశంలో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైన తరువాత కూడా అనేక కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి చివరికి అప్పటి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరిశిక్ష నుండి బయటపడి, అంతిమంగా 1959 జనవరి 26న స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చాడు నరసింహులు. పోరాట స్మృతులతో తన ధర్మపత్ని వజ్రమ్మ తో కలసి చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వేలాది వీరులను, పిడిత ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమి పంపక విజయాలనూ స్మరించుకుంటూ... తృప్తితో జీవితాన్ని నమ్మిన సిద్ధాంతం కోసమే దారబోసి, త్యాగ ధనునిగా నరసింహులు 1993 నవంబర్ 5న ఈ లోకం వదిలి వెళ్లాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## "సునామీ" లపై అవగాహన అవసరం "విజ్ఞాన వాహిని" భాగ్య నగరానికి గర్వ కారణం

### నవంబర్ 5... ప్రపంచ సునామీ అవగాహన దినం సందర్భంగా




సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%-%6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## శాస్త్రవేత్తలకు ప్రేరణలు... జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్ పరిశోధనలు... - నవంబర్ 5...జె.బి.ఎస్. హాల్డేన్ జయంతి

జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్, జన్యు శాస్త్రంలో, అలాగే పరిణామ సిద్ధాంతంలో చేసిన కృషి ద్వారా శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలిచారు. 20వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో ఆయన సృష్టించిన పరిశోధనల కారణంగా, జన్యు శాస్త్రం మరియు పరిణామానికి సంబంధించి అనేక నూతన ఆవిష్కరణలు, సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. జె.బి.ఎస్. హాల్డేన్ 1892లో లండన్‌లో జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ జాన్ స్కాట్ హాల్డేన్ కూడా ప్రఖ్యాత శాస్త్రవేత్త, పరిశోధకుడు, వైద్యుడు. తన తండ్రి స్ఫూర్తితోనే హాల్డేన్ చిన్నప్పటి నుంచే శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆయన ప్రాథమిక విద్యనంతా ఇంగ్లాండ్‌లోనే అభ్యసించి, ఆక్స్ఫర్డ్ విశ్వ విద్యాలయంలో జీవశాస్త్రం, రసాయన శాస్త్రాలలో ప్రత్యేకత సాధించారు. ఆయన విద్యాభ్యాసంలో పొందిన పరిజ్ఞానం, పరిశోధన పట్ల ఉన్న మక్కువ అతన్ని ఒక గొప్ప శాస్త్రవేత్తగా తీర్చిదిద్దింది. హాల్డేన్ చేసిన ముఖ్యమైన పరిశోధనలలో జన్యువుల క్రియాశీలత ప్రాధాన్యత గలదిగా నిలిచింది. జన్యువులు జీవుల లక్షణాలను ఎలా నియంత్రిస్తాయి, వాటి ఆధారంగా వంశపారంపర్య లక్షణాలు ఎలా సంక్రమిస్తాయో విశదీకరించారు. ఈ పరిశోధనలకు ఆధారంగా, జెన్యు శాస్త్రంలో అనేక పరిశోధనలు ప్రారంభమయ్యాయి. డార్విన్ ప్రవేశపెట్టిన సహజ ఎంపిక సిద్ధాంతాన్ని హాల్డేన్ గణిత శాస్త్ర సూత్రాలతో వివరిస్తూ, పరిణామం ప్రక్రియను గణిత శాస్త్రీయంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఈ గణిత నమూనాలు పరిణామ ప్రక్రియలో సహజ ఎంపికను అర్థం చేసుకోవడంలో ముఖ్యపాత్ర పోషించాయి. ఆయన చేసిన గణిత శాస్త్ర విశ్లేషణ, తరువాతి కాలంలో జన్యు శాస్త్రం యొక్క గణిత నమూనాలకు బాటలు వేసింది. మానవ జన్యుశాస్త్రం రంగంలో కూడా హాల్డేన్ సాంకేతిక పరిజ్ఞానాలను అన్వయించారు. ఆయన మానవ జన్యు వైకల్యాలు మరియు వ్యాధులపై పరిశోధనలు చేశారు. జన్యు సమస్యలు ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయో ఆయన విశదీకరించారు. ఆయన పరిశోధనలు జన్యు వైకల్యాల పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. హాల్డేన్ పరిణామ శాస్త్రానికి గణితం ఎలా అన్వయించాలో ప్రాథమిక సూత్రాలు రూపొందించారు. ఆయన పనిచేసిన ముఖ్య అంశం, ప్రజలలో ఉన్న వేరియేషన్స్ (%ఝుతీఞు-ఱశీఅం%) సగటు జీవితకాలం, జన్యు వైవిధ్యాలకు సంబంధించిన గణిత నమూనాలను అర్థం చేసుకోవడం. ఈ గణిత నమూనాలు సహజ ఎంపిక ప్రక్రియలను సులభంగా అర్థం చేసుకోవడంలో తోడ్పడ్డాయి. హాల్డేన్ చేసిన ఈ కృషి, నేడు జన్యు శాస్త్రం అధ్యయనం చేసే శాస్త్రవేత్తలకు ప్రేరణగా ఉంది. హాల్డేన్ బహుముఖ ప్రతిభావంతుడు. శాస్త్రవేత్తగా కాకుండా సామాజిక సమస్యలపై కూడా విప్లవాత్మక దృక్పథం కలిగి ఉన్నారు. ప్రజలలో శాస్త్ర విద్యను ప్రోత్సహించాలని, శాస్త్రాన్ని సామాన్య ప్రజలకు చేరవేయాలని ఆయన ఆశించారు. రాజకీయంగా సైతం ఒక సామాజికవాది దృక్పథం కలిగి, శాస్త్ర పరిజ్ఞానం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని విశ్వసించారు. హాల్డేన్ పరిశోధనలు పరిణామ శాస్త్రం మరియు జన్యు శాస్త్రంలో ఒక కొత్త దశను సృష్టించాయి. ఆయన ఆవిష్కరించిన సిద్ధాంతాలు తదుపరి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలిచాయి. పరిశోధనలే కాకుండా శాస్త్ర విద్యను సామాజిక విప్లవానికి అన్వయించి, శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ప్రజల అభివృద్ధికి వినియోగించుకోవాలనే



స్ఫూర్తిని అందించారు. జె.బి.ఎస్. హాల్డేన్ వంటి శాస్త్రవేత్తలు జన్యు శాస్త్రంలో గణనీయమైన మార్పులకు పునాది వేశారు. ఆయన పరిశోధనలు పరిణామ శాస్త్రానికి మైలురాయి, నేటి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# నగదు రహితం.. పారదర్శకం

సంగారెడ్డి : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణ వాయిదాల చెల్లింపుల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. స్త్రీనిధి రుణ వాయిదాలకు నగదు రహిత చెల్లింపులనూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ విధానంతో పారదర్శకత పెరగడంతోపాటు చెల్లింపులకు ముందుకు వచ్చే మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ప్రోత్సాహకాలు(ఇన్సెంటివ్స్) అమలు చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముంది.

**గందరగోళానికి తావులేకుండా..**

స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపులు కొంత గందరగోళంగా ఉంటున్నాయి. రుణం తీసుకున్న సభ్యురాలు గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించే రోజు వాయిదా మొత్తాన్ని వీవోఏకు ఇవ్వాలి. అధ్యక్షురాలి సంతకంతో సభ్యురాలికి రశీదు అందజేయాలి. చాలా చోట్ల ఇది అమలు కావడం లేదు. దీంతో సభ్యురాలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. తాను చెల్లించిన సొమ్ము సంబంధిత ఖాతాకు జమవుతుందో లేదో తెలియని పరిస్థితి. డిజిటల్ విధానంలో చెల్లింపులతో ఆ సమస్య ఉండదు. ఒక్కో సంఘానికి ప్రత్యేకంగా గుర్తింపు సంఖ్య(ఐడీ నంబర్లు) కేటాయించారు. చరవాణిలో డిజిటల్ చెల్లింపుల ఐచ్ఛికాన్ని ఎంచుకొని పొదుపు సంఘానికి చెందిన ఐడీ నంబరును నమోదు చేయాల్సి ఉంటుంది. రుణ వాయిదాల చెల్లింపునకు సంబంధించిన ఐచ్ఛికాన్ని ఎంచుకొని చెల్లింపులు చేయవచ్చు. దీనిపై వీవోఏలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



**సభ్యురాలి ఖాతాకు జమ**

బ్యాంకు రుణ వాయిదాలు ప్రతి నెలా 10వ తేదీలోపు చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపులు అలా కాదు. నిర్ణీత తేదీ రోజు చెల్లించాల్సిందే. ఒక్క రోజు ఆలస్యమైనా అపరాధ రుసుం భరించాల్సి ఉంటుంది. సభ్యురాలు సకాలంలో చెల్లించినా వీవోఏ నిర్లక్ష్యం చేసినా, సొంతానికి వాడుకున్నా సభ్యురాలికే నష్టం. నగదు రహిత చెల్లింపు పద్ధతిలో నిర్ణీత గడువు రోజే డిజిటల్ విధానంలో చెల్లింపులు చేసేందుకు వీలుంటుంది. ఇలా చెల్లించడం వల్ల సభ్యురాలు చెల్లించే వడ్డీలో 0.5శాతం మొత్తాన్ని ఇన్సెంటివ్‌గా ఇస్తారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ శ్రీనాథ్ తెలిపారు.

జిల్లాలో మహిళా సంఘాలు: 18,208
వాటిలో సభ్యులు: 1.91
లక్షలుస్త్రీనిధి రుణాల లక్ష్యం: రూ.137.80 కోట్లు
ఇప్పటి వరకు పంపిణీ: రూ.41 కోట్లు

# తలనీలాలు.. కొలిక్కిరాదేమీ!

చేర్యాల: దేవదేవుల సృష్టి అయిన ఈ ప్రపంచాన్ని ఆస్వాదించడానికి మానవుడు అడుగిడేటప్పుడు ముందుగా తల బయటకు వస్తుంది. ఊపిరి వందేళ్ల పాటు ఉంటుంది. ఈ నేపథ్యంలో దేవుళ్లకు కృతజ్ఞత తెలపడానికి.. కోరిన కోరికలను తీర్చుకోవడానికి మొక్కులకు సాధారణంగా భక్తులు తలనీలాలు (తలపై వెంట్రుకలు) సమర్పిస్తారు. తలనీలాల సమర్పణకు దేవాలయాల్లోని కల్యాణకట్ట వద్ద రద్దీ అధికంగా ఉంటుంది. తల వెంట్రుకలకు ప్రపంచ మార్కెట్‌లో అధిక గిరాకీ ఉంది. వాటిని వేలం పాట నిర్వహించి గుత్తేదారులకు లైసెన్స్ జారీ చేస్తారు. ఏడాది పాటు తలనీలాలు పోగు చేసుకొని, ఏ రోజుకారోజు శుద్ధి చేసి వారికి సంబంధించిన కంపెనీలకు వెంట్రుకలను తరలిస్తారు.

**కొమురవెల్లిలో 30 ఏళ్ల నుంచి వేలం**

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద దాదాపు మూడు దశాబ్దాలుగా తలనీలాలకు వేలం పాట నిర్వహిస్తున్నారు. అంతకుముందు భక్తులే ఇష్టారీతిన క్షురకుల వద్ద గుండు చేయించుకొని వెళ్లిపోయేవారు. ఇక్కడ 1993లో ప్రత్యేకంగా వేలం పాట ఆరంభించారు. మొట్టమొదటి సారి రూ.1.50 లక్షలతో వేలం పాట మొదలైంది. నిరుటి వరకు రూ.86లక్షలకు చేరుకుంది. వేలంలో ఎక్కువగా వైజాగ్, గుంటూరు, హైదరాబాద్ గుత్తేదారులు పాల్గొంటున్నారు. సీల్డ్ కవర్‌లో గుత్తేదారులు నమోదు చేసిన ధరలో అధికంగా కోట్ చేసిన సంఖ్య నుంచి బహిరంగ వేలం పాటను మొదలు పెట్టే విధానాన్ని పాటిస్తున్నారు. పోగేసిన వెంట్రుకలను శుద్ధి చేయడం, నిల్వ ఉంచడం, వాటిని కంపెనీలతో ఒప్పందమై తరలించడం ఇవన్నీ భారీ వ్యాపారం. ఈ సంవత్సరం మాత్రం గుత్తేదారులు ముందుకు రావడం లేదు.



**ఐదు సార్లు వాయిదా**

గత ఏడాది వచ్చిన ఆదాయం కంటే కనీసం 10 శాతం ఈసారి ఎక్కువగా వేలం పాట రావాలని అధికారులు చూస్తారు. ఈ సంవత్సరం కనీసం నిరుడు వచ్చిన వేలం కూడా రావడం లేదు. గత ఏడాది నుంచి అంతర్జాతీయంగా వెంట్రుకలకు డిమాండ్ పడిపోయిందనే కారణాన్ని గుత్తేదారులు చెబుతున్నారు. కొమురవెల్లి ఆలయంలో, హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో మొత్తం 5 సార్లు వేలం నిర్వహించినా రూ.62 లక్షలు వద్ద ఆగింది. గత ఏడాది కంటే రూ.24 లక్షలు తక్కువగా రావడంతో ఈవో బాలాజీ వేలాన్ని వాయిదా వేశారు.

**కమిషనర్‌కు నివేదించా ఆలూరు బాలాజీ, ఈవో, కొమురవెల్లి ఆలయం**

కొమురవెల్లిలో మూడు సార్లు నిర్వహించాం. సరైన వేలం పాట రాకపోవడంతో రెండుసార్లు హైదరాబాద్‌లో చేపట్టాం. నిరుటి కంటే తక్కువగా వచ్చింది. అందువల్ల తుది నిర్ణయం కోసం కమిషనర్‌కు నివేదిక సమర్పించాం.

# సలూజా ఆసుపత్రి కేంద్రంగా మత్తు దందా!



హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజారులోని సలూజా ఆసుపత్రి కేంద్రంగా భారీ మత్తు దందా గుట్టు రట్టయింది. ఔషధ నియంత్రణ శాఖ, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ఆసుపత్రితో పాటు యజమాని రాజేంద్రసింగ్ సలూజా, మత్తు మందుల సరఫరాదారు మౌలాలికి చెందిన నేహ భగవత్ ఇళ్లల్లో పెద్దఎత్తున మత్తుమందు నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి బుధవారం వివరాలు విడుదల చేశారు. రాజేంద్రసింగ్ సలూజా రెజిమెంటల్ బజార్‌లో జీపీ సలూజా పేరుతో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఆసుపత్రిలో, ఇంట్లో మత్తుమందులు నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆసుపత్రికి మౌలాలిలో ఉంటున్న నేహ భగవత్ మత్తుమందులు సరఫరా చేస్తున్నారు. ఫెంటానేల్, కేటామైన్, పెంటాజోసిన్, మిడాజోలం, మార్ఫిన్ ఇంజక్షన్లు, టాబ్లెట్లు పెద్దఎత్తున నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. గతంలో నేహ భగవత్‌పై ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం రెండు కేసులున్నాయి. అరెస్టు అయి సెప్టెంబర్‌లో బెయిల్‌పై వచ్చాడు. మళ్లీ ఇదే తరహా దందా చేస్తూ దొరికిపోయాడు.

ఈ సందర్భంగా ఫెంటానేల్ 98 ఆంపోల్స్, కేటామైన్ 20 ఇంజక్షన్ సీసాలు, పెంటాజోసిన్ 70 ఆంపోల్స్, మిడాజోలం 9 సీసాలు, సక్సినైల్కోలిన్ 12 ఇంజన్ సీసాలు, పెంటాజోసిస్ లాక్టేట్ 400 ఇంజక్షన్ సీసాలు, మార్ఫిన్ సల్ఫేట్ 200 ఇంజక్షన్ సీసాలు తదితర మత్తుమందులను పెద్దఎత్తున స్వాధీనం చేసుకొన్నారు. నేహ భగవత్, జీవి ఆసుపత్రిలో పనిచేస్తున్న పట్వారి గోపీనాథ్, సలూజా ఆసుపత్రి టెక్నీషియన్ సురేంద్రసింగ్, ఆసుపత్రి ఫార్మాశిస్టు బి.శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రసింగ్ సలూజా, ఆయన భార్య, సలూజా ఆసుపత్రిలో వైద్యురాలు అమృతసింగ్ సలూజా, దినేష్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

# యువ హవా.. సేవకు తోవ..!



సిద్దిపేట: యువత వేడుకలు.. సంబురాలకే కాదు.. సేవకుసై అంటున్నారు. సామాజిక చైతన్యంలో కీలక భూమిక పోషిస్తున్నారు. మన పట్టణం.. మన దేశం.. మనమంతా ఒక్కటే అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ ఇతరులకు ప్రేరణగా నిలుస్తున్నారు. చీపుర్లు చేతబూని.. శ్రమదానం చేస్తున్నారు. వాహన చోదకులకు ట్రాఫిక్ పాఠాలు చెబుతున్నారు. ఆపద.. కష్టం ఎదురైన వారికి బాసటగా నిలుస్తూ.. మానవీయత చాటుతున్నారు. అందుకు నిదర్శనమే ఎన్‌వైకే (నెహ్రూ యువ కేంద్రం) ఆధ్వర్యంలో సిద్దిపేటలో చేపట్టిన 'దివాళి విత్ మై భారత్' కార్యక్రమం. మూడు రోజుల పాటు కొనసాగిన కార్యక్రమ తీరుతెన్నులు ఇలా..

**500 మంది భాగస్వామ్యం**

పట్టణంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన యువత, యువజన సంఘాల సభ్యులు సేవాభావాన్ని చాటడంలో ప్రత్యేకంగా నిలిచారు. ప్రజల ప్రశంసలు అందుకున్నారు. దీపావళి పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టింది. సిద్దిపేటలో ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ(స్వయం ప్రతిపత్తి), మహిళా డిగ్రీ, ఇందూరు ఇంజినీరింగ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, యువజన సంఘాలు, లయన్స్ క్లబ్ సభ్యులు మొత్తంగా 500 మంది భాగస్వాములయ్యారు. మూడు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు సామూహికంగా జన చేతన తెచ్చారు.

**చేపట్టిన కార్యక్రమాలు..**

సిద్దిపేటలోని రైతుబజారు, పాత మార్కెట్, సమీకృత మార్కెట్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. చీపుర్లు చేతబూని చెత్త ఏరివేశారు. స్టాళ్ల వద్ద, పరిసరాలు శుభ్రం చేశారు. రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్లాస్టిక్ నిషేధ ప్రాధాన్యం వివరించారు. ట్రాఫిక్ విధుల్లో భాగస్వాములయ్యారు. సిద్దిపేటలో వివిధ కూడళ్లలో స్వచ్ఛందంగా సేవలు అందించారు. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు సవ్యంగా ముందుకు సాగేలా చొరవ చూపారు.సిద్దిపేట సర్వజన ఆసుపత్రిలో రోగులకు సహాయకులుగా మారారు. వివిధ విభాగాల్లో వైద్యులకు సహకారం అందించారు. ఆయుష్మాన్ భారత్ యాప్‌పై అవగాహన కల్పిస్తూ చరవాణుల్లో నిక్షిప్తం చేయించారు.

**స్ఫూర్తి కొనసాగించాలి**

విద్యార్థి దశ అత్యంత కీలకమైంది. ఇప్పుడు వేసే అడుగులు భవిష్యత్తును ప్రతిబింబిస్తాయి. సేవ వైపు మళ్లించడం శుభపరిణామం. క్షేత్రస్థాయి పర్యటనలతో మంచి ఫలితాలు ఉంటాయి. యువత ఈ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలి.కనకచంద్రం, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

**యువతలో మార్పు..**

యువతలో మార్పు తెచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి. మై భారత్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి. 15-29 ఏళ్ల వయసున్న వారు వివరాలు నమోదు చేసుకొని సేవలో భాగస్వాములు కావాలి. వివిధ అంశాలపై ఆన్‌లైన్ వేదికగా శిక్షణలు అందిస్తారు. కళాశాలలకు చెందిన యువత, కార్యక్రమ అధికారులు, యువజన సంఘాల సభ్యులు చక్కటి భాగస్వామ్యం అందించి 'దివాళి విత్ మై భారత్'ను విజయవంతం చేశారు. పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తాం. కిరణ్‌కుమార్ (జిల్లా కార్యక్రమ అధికారి), ఎన్‌వైకే రంజిత్‌రెడ్డి(జిల్లా యువజన అధికారి)

# ఆదాయ వనరులపై ఏఎంసీ దృష్టి

గజ్వేల్: నిర్వహణ గుదిబండగా మారిన గజ్వేల్‌లోని సమీకృత విపణి.. ఆదాయ వనరులపై దృష్టి సారించింది. విపణికి రెండు వైపులా వాణిజ్య దుకాణాలు నిర్మించి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు పాలకమండలి ఏకగ్రీవ తీర్మానం చేసింది. వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వం రూ.22.85 కోట్లతో 6.24 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత విపణిని నిర్మించింది. 2019 డిసెంబర్ నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో 16 దుకాణ సముదాయాలు, 1 సూపర్ మార్కెట్తో పాటు 246 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇందులో 52 స్టాళ్లు మాంసం విక్రేతలకు, 45 పూలు, పండ్ల విక్రేతలకు కేటాయించారు. అన్నింటికి కలిపి నెలకు రూ.3లక్షల అద్దెలు వసూలు అవుతుండగా, ఉద్యోగులు, కార్మికులు, విద్యుత్తు బిల్లుతో కలిపి నెలకు రూ.4.50లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రతినెలా రూ.లక్షల్లో భారం మోయాల్సి వస్తుండటంతో ఏఎంసీకి గుదిబండగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దుకాణాలు నిర్మించాలని నూతన ఏఎంసీ పాలకమండలి తీర్మానించింది.

**తీరనున్న చిరు వ్యాపారుల చింత**

విపణి నిర్మాణం కారణంగా అడ్డాలు కోల్పోయిన చిరు వ్యాపారులు ఐదేళ్లుగా యాతన పడుతున్నారు. రోడ్ల పక్కన దుకాణాలు పెట్టుకొని వర్షాలకు, ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపణి నిర్మించక ముందు ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగేది. దానికి మూడు



వైపులా వందలాది చిరు వ్యాపారులు డబ్బాలు వేసుకుని వస్తువులు విక్రయించుకుంటూ జీవనం సాగించేవారు. విపణి నిర్మించే సమయంలో.. మడిగెలు నిర్మించి అద్దెకిస్తామని వారికి చెప్పారు. తరువాత విషయం మరుగున పడిపోయింది. దీంతో చిరు వ్యాపారులు రోడ్డు పక్కన వ్యాపారాలు సాగిస్తున్నారు. పట్టణ మధ్యలో విపణి ఉండటంతో ఇక్కడ దుకాణాలకు మంచి డిమాండు ఉంది. విపణికి రెండు వైపులా దాదాపు 60 దుకాణాలు నిర్మించాలని గత పాలకమండలి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఈ విషయం కొలిక్కిరాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో దృష్టి సారించారు. దుకాణాల నిర్మాణానికి ఏకగ్రీవ తీర్మానంతో అడుగుపడినట్లైంది.

# పత్తి కొనుగోలుకు సన్నద్ధం

సంగారెడ్డి : ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పంట విక్రయాలకు దళారులను ఆశ్రయించి మోసపోకుండా.. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించేలా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సన్నద్ధమవుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఈసారీ సీసీఐ కొనుగోలు చేయనున్నది. నవంబరు రెండో వారం నుంచి ఈ ప్రక్రియ చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

**3.49 లక్షల ఎకరాల్లో సాగు**

ఈ ఏడాది వానాకాలంలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. 3.49 ఎకరాల్లో సాగయింది. సదాశివపేట, రాయికోడ్, వట్‌పల్లి, మునిపల్లి, పుల్కల్, అందోలు, చౌటకూర్, కొండాపూర్, హత్నూర, నారాయణఖేడ్, కంగ్టి, మనూరు, నిజాంపేట, సంగారెడ్డి, కంది మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఇందుకు అనుగుణంగా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేసేలా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. టెండర్లు పిలిచి.. ఆమోదం తెలిపింది. సీసీఐ ఆధ్వర్యంలో నవంబరు రెండో వారంలో కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. నమోదులో ఇబ్బందులు లేకుండా ప్రతి కేంద్రంలో ఇంటర్నెట్ సదుపాయం కల్పించనున్నారు. జిన్నింగ్ మిల్లుల వద్ద లారీల పార్కింగ్ సౌకర్యంపై దృష్టి సారించారు.

**23 జిన్నింగ్ మిల్లుల్లో..**

జిల్లాలోని జోగిపేట, నారాయణఖేడ్, రాయికోడ్, సదాశివపేట, వట్‌పల్లి పరిధిలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 23 జిన్నింగ్ మిల్లులను గుర్తించారు. అందోలు మండలం రాంసాన్‌పల్లి,



ఎర్రారం, పుల్కల్, మునిపల్లి మండలం మేళసంగం, రాయికోడ్ మండలం నాగ్వార్, ఖాన్‌జమాల్‌పూర్, సదాశివపేట మండలం ఎన్కెపల్లి, ఆత్మకూర్, చందాపూర్, నారాయణఖేడ్ మండలం సత్యగామ, మనూరు మండలం డొవ్వూర్, కంగ్టి మండలం ముర్కంజాల్, ఎన్కెమోరి, తుర్కవాడగావ్, నిజాంపేట, నాగల్‌గిద్ద, పుసల్‌పాడ్, రేగోడ్ మండలం టి.లింగంపల్లి, అల్లాదుర్గం మండలం చెవేళ్ల, హత్నూర మండలం బోర్పట్లలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.

**72 గంటల్లో డబ్బులు జమ చేస్తాం**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలుకు చర్యలు తీసుకుంటాం. తేమ శాతానికి అనుగుణంగా రైతులు కేంద్రాలకు పంటను తీసుకురావాలి. వారి వేలి ముద్రలు, ఐరిస్ నమోదు చేస్తాం. ఆధార్‌కార్డుకు రైతు చరవాణి నంబరు అనుసంధానం ఉండాలి. ఏఈవో జారీచేసిన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలి. బ్యాంకు ఖాతా అనుసంధానం ఉంటే 72 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయిస్తాం. మహమూద్ రియాజ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ.

# నాలుగు రోడ్లకు మహర్దశ

నర్సాపూర్: పల్లె దారులు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గ గ్రామీణ రోడ్ల నిర్వహణ పథకం కింద రెండు మండలాల్లోని నాలుగు మార్గాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంతో అవి బాగుపడనున్నాయి.దీంతో రవాణా సౌకర్యాలు మెరుగయ్యే అవకాశాలున్నాయి. అంతేకాదు నర్సాపూర్ పట్టణంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి రూ.12 కోట్లు కేటాయించనున్నారు. నియోజకవర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, హత్నూర, కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల్లోని చాలా గ్రామాలకు తారు రోడ్లున్నా నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. కంకరతేలి.. గుంతలు పడటంతో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధీనంలోని ఈ మార్గాలు ప్రస్తుతం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా ఆర్టీసీ అధికారులు బస్‌లు కూడా నడపడం నిలిపివేశారు. దీంతో ప్రజలు ఆటోల్లో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి అవస్థలు పడుతున్నారు. వర్షకాలంలో అయితే ఆ బాధలు వర్ణనాతీతం.

**పనులు చేపడితే ప్రయోజనం**

రూ.5 కోట్ల నిధుల మంజూరుతో నాలుగు రోడ్లు బాగు కానున్నాయి. నర్సాపూర్ మండలం మూసాపేట నుంచి హత్నూర మండలం దౌల్తాబా



ద్ వెళ్లే రోడ్డు నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితం చేపట్టారు. ప్రయోగాత్మకంగా చేపట్టినా పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రెండు జిల్లాలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. మధ్యలో వంతెన పనులు సైతం అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. రూ.కోటి నిధులతో వీటి మరమ్మతులు చేపట్టనున్నారు. తుజాల్‌పూర్-ఖాజీపేట గ్రామాల మధ్య వంతెన పనులు అసంపూర్తిగా ఉండటంతో వాటిని పూర్తి చేయనున్నారు. హకీంపేట 1.75 కిలో మీటర్ల రోడ్డు, నాగ్సన్‌పల్లి 1.58 కిలోమీటర్ల రోడ్లకు మరమ్మతులు చేపడతారు.

**శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం**

నర్సాపూర్ పట్టణంలోని 15 వార్డుల్లో నీటి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని అధికారులు అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.12 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 650 కేఎల్, 700 కేఎల్ సామర్థ్యం కలిగిన రెండు ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులు నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాల గుర్తింపులో అధికారులు నిమగ్నమయ్యారు. ఇవి పూర్తయితే 1400 నివాసగృహాలకు సరిపడా కుళాయి కనెక్షన్లు ఇస్తారు. 8 కిలోమీటర్ల పొడవునా కొత్త పైపులైన్లు నిర్మించనున్నారు.

**వీలైనంత త్వరగా పనులు** సునీతారెడ్డి, ఎమ్మెల్యే, నర్సాపూర్

గ్రామీణ రోడ్లకు నిధులు మంజూరు కావడంతో వీలైనంత త్వరలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు టెండరు ప్రక్రియ పూర్తిచేస్తారు. త్వరితగతిన పనులు జరిగే విధంగా పర్యవేక్షిస్తా.

# ధాం..! డాం..

హైదరాబాద్: దీపావళి వేళ కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భారీగా పెరిగిన ధరలతో మధ్యతరగతి ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. నెలలోనే పండగ బడ్జెట్ 30నుంచి 40శాతం పైగా పెరిగిందని సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. రెండు, మూడు రోజులుగా పెరిగిన ధరల భారంతో ఆందోళన చెందుతున్నారు.

**నూనెలు సలసల.. పప్పులు కుతకుత**

పాతవి, నాణ్యమైన బియ్యం కిలో రూ.60కు పైనే ఉన్నాయి. పప్పులు రూ.100లోపు లేవు. గతనెల శనిగపప్పు కిలో రూ.64 నుంచి రూ.68 ఉండగా.. ప్రస్తుతం రూ.101గా ఉంది. మినపప్పు రూ.125 ఉండగా.. కందిపప్పు రూ.170కు చేరింది. బెల్లం రూ.55-రూ.70 దాకా ఉంది. లీటరు సన్‌ఫ్లవర్ నూనె కనీస ధర రూ.134 ఉంది.

**కూరగాయల రేట్లు ఇలా..**

ఏ కూరగాయ అయినా రైతుబజారులోనే రూ.60కంటే ఎక్కువగా ఉండగా.. రిటైల్‌లో రూ.80నుంచి రూ.100 దాకా ఉన్నాయి. టమాటా మాత్రం కిలో రూ.20నుంచి రూ.30 దాకా ఉంది. బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యారెట్, బీర అన్నీ రూ.60 నుంచి రూ.70 దాకా ఉన్నాయి. బీన్స్ రైతు బజార్‌లోనే రూ.120 ఉండగా రిటైల్‌లో రూ.140కి పైగానే ఉంది. ఆలు రూ.35నుంచి 50 దాకా ఉంది. వెల్లుల్లి రూ.400కు దిగి రావడం లేదు.

**పరిమితంగా కొనుగోళ్లు**



ధరల పెరుగుదల ప్రభావం అమ్మకాలపై పడిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో కిలోల్లో కొనేవారు ఇప్పుడు అరకిలే తీసుకుంటున్నారని కూరగాయలు విక్రయించే రైతు శ్రీరాములు అన్నారు. కూరగాయల లభ్యత తగ్గడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పరిమితంగా వస్తుండటంతోనే ధరలు పెరుగుతున్నాయన్నారు.

**ధర చూస్తే భయమేస్తోంది**

పండగ సరకుల ధరలు చూస్తే భయమేస్తోంది. సరకుల లిస్టులో అన్నీ కొనే పరిస్థితి లేదు. నెల క్రితం సరకుల వ్యయం రూ.3000 అయితే.. ఈసారి అవే సరకులకు రూ.4,100 దాకా చెల్లించాల్సి వచ్చింది. హోల్‌సేల్ షాపులోనే ఇలా ఉంటే ఇక చిల్లర దుకాణాల్లో ఇంకా ఎక్కువగా ఉన్నాయి.

చంద్రశేఖర్, విశ్రాంత ఉద్యోగి, కూకట్‌పల్లి

**రూ.700 ఖర్చయినా బ్యాగ్ నిండలేదు**

రైతుబజార్‌లోనే రూ.700కు కూరగాయలు కొంటే కనీసం సంచికూడా నిండలేదు. తక్కువ పరిమాణంలో కొన్నా గతం కంటే రెట్టింపు చెల్లించాల్సి వచ్చింది. వారం, పది రోజులుగా ఇదే పరిస్థితి. పండగ వేళ ఎక్కువ కొందామనుకుంటే రేట్లు చూసి పరిమితంగానే కొన్నాము.

ప్రమీల, గృహిణి, సనత్‌నగర్

# హుస్నాబాద్ ఆసుపత్రి ఉన్నతీకరణ

హుస్నాబాద్: హుస్నాబాద్ వంద పడకల ఆసుపత్రిని 250 పడకలకు ఉన్నతీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆసుపత్రి నిర్మాణానికి, ఉపకరణాల కోసం రూ.82కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మంజూరుతో హుస్నాబాద్ వైద్య కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుందని భావిస్తున్నారు.

**అన్ని రకాల సేవలు**

ప్రస్తుత సామాజిక ఆరోగ్య కేంద్రం 50 పడకలతో కొనసాగుతోంది. మరో 50 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతమున్న వంద పడకలను 250 పడకలకు ఉన్నతీకరణ చేయడం వల్ల వైద్య కళాశాలకు అనుబంధంగా ఉంటుందని చెబుతున్నా రు. వెనుకబడిన, గిరిజన ప్రాంతమైన హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి వస్తే మెరుగైన చికిత్సలు, సదుపాయాలు లభించనున్నాయి. ప్రస్తుతం



పూర్తిస్థాయి సేవలు లభించకపోవడంతో దాదాపు 50కి.మీ దూరంలో ఉన్న వరంగల్, కరీంనగర్, సిద్దిపేట పట్టణాలకు రోగులు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పాటు అయ్యే ఆసుపత్రితో స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు, చికిత్సలు లభించే అవకాశం ఉంది.

**వైద్య కళాశాలకు అడుగులు**

ప్రధానంగా హుస్నాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటు లక్ష్యంగానే ఆసుపత్రి ఉన్నతీకరణ చేసినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హుస్నాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్.. వైద్య కళాశాల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించారు. అవసరమైన స్థల సేకరణకు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో పరిశీలన జరిగింది. చివరకు హుస్నాబాద్ మండలంలో పోతారం(ఎస్)-జిల్లెల్లగడ్డ గ్రామాల మధ్య స్థల సేకరణ చేశారు. ఇందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించారు. జిల్లా కలెక్టర్ సైతం ఈ స్థలాన్ని పరిశీలించారు. వైద్య కళాశాల మంజూరు కావాలంటే కనీసం 250 పడకల ఆసుపత్రి ఉండాలనే నిబంధన ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ముందుగా ఆసుపత్రిని ఉన్నతీకరణ చేసిన తర్వాతే వైద్య కళాశాల ఏర్పాటుకు ముందుకు సాగుతామని మంత్రి ప్రభాకర్ గతంలో వెల్లడించారు. ఈ క్రమంలోనే 250 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది పూర్తయితే వైద్య కళాశాలకు మంజూరు లభించనుంది.

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొన్నం** హుస్నాబాద్ ఆసుపత్రిని 250 పడకల ఉన్నతీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆవిష్కరణలకు ఊతం.. అన్నదాతకు ప్రయోజనం



తాండూరు : తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్మించిన అగ్రిహబ్ భవనం అందుబాటులోకి వచ్చింది. నాబార్డు చీఫ్‌జనరల్ మేనేజర్ సుశీల, వ్యవసాయ శాస్త్రవేత్తలు భవనాన్ని ఇటీవల ప్రారంభించారు. సేద్య సంబంధమైన వ్యాపార కార్యకలాపాలు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతుల ఆర్థిక అభ్యున్నతికి నిపుణులు సూచనలు, సలహాలను అందించనున్నారు.

జిల్లాలోని 2.96 లక్షల మంది రైతులు వానాకాలం, యాసంగిలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటి ఉత్పత్తులను విక్రయిస్తే నామమాత్ర లాభాలే వస్తున్నాయి. ఒక్కోసారి నష్టాలు తప్పడంలేదు. ఇటువంటి పరిస్థితిలో కందులు, పెసలు, మినుములు, కుసుమ, జొన్నలు, వేరుసెనగ, చిరుధాన్యాలు, ఉల్లిపాయలు, సోయాబీన్స్ వంటి తదితర పంటల నుంచి ఆహార ఉత్పత్తులు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎలా లాభపడవచ్చనే విషయాలను వివరిస్తారు. సదరు పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి రుణాలను బ్యాంకుల నుంచి ఎలా పొందవచ్చనే సలహాలు ఇస్తారు. నేషనల్ బ్యాంక్‌ఫర్ అగ్రికల్చర్, రూరల్‌డెవలప్‌మెంట్ (నాబార్డ్) అండగా ఉంటుంది.

**అనుబంధరంగాలు..**

జొన్నలు పండించే వారు రవ్వ తయారు చేయవచ్చు. కుసుమల నుంచి నూనె కాకుండా, పప్పును ఉత్పత్తి చేసి పచ్చళ్లను తయారు చేయవచ్చు. చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తులు, కందులు, పెసలు, మినుములను పప్పుగా మార్చి విక్రయిస్తే రెట్టింపు లాభాలు పొందవచ్చు. పప్పులతో పచ్చళ్లు, ఇతర ఆహార పదార్థాలుగా తయారు చేసి విక్రయిస్తే ఆదాయం ఉంటుంది. ఉత్పత్తుల గ్రేడింగ్, అసెంబ్లింగ్, ప్రామాణీకరణ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, పంపిణీ వంటి విషయాలను వివరిస్తారు. రైతుల ఆలోచనలు ప్రోత్సహిస్తారు

**పరికరాలతో అవగాహన:** అగ్రిహబ్ భవనంలో వివిధ రకాల వ్యవసాయ గింజల నుంచి అనుబంధ ఉత్పత్తులు ఎలా తయారు చేయాలనే విషయంలో అవగాహన కల్పించేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. భవనంలోని ప్రత్యేక హాల్‌లో రైతులతో సమావేశాలు నిర్వహించగానే గింజల నుంచి ఉత్పత్తులను ఎలా తయారు చేయవచ్చనే విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తారు.

**ఉత్పత్తుల విలువను పెంచేందుకే**

రైతులు పండించే ఉత్పత్తులకు విలువ ఏ విధంగా పెంచుకోవాలనే విషయంలో అగ్రిహబ్‌లో నిపుణులు సూచనలు, సలహాలు ఇస్తారు. కొన్ని పరికరాలు రావాల్సి ఉంది. వీటి ద్వారా ఉత్పత్తులను ఎలా తయారు చేయవచ్చో వివరిస్తాం. కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. డాక్టర్ సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త

**భవనానికి ఇలా..**

చేసిన వ్యయం: రూ.1.60 కోట్లు

నిర్మాణం: జి౦1

అంతర్భాగం గదులు: అల్యూమినియం, ఫైబర్ గ్లాసులు

విభాగాలు: రిసెప్షన్, మీటింగ్ హాల్, వెయిటింగ్ హాల్, కోఆర్డినేటర్ గది.

ప్రత్యేక గదులు: శాస్త్రవేత్తలకు

వసతులు: తాగు నీరు, శౌచాలయాలు

అక్షరాస్య, నిరక్షరాస్య రైతులకు అవగాహనకు: దృశ్య మాధ్యమం

# ఎవరిది బాధ్యత.. ఎందుకీ నిర్లిప్తత..?



హైదరాబాద్ : నగరానికి తలమానికంగా నిలిచిన మెట్రో రైల్వేస్టేషన్ల పరిసరాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం చేపట్టి.. నిర్వహణపరంగా హైదరాబాద్ మెట్రోరైలు (హెచ్ఎంఆర్) సంస్థ రాజీపడుతోందనే విమర్శలు వస్తున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో మెట్రో పరుగులు పెడుతున్నా.. పలు శాఖల నిర్లక్ష్యం కారణంగా అపఖ్యాతి తప్పడం లేదు. స్టేషన్ల చుట్టు పక్కల అధ్వాన పరిస్థితులు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాదబాటల టైల్స్ పగిలిపోవడం.. మురుగుపారడం, మెట్ల మార్గానికి అడ్డంగా వాహనాల పార్కింగ్.. దుమ్ము ధూళి, చెత్తతో నిండిపోవడం వరకు నిర్వహణ సమస్యలు వేధిస్తున్నాయి. నగరంలోని పలు స్టేషన్లను పరిశీలించగా.. అనేక సమస్యలు, లోపాలు వెలుగులోకి వచ్చాయి. నగర ప్రజారవాణాలో కీలకంగా మారిన మెట్రోకి ప్రయాణికుల నుంచి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలని ఒక్కో స్టేషన్ దగ్గర అటుఇటు 600 మీటర్ల వరకు రూ.2కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టారు. వీటి నిర్వహణను హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చూస్తోంది. మొదట్లో బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో క్రమంగా అంతర్జాతీయ స్థాయి నుంచి లోకల్ స్థాయికి పడిపోయింది.

**మచ్చుకు ఇలా..**

సికింద్రాబాద్ నుంచి కోఠి వెళ్లే మార్గంలో ముషీరాబాద్ స్టేషన్ కింది భాగంలో పాదబాట పక్కన బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.

గాంధీ ఆసుపత్రి స్టేషన్ వద్ద లిఫ్ట్ మార్గం వద్ద మురుగునీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. వాహనాలు అడ్డంగా నిలుపుతున్నారు.

చిక్కడపల్లి మెట్రోస్టేషన్ పాదబాటలపై టైల్స్ పగిలిపోయాయి.

నారాయణగూడ బ్రిడ్జి వద్ద మెట్రో వయాడక్ట్ కింద దుకాణాలు నిర్మిస్తున్నారు. పాదబాట లేక ప్రయాణికులు ప్రమాదకరంగా రహదారిపై నడుస్తున్నారు.

ఉప్పల్ మెట్రోస్టేషన్ పాదబాటలో టైల్స్ పగిలిపోయాయి.

కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ పాదబాటలను చిరు వ్యాపారులు ఆక్రమించారు. వాటిపై సామగ్రిని నిల్వ చేస్తున్నారు.

గాంధీభవన్ స్టేషన్ ప్రవేశ మార్గం పాదబాటలపై ద్విచక్రవాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. చిరు వ్యాపారులు కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో స్టేషన్‌లోకి వెళ్లే మార్గంలోనే వాహనాలు అడ్డుగా పెడుతున్నారు.

నిర్వహణ కోసం కేటాయించిన దుకాణాలు కొన్ని వారికి కేటాయించిన స్థలాన్ని మించి పాదబాటలపై విస్తరిస్తున్నాయి. హైటెక్‌సిటీ, జేఎన్‌టీయూతోపాటు పలు ప్రాంతాల్లో నిర్వహణ కోసం కేటాయించిన దుకాణదారులు పాదబాటలను సైతం ఆక్రమిస్తున్నారు.

**ఎల్ అండ్ టీ పట్టనట్లుగా..**

కారిడార్ వెంట, స్టేషన్ల కింద పచ్చదనం బాధ్యత ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థది. డివైడర్లను నాసిరకంగా నిర్మించడంతో మూడు కారిడార్లలో పగుళ్లు వచ్చాయి. ఇటుకలు ఊడిపోయాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టడం లేదు. రంగులు వెలిసిపోయినా వేయడం లేదు. భద్రతా కోసం డివైడర్ అడుగు భాగంలో ఏర్పాటు చేయాల్సిన రేడియం స్ట్రిప్స్‌ను ఎప్పుడో మర్చిపోయింది. మిగతా చోట్ల పచ్చదనం నిర్వహిస్తున్నా స్టేషన్ల కింది భాగాన్ని పూర్తిగా వదిలేసింది. డివైడర్లపై లాలీపాప్స్ యాడ్స్‌తో ఆదాయం పొందుతున్నా పచ్చదనాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు.

**ఇతర విభాగాలూ వదిలేశాయ్..**

స్టేషన్ల పరిసరాల వరకు హెచ్‌ఎంఆర్ చూస్తుండగా.. ఆ ప్రాంతంలోని రహదారి, ఇతర పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇతర శాఖలదే బాధ్యత. స్టేషన్ల వద్ద హెచ్‌ఎంఆర్ చూసుకుంటుందని ఈ శాఖలు పూర్తిగా వదిలేశారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్‌ను ఆనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డు గతుకులమయంగా మారింది.

జూబ్లీహిల్స్ స్టేషన్ కింద ఎప్పుడు మురుగునీరు పారుతూ ఉంటుంది. జలమండలి పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులున్నాయి.

వైజంక్షన్ వద్ద ఉన్న బాలానగర్ స్టేషన్ సర్వీస్ రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదు.

మెట్రో మార్గం 69.2 కి.మీ.

మొత్తం కారిడార్లు 3

స్టేషన్లు: 57

నిత్యం రాకపోకలు సాగించే వారి సంఖ్య 5 లక్షలు

# జోరుగా వేరుసెనగ సాగు

బషీరాబాద్: జిల్లాలో వేరుసెనగ సాగు ఊపందుకుంది. ఆశించిన మేరకు ఈ ఏడాది వర్షాలు కురవడంతో రబీ సాగుకు అనువుగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయకపోవడంతో కర్ణాటక నుంచి విత్తనాలు తెచ్చుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో వేరుసెనగ 11,668 ఎకరాల్లో సాగు ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. రైతులు ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి మేలు రకమైన వేరుసెనగ విత్తనాలను తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 60శాతం సాగు పూర్తికావస్తోంది. ముఖ్యంగా యాసంగిలో కంది, పెసర, మినుము పంటలు వేశాక, వేరుసెనగ సాగు చేస్తున్నారు. వరి రెండు పంటలకు నీరు అందని బోరుబావుల కింద సైతం ఈసారి ఈ పంట సాగవుతోంది. పెద్ద ప్రాజెక్టులు, చెరువుల ఆయకట్టు భాగంలో, కోట్‌పల్లి, జుంటిపల్లి ప్రాజెక్టుల పరిధిలోని ఎర్ర నేలల్లో సాగు జోరుగా సాగుతోంది. బషీరాబాద్ మండలంలోని బాద్లాపూర్, మైల్వార్, రెడ్డిఘనాపూర్, మండలంలోని గిరిజన తండాల్లో గతేడాదికంటే అధికంగా సాగు చేస్తున్నారు.



**విత్తనశుద్ధి తప్పనిసరి :** రుద్రమూర్తి, ఏడీఏ, తాండూరు

వేరుసెనగ సాగు చేసుకునేందుకు నవంబరు 15 వరకు సమయం ఉంది. తేమ, అదును చూసి విత్తనాలు వేసుకోవాలి. తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. చీడపీడల నివారణకు ఇది దోహదం చేస్తుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది. దీనిపై వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకు అనుగుణంగా జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మొదటి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వం



పొడిగించిన గడువు నేటితో పూర్తికానుంది.

అయితే, జస్టిస్ పీసీఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సంబంధించిన క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ జరపాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వపెద్దలను కూడా దర్యాప్తు చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగింపు ఇస్తూ ఇవాళో.. రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

# పట్టణీకరణ దిశగా అడుగులు

మెదక్: మెతుకుసీమ ఇక అభివృద్ధి బాటలో పయనించనుంది. రెండు పురపాలికలు, పలు రెవెన్యూ గ్రామాలను కలుపుతూ పట్టణాభివృద్ధి సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఆయా గ్రామాలకు నిధులు వచ్చే అవకాశం ఉంది. సంస్థ ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ కాగా, త్వరలో అథారిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మొదలుకానుంది.

జిల్లా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండడంతో కొంత మేర అభివృద్ధికి అవకాశం కలగగా... గ్రామీణ ప్రాంతాల్లో కాస్త వెనకబాటు ఉంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం మెదక్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఏర్పాటు చేసింది. జిల్లాలో నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. వీటిని వదిలేసి మిగిలిన మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలతో పాటు 17 మండలాల్లోని 289 రెవెన్యూ గ్రామాలతో పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటైంది. రహదారులు, నీటి సరఫరా, ఉపాధి అవకాశాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల పెరుగుదలే సంస్థ లక్ష్యం.

**పెరగనున్న కేంద్ర నిధులు...**

మౌలిక వసతుల కల్పన, నిర్వహణ మెరుగవ్వాలి. అందుకు నిధులు దండిగా అవసరం. ముడా ఏర్పాటుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమృద్ధిగా సమకూరే అవకాశం ఉంది. గ్రామాల్లో లేఅవుట్లు, భవన నిర్మాణం, పారిశ్రామిక తదితర కీలక అనుమతులు దీని పరిధిలోకి రానున్నాయి. అక్రమ, అనుమతి లేని లే అవుట్‌లకు కళ్లెం పడనుంది. ఫలితంగా ఆదాయం పెరగనుంది. పట్టణ మాదిరి గ్రామాల్లోనూ సౌకర్యాలు పెంచనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవకాశం**

ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న పట్టణాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించలేదు. మెదక్ మున్సిపాలిటీకి మాత్రం ఏళ్ల క్రితం నాటిదే ఉంది. మూడేళ్ల క్రితం కొత్తది రూపొందించగా పలు మార్పులు చేయాలని వినతులు రాగా గత ప్రభుత్వం ఆమోద ముద్ర వేయలేదు. ప్రస్తుతం జిల్లా పరిధినే యూనిట్‌గా పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందించే అవకాశం కలగనుంది.

**కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ...**

ముడా ఛైర్మన్‌గా కలెక్టర్, వైస్ ఛైర్మన్‌గా అదనపు కలెక్టర్ వ్యవహరించనున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ లేదా వారి నామినిలు సభ్యులుగా ఉంటారు. ఇది వరకు పట్టణాభివృద్ధి సంస్థల ఛైర్మన్, డైరెక్టర్ పదవులను రాజకీయ నాయకులతో భర్తీ చేసే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం అధికారులతో కమిటీని ఏర్పాటు చేయనుంది. ముడా పరిధి ఇలా..మున్సిపాలిటీలు

మెదక్, రామాయంపేట

రెవెన్యూ గ్రామాలు: 289

మండలాలు :17

# ధర పేలింది..!

కోదాడ :ఈ చిత్రంలో టపాసుల దుకాణాలు కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పట్టణం. దుకాణాలు ఊరు చివరన ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా.. పట్టణంలోని ఖాళీ స్థలంలోనే సుమారు 20 దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. రెండు దుకాణాల మధ్య కనీసం 3 మీటర్లు దూరం ఉండాలి. నిబంధనల ప్రకారం మంటలు చెలరేగితే ఆర్పేందుకు ఫైర్ ఇంజిన్ వాహనంతో పాటు, ఇసుక కూడా అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ అలాంటి ఏర్పాట్లు ఏమీ చేయలేదు. దీపావళి అనగానే ఇంట్లో దీపాలు, ఇంటి ముందు బాణసంచా కాల్పులు గుర్తుకొస్తాయి. పండగకు రెండు రోజుల ముందు నుంచే చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తమకు నచ్చిన టపాసులు పేలుస్తుంటారు. ఇక పండగ రోజైతే చెప్పనవసరం లేదు. దీన్నే అవకాశంగా టపాసుల దుకాణదారులు ధరలను అమాంతం పెంచేశారు. గతేడాదితో పోల్చుకుంటే కొన్ని టపాసుల ధరలు 50 శాతం పెంచగా, మరికొన్నింటి ధరలు 70 నుంచి నూరు శాతం వరకు అదనంగా పెంచారు. సిండికేట్ దందా..! దీపావళి పండగకు టపాసుల విక్రయాల మార్కెట్‌ను ఆసరా చేసుకొని జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పురపాలక అధికారులు అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పిల్లలకు సంబంధించిన టపాసులు కొన్నా రూ.500 వరకు ఖర్చు వస్తుందని, ఈ స్థాయిలో ధరలు ఎప్పుడూ చూడలేదని, ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు- సూర్యనారాయణ, ఆర్డీవో, కోదాడ దీపావళి పండగ సందర్భంగా టపాసుల ధరలు పెంచి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అధిక లాభార్జనే ధ్యేయంగా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు కొనుగోలు చేసిన ధరల మీద 20 శాతంలోపే ధర పెంచి విక్రయించాలి.



# కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడుస్తున్న మంత్రి నారా లోకేష్

అమరావతి: మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుని మంత్రి లోకేశ్‌కు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు ప్రతి ఒక్కరి నుంచి ఒపిగ్గా వింటున్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే లోకేష్ పరిష్కరిస్తున్నారు. పరిష్కారం కాని సమస్యలను సంబంధిత విభాగాల అధికారులకు పంపి పరిష్కార మార్గం చూపుతున్నారు. తన వద్దకు వచ్చిన ప్రజల కష్టాలు వింటూ...కన్నీళ్లు తుడుస్తూ...! మీ వెంట నేనున్నాంటూ "ప్రజాదర్బార్" లో లోకేష్ భరోసా ఇస్తున్నారు. మంత్రి నారా లోకేష్ తన నియోజకవర్గంలో ప్రజాదర్బార్‌లో ఇవాళ(సోమవారం) వేకువ జామునుంచే వినతులను స్వీకరిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. స్థానికంగా అందుబాటులో ఉండే రోజుల్లో ప్రజలను కలవనున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారని ప్రజలంతా ఎదురుచూశారు. అయితే గ్రామ, వార్డు సచివాలయాలు అందుబాటులో ఉన్నాయని.. ఏ సమస్య ఉన్న అక్కడ ఫిర్యాదు చేస్తే సరిపోతుందని జగన్ ప్రభుత్వం తెలిపింది. దీంతో ప్రజలు తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని కలిసి సమస్యలు విన్నవించే పరిస్థితి లేకుండా పోయింది. ఏదైనా సమస్యలను నేరుగా తమ ఎమ్మెల్యేకు చెప్పుకుంటే త్వరగా పరిష్కారమవడంతో పాటు.. తమ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్తుందని ఆశ పడుతుంటారు.

అయితే వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ప్రజల సమస్యలు ఎమ్మెల్యేలకు తెలిసేవి కావు. మరోవైపు కొన్ని సమస్యలు పరిష్కారమైతే.. మరికొన్నింటికి పరిష్కారం దొరికేది కాదు.. దీంతో ప్రజలకు ఎమ్మెల్యేలపై వ్యతిరేకత పెరగడం మొదలైంది. వైసీపీ ఈ ఎన్నికల్లో ఘోర పరాజయానికి ఇది ఒక కారణమని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

**ప్రజలకు స్వాంతన..** కష్టాల్లో ఉన్నవారి కన్నీరును ఏపీ మంత్రి నారా లోకేష్ తుడుస్తున్నారు. సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా ప్రజాదర్బార్ సాగుతోంది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 45 ప్రజాదర్బార్‌లు నిర్వహించారు. ప్రజల నుంచి 4,753 విజ్ఞప్తులను మంత్రి నారా లోకేష్ స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో 2,219 సమస్యలకు పరిష్కారం చూపించారు. విన్నపాల్లో సగానికి పైగా రెవెన్యూ, హెూంశాఖకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయి. విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించడానికి మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుంటున్నారు. ప్రజాదర్బార్‌తో కష్టాల్లో ఉన్న ప్రజలకు స్వాంతన లభిస్తోంది. వివిధ సమస్యలపై తనని కలవడానికి ఉండవల్లిలోని సీఎం నివాసం వద్దకు వస్తున్న ప్రజలకు యువనేత, మంత్రి నారా లోకేశ్ 'మీ కష్టాలు తీరుస్తా.. అండగా ఉంటా..' అంటూ భరోసా ఇస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు చెప్పుకొనేందుకు సీఎం జగన్ నివాసం వద్దకు వెళ్లిన ప్రజలకు నిరాశే ఎదురయ్యేది. కానీ, ఇప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకుండానే నేరుగా సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుని లోకేశ్‌కు తమ సమస్యలు విన్నవించుకుంటున్నారు. ఆంక్షలు విధించకుండా లోపలికి పంపించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటున్న యువనేత వారందరికీ మనోధైర్యాన్నిస్తూ అండగా ఉంటానని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇస్తున్నారు.

**ప్రజా పాలన..** వైసీపీ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో పూర్తిగా ఓట్ల రాజకీయానికి శ్రీకారం చుట్టిందనే విమర్శలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మధ్య దూరం పెరిగింది. దీంతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. గత అనుభవాల దృష్ట్యా నిజమైన ప్రజాపాలన అందించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరిస్తామని కూటమి ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే కొన్ని రోజుల్లోనే కొత్త ప్రభుత్వ పాలనలో స్పష్టమైన తేడా కనిపిస్తుందనే టాక్ వినిపిస్తోంది.

# ఏపీలో టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల




దిల్లీ: ఏపీలో తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం షెడ్యూల్ విడుదల చేసింది. తూర్పుగోదావరి- పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక కోసం ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఈసీ తెలిపింది. నవంబర్ 18వరకు నామినేషన్లు స్వీకరించి.. 19న నామినేషన్లను పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు నవంబర్ 21గా పేర్కొన్నారు. డిసెంబర్ 5 (గురువారం)న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించి.. డిసెంబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు ప్రకటనలో తెలిపారు. గతంలో తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ తరఫున గెలిచిన యూటీఎఫ్ నేత షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన పదవీ కాలం 2027 మార్చి 29 వరకు ఉండటంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

**మూడు రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నిక తేదీ మార్పు :** దేశంలోని మూడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికల పోలింగ్ తేదీ మారింది. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 48 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికకు గత నెలలో షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం కేరళ, పంజాబ్, యూపీలలో 14 అసెంబ్లీ సీట్లలో నవంబర్ 13న ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కానీ, భాజపా, కాంగ్రెస్, బీఎస్పీ, ఆర్ఎల్‌డీతో పాటు పలు సామాజిక సంస్థలు పోలింగ్ తేదీని మార్చాలని ఈసీకి విజ్ఞప్తి చేశాయి. పలు సామాజిక, సాంస్కృతిక, మత సంబంధమైన కార్యక్రమాలు ఉన్నందున ఓటర్ల భాగస్వామ్యం తగ్గే అవకాశం ఉందంటూ ఆయా పార్టీలు చేసిన సూచనను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం కేరళ, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ పరిధిలో 14 అసెంబ్లీ సీట్లలో పోలింగ్ తేదీని నవంబర్ 20కి మార్పు చేసింది. కేరళలో ఒకటి, పంజాబ్‌లో 4, యూపీలో 9 నియోజకవర్గాల్లో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా.. మిగతా స్థానాల్లో మాత్రం తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని ఈసీ పేర్కొంది.

# ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ షాక్.. నలుగురు యువకుల మృతి

ఉండ్రాజవరం: తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో నలుగురు మృతిచెందారు. ఒకరికి తీవ్రగాయాలు కాగా అతడి పరిస్థితి విషమంగా ఉంది. పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను బొల్లా వీర్రాజు, పామర్తి నాగేంద్ర, మారిశెట్టి మణికంఠ, కాసగాని కృష్ణగా గుర్తించారు. మృతదేహాలను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన కోమటి అనంతరావును చికిత్స నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు సంబంధించి ఏడాదిన్నరగా రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇటీవల ఇరుపక్షాలతో చర్చించి కొవ్వూరు సబ్ కలెక్టర్ రాణి సుస్మిత అనుమతి ఇచ్చారు. ఈ ఉదయం సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించాల్సి ఉంది. ఈలోగా దుర్ఘటన చోటు చేసుకుంది.

**విద్యుదాఘాతం ఘటనపై సీఎం చంద్రబాబు విచారం :** విద్యుదాఘాతం ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుభూతి ప్రకటించారు. వారిని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: కందుల దుర్గేశ్...** మృతుల కుటుంబాలను మంత్రి కందుల దుర్గేశ్ పరామర్శించారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వారితో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## తిరుమలకు జగన్ స్టిక్కర్‌తో వచ్చిన మాజీ మంత్రి అంబటి రాంబాబు

తిరుమల: వైకాపా అధ్యక్షుడు జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్‌తో మాజీ మంత్రి అంబటి రాంబాబు తిరుమలకు రావడం చర్చనీయాంశమైంది. రాజకీయ పార్టీల చిహ్నాలు, జెండాలు, స్టిక్కర్లతో శ్రీవారి దర్శనానికి రావడం తితిదే నిబంధనలకు విరుద్ధం. అయినా అంబటి రాంబాబు తన చొక్కాపై జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్‌తో వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన అలా రావడంపై పలువురు చర్చించుకున్నారు.





# ₹6 లక్షల కోట్లు ఆవిరి..!

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కో శాతం మేర నష్టపోయాయి. అమెరికా ఎన్నికలు, వడ్డీ రేట్లపై త్వరలో ఫెడ్ తన నిర్ణయాలను ప్రకటించనుండడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 1500 పాయింట్ల మేర నష్టపోగా.. ఆ తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 24 వేల మార్కును కోల్పోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.448 లక్షల కోట్ల నుంచి రూ.442 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 79,713.14 (క్రితం ముగింపు 79,724.12) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. క్రమంగా భారీ నష్టాల్లోకి జారుకుంది. ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 78,232.60 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 941.88 పాయింట్ల నష్టంతో 78,782.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.11 స్థాయికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు మినహా అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ 75 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2753 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# దీపావళి కాలుష్యం.. వారంలోగా సమాధానం ఇవ్వండి

## దీపావళి వేళ కాలుష్యం.. తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు

దిల్లీ: దీపావళి తర్వాత దిల్లీలో కాలుష్యం పెరగడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దేశ రాజధానిలో బాణసంచా కాల్చడంపై ఉన్న నిషేధం అమలుకావడం లేదని అసహనం వ్యక్తంచేసింది. ఈ ఏడాది నిషేధాన్ని అమలు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని దిల్లీ ప్రభుత్వం, పోలీసు కమిషనర్‌కు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అలాగే వచ్చే ఏడాది నిషేధం అమలు కోసం ప్రతిపాదిత చర్యలు అందులో పొందుపరచాలని ఆదేశించింది. "టపాసులపై నిషేధం అమలు చేయలేదని వార్తలు వస్తున్నాయి. కాలుష్యాన్ని నివారించడానికి ఇదొక ముఖ్యమైన చర్యగా భావించాం. బాణసంచా అమ్మకాలు, తయారీ, వాటిని కాల్చడంపై ఉన్న నిషేధానికి సంబంధించి ఇచ్చిన ఆదేశాల వివరాలు అఫిడవిట్‌లో వెల్లడించండి.

నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలు, కోర్టు ఆదేశాలు అమలు చేయడానికి తీసుకున్న చర్యల వివరాలను దిల్లీ పోలీసులు కోర్టుకు సమర్పించాలి" అంటూ నోటీసులు ఇచ్చింది. వాటికి వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నిషేధాన్ని ఉల్లంఘించే వారి స్థలాలను సీల్ చేయడం వంటి కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్యానించింది. 2025 నాటి దీపావళికైనా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నంకాకుండా చర్యలు ఉండాలని సూచించింది. ఈ సందర్భంగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్టును ప్రస్తావించింది. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే.. 2024 దీపావళికి వాతావరణంలో వేడి శాతం ఎక్కువగా ఉందని చెప్పింది. పంట వ్యర్థాల కాల్చివేత ఘటనలపై పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు నవంబర్ 14లోగా తమ సమాధానాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది.

# ప్రపంచ ముఖ్య ఐదు నగరాల్లో ఒకటిగా అమరావతి: మంత్రి నారాయణ




అమరావతి: గత ప్రభుత్వం రాజధాని పేరుతో మూడుముక్కలాట ఆడిందని మంత్రి నారాయణ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతి పనులను వేగవంతం చేశామని చెప్పారు. ప్రపంచంలోని ఐదు ముఖ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. "జులై 24న చీఫ్ ఇంజినీర్లతో సాంకేతిక కమిటీ వేశాం. 2014-19 సమయంలో టెండర్ ఇచ్చిన పనుల గడువు ముగిసింది. పనులకు సంబంధించి చీఫ్ ఇంజినీర్ల కమిటీ అక్టోబరు 29న నివేదిక ఇచ్చింది. అన్ని పనులకు సంబంధించి డిసెంబర్ చివరిలోగా టెండర్లు పిలవాలని ఆదేశించాం. మూడేళ్లలో పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. ప్రపంచ బ్యాంకు రూ.15వేల కోట్ల రుణం ఇస్తుంది. మంత్రులు, జడ్జిలు, ఇతర బంగ్లాలకు రూ.41 వేల కోట్లకు టెండర్లు పిలుస్తాం.

రూ.30వేల కోట్ల టెండర్లకు సంబంధించి పనులు మొదలయ్యాయి. నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపడతాం. ఉండవల్లి వద్ద 7,350 క్యూసెక్కులు పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీర్ల కమిటీ నివేదిక ప్రకారం సీఆర్‌డీఏ ముందుకెళ్తుంది" అని నారాయణ తెలిపారు.

# ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ నిర్వహిస్తాం: కేశినేని చిన్ని

మూలపాడు: త్వరలోనే మూలపాడు క్రికెట్ స్టేడియంలోని రెండో గ్రౌండ్ అందుబాటులోకి వస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని(శివనాథ్) తెలిపారు. ఇక్కడి మైదానాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూలపాడులో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 175 నియోజకవర్గాల్లో క్రికెట్ గ్రౌండ్లు ఏర్పాటుచేయడమే లక్ష్యమన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏసీఏ తరఫున మూలపాడులో ఏడాదిలోపు క్రికెట్ అకాడమీ వస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారుల వెలికితీతకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మూలపాడుకు అన్నీ అనుకూలిస్తే గోల్ఫ్ కోర్స్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో



మంగళగిరి, మూలపాడులో రెండు క్రికెట్ స్టేడియాలు ఉండటం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ రెండు స్టేడియాలను ఏడాదిలోపు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టంచేశారు.

# జగన్ రాయలసీమ బిడ్డ అని చెబుతూనే నీటి పారుదల శాఖను పట్టించుకోలేదు: మంత్రి నిమ్మల

కర్నూలు: ఉల్లి రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగకూడదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వినియోగదారుడికి భారం కాకుండా మేలు జరిగేలా ఎన్డీయే కూటమి పని చేస్తోందని చెప్పారు. ఆయన మంత్రి టీజీ భరత్‌తో కలిసి కర్నూలులో ఉల్లి మార్కెట్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ-నామ్ బిడ్డింగ్ పని చేయని సందర్భంగా వెంటనే ఆఫ్‌లైన్‌లో నమోదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గతేడాది అక్టోబర్‌లో మార్కెట్‌కు 52 వేల టన్నుల ఉల్లి వస్తే.. ప్రస్తుతం దానికి నాలుగు రెట్లు అధికంగా 2.5 లక్షల టన్నుల ఉల్లి వచ్చిందన్నారు. దిగుబడి ఇంత అధికంగా వచ్చినా.. వైకాపా పాలనలో ధరల కంటే ఎక్కువ ధరను రైతులు పొందారని వివరించారు.

గత ప్రభుత్వంలో హార్టికల్చర్, డ్రిప్ ఇరిగేషన్ వంటి అన్నింటినీ గాలికొదిలేశారని విమర్శించారు. జగన్ రాయలసీమ బిడ్డ




అని చెబుతూనే నీటి పారుదల శాఖను పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. దళారులు సిండికేట్ కాకుండా కోడుమూరులో కూడా ఉల్లి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు నిమ్మల రామానాయుడు చెప్పారు.

# టన్ను ఇసుక రూ.202

కర్నూలు : టన్ను ఇసుక రూ.202కే అందుబాటులోకి రానుంది. ఇదివరకు ఇసుక టన్ను ధర రూ.320 ఉండగా.. సీనరేజ్, డీఎంఎఫ్, మెరిట్, జీఎస్టీ.. అన్నింటిని రద్దు చేయడంతో ప్రస్తుతం టన్ను రూ.202కు లభ్యం కానుంది. ఫలితంగా భవన నిర్మాణ రంగాలవారికి.. ఇళ్లు నిర్మించుకునే వారికి ఊరట కలగనుంది. తాజా ధరల ప్రకారం ఇసుకను త్వరలో వినియోగదారులకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారిన ధరలను ఆన్‌లైన్ యాప్‌లో మార్పులు చేసేందుకు సాంకేతికపరంగా కొంత సమయం పడుతుందని, నవంబరు 1వ తేదీ నుంచి కొత్త ఇసుక ధరలు అమల్లోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

తుంగభద్ర నదికి ఇటీవల వరదలు రావడంతో సి.బెళగల్ మండలంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో పది రోజులుగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో గత మూడు రోజులుగా తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇసుక కొరత కారణంగా ఈనెల 24 నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ఆగిపోయింది. ఫలితంగా ఇసుక అవసరార్థులు బుకింగ్ చేసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచి మారిన ఇసుక ధరలతోపాటు అంతర్జాలంలో ఇసుక నమోదు అందుబాటులోకి



రానుంది.కొత్తకోట, సింగవరంలో ఇదివరకే కొంత ఇసుక నిల్వలు ఉన్నాయి. ఈనెల 24వ తేదీ కంటే ముందు నమోదు చేసుకున్నవారికి ఆ డీసిల్టింగ్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా జరుగుతుంది.

**అందరికీ అందుబాటులో..**

నదీ పరివాహక ప్రాంతాల గ్రామాలవారు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లొచ్చు. గ్రామాల్లో వంకలు, వాగుల్లో ఉన్న ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చు. గనుల శాఖ వెబ్‌సైట్‌లో, లేదా గ్రామ వార్డు సచివాలయంలోగానీ, రీచ్ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, దుర్వినియోగం చేసినా కఠినచర్యలు తీసుకోనున్నారు. ఇసుక లభ్యత లేని జిల్లాల్లో నిల్వలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం మినరల్ డీలర్ లైసెన్సులు జారీ చేయనుంది.

**ఐదు పాయింట్లలో 12 వేల టన్నుల నిల్వలు**

ప్రస్తుతం జితిన్ బోట్స్‌మెన్ కమిటీ ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో గత రెండు, మూడు రోజులుగా ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. రోజుకు 1,500 టన్నుల చొప్పున డీసిల్టింగ్ పాయింట్లలో తవ్వకాలు జరుగుతున్నాయి. ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో ప్రస్తుతం 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. డీసిల్టింగ్ పాయింట్లలోనూ టన్నుకు రూ.202 చొప్పున చెల్లించి అక్కడికక్కడే ఇసుక తీసుకెళ్లేందుకు వినియోగదారులకు ప్రభుత్వం సులభతరం చేసింది. ఇసుక నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా.. సులువుగా స్టాక్ యార్డులలోనే నిర్ణీత పైకం చెల్లించి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటోంది.

# అంతులేని నిర్లక్ష్యం.. ఎలా చిక్కేను సాక్ష్యం!!

విశాఖపట్నం : మహా నగరంలో నిఘా కళ్లు మూసుకున్నాయి. పలు కీలక కేసుల్లో ఆధారాలు జారిపోతున్నాయి. వైకాపా పాలనలో 'నిఘా'పై నిర్లక్ష్యం చోటు చేసుకుంది. కెమేరాలకు నిర్వహణ కరవై మరమ్మతులతో మూలకు చేర్చారు. ఆ వ్యవస్థను మళ్లీ గాడిన పెట్టే ప్రయత్నాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖలో శాంతిభద్రతలపై దృష్టి పెట్టిన నేపథ్యంలో సీసీ కెమేరాలపై పోలీస్ స్టేషన్ల వారీగా ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందులో విస్తుబోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో వేలాది సీసీ కెమేరాలు పనిచేయడం లేదని తేలింది.

**ఆశ్చర్యపోయిన హోంమంత్రి:** నగరంలో సీసీ కెమేరాల నిర్వహణకు నిధుల్లేక మూలకు చేరాయని ఇటీవల సమీక్షలో తెలుసుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత ఆశ్చర్యపోయారు. వెంటనే నగరంలో ఎన్ని కెమేరాలు మూలకు చేరాయి? కొత్తవి ఏ ప్రదేశాల్లో ఎన్ని అవసరం ఉంటుంది? అనే అంశంపై నిశితంగా సర్వే చేయాలని ఆదేశాలిచ్చారు.

**ఆధారాలకు అవస్థలు:** గతేడాది నవంబరులో చేపల రేవు (హార్బర్)లో అగ్ని ప్రమాదం జరిగింది. జీరో జెట్టీ వద్ద ఎవరు బోటులో నిప్పురాజేశారన్న విచారణలో భాగంగా హార్బర్ సమీపంలోని 11 సీసీ కెమేరాలను పరిశీలించిన పోలీసులు ఖంగుతిన్నారు. అందులో కొన్నింటికి కనెక్షన్లే ఇవ్వలేదు. మరికొన్ని నిర్వహణలేక మూలకు చేరాయి. కీలకమైన ఈ కేసు విచారణలో జాప్యానికి సీసీ కెమేరాలు పనిచేయకపోవడం ఓ ముఖ్య కారణం. ఇలాంటి పరిస్థితి ఎన్నోసార్లు ఎదురయింది. గుంటూరు జిల్లాకు చెందిన ఓ యువతి బీచ్‌లో పురుగులు మందు తాగుతున్న వీడియో బంధువులకు పంపి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. నగర పోలీసులకు ఫిర్యాదురాగా, బీచ్ రోడ్‌లో పలుచోట్ల సీసీ కెమేరాలు పరిశీలించారు. సింహభాగం పనిచేయనట్లు కంట్రోల్ రూంలో గుర్తించారు. ఓ మాజీ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ సమయంలోనూ రుషికొండ ప్రాంతంలో పలు చోట్ల సీసీ కెమేరాలే లేవని తేలింది.

**కారణాలివే:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల నిర్వహణ బాధ్యత ఎవరిదనేది ప్రశ్నగా మారింది. గతంలో ఓ సంస్థ సొంత ఖర్చులతో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తే, ఐదేళ్లు ఉచితంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకునేలా ఒప్పందం చేసుకుంది. సంస్థ గడువు ముగియడంతో కెమేరాల నిర్వహణ అటకెక్కింది. మరోవైపు ఆకర్షణీయ నగర ప్రాజెక్టులో భాగంగా (సిటీ ఆపరేషన్ సెంటర్స్) కింద ప్రధాన కూడళ్లలో నిఘా నేత్రాలతో కూడిన స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ ఓ కంపెనీ చూస్తుండగా, గత వైకాపా ప్రభుత్వంలో బిల్లులు బకాయిలుండటంతో చేతులెత్తేశారు.

**ప్రత్యేక సమావేశంలో చర్చిస్తాం..:** జీవీఎంసీలో సీసీ కెమేరాలపైనే ప్రత్యేకంగా ఓ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తాం. నగరంలో సీసీ కెమేరాలు ఎక్కడ అవసరం? ఉన్నా ఎక్కడ పనిచేయడం లేదు? అనే విషయంపై కమిషనరేట్ పరిధిలోని ఆయా స్టేషన్ల పరిధిలో సర్వే చేయించాం. వాటిని జోన్లు వారీగా జీవీఎంసీ కమిషనర్‌కు ఇస్తాం. 'పబ్లిక్ శక్తి' యాక్టు కింద అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద వంద శాతం సీసీ కెమేరాలు ఏర్పాటు చేయిస్తున్నాం.

సీపీ, శంఖబ్రత బాగ్చీ

నగరంలో ప్రభుత్వ సీసీ కెమేరాలు: 2,367

ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసినవి: 61,466

జీవీఎంసీ కెమేరాల్లో మూలకు చేరినవి: 1,308

ప్రైవేటులో పనిచేయనవి: 6,521

కొత్తగా కావాల్సినవి 14,307

# పేదింట గ్యాస్ పండగ



చిత్తూరు : కూటమి ప్రభుత్వం దీపావళి ధమాకా ప్రకటించింది.. సూపర్-6లో మరో కీలక పథకానికి పచ్చజెండా ఊపింది.. మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.. తెల్లరేషన్ కార్డు ఉన్న వారంతా ఉచిత సిలిండర్‌కు అర్హులని పేర్కొంది.. నవంబరు ఒకటో తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. శ్రీకాకుళంలో ఉచిత సిలిండర్ల పథకానికి శ్రీకారం చుడతారు.. అదేరోజు జిల్లాలోని గుడిపాలలో రవాణాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిచే ఉచిత సిలిండర్ల పంపిణీ చేసి పథకాన్ని ప్రారంభిస్తారు. జిల్లాలోని 46 గ్యాస్ సిలిండర్ల సరఫరా ఏజెన్సీల పరిధిలో 5.80 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఆరు నెలల కిందట ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనలో జిల్లాలో తొమ్మిది వేల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. దీనికింద కనెక్షన్ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. జిల్లాలో 5,43,200 బియ్యం కార్డులు ఉన్నాయి. ఈ లెక్కన ఏడాదికి 16,29,600 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాలి. ప్రస్తుతం సిలిండరు ధర రూ.837. కేంద్ర ప్రభుత్వం రూ.10.62 రాయితీ ఇస్తోంది. అంతిమంగా ప్రజలు రూ.827 వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం రూ.134.76 కోట్ల మేర భారం మోయాల్సి ఉంటుంది.

**వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ**

లబ్ధిదారులు ఇప్పటి మాదిరిగానే గ్యాస్ సిలిండర్లు నగదు చెల్లించి పొందాలి. సిలిండర్ ఇంటికి డెలివరీ అయిన 48 గంటల్లో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారు. ప్రతి నాలుగు నెలల్లో ఒక సిలిండర్‌ను ఎప్పుడైనా ఉచితంగా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. బుకింగ్, డెలివరీ, నగదు జమ తదితర సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరుతో పాటు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్‌కు, గ్రామ స్థాయిలో సచివాలయాల్లో తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారు.

**వేగంగా నమోదు**

ఉచిత సిలిండర్ పొందేందుకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో వినియోగదారులు తమ పేర్లు నమోదు చేయగా.. ఈ పథకానికి అర్హులైన వారి చరవాణులకు సైతం సంక్షిప్త సమాచారం అందింది. తొలి విడత సిలిండరు నవంబరు 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు పొందవచ్చు.

**అర్హులందరికీ వర్తింపు..**

– శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులందరికీ ఈ పథకాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా అమలు చేస్తాం. తెల్లరేషన్ కార్డు కలిగిన వారందరికీ ఉచిత సిలిండర్ అందజేస్తాం.

గ్యాస్ కనెక్షన్లు: 5.80 లక్షలు

తెల్ల రేషన్‌కార్డులు: 5,43,200

ఏడాదికి ఉచితంగా ఇవ్వనున్న సిలిండర్లు: 16,29,600

ప్రజలకు చేకూరనున్న లబ్ధి: రూ.134.76 కోట్లు

# అంగన్‌వాడీల్లో ఆరోగ్యానందం



చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరంతో పాటు, ఆరోగ్యం, ఆనందాన్ని అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి.. బాలింతలు, గర్భిణులు, ఆరేళ్ల లోపు చిన్నారుల సమగ్ర పోషణే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం కాగా, క్షేత్ర స్థాయిలో తగినన్ని వసతులు లేక వంద శాతం ఫలితాలు సాధించలేక పోతున్నాయి.. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అడుగులేస్తోంది.. కేంద్రాల్లో వసతుల కల్పనే ధ్యేయంగా, స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్(సక్షం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.. తాజాగా జిల్లాలోని 814 అంగన్‌వాడీ కేంద్రాలు ఈ పథకానికి ఎంపికయ్యాయి.

**పోషకాల తోట.. స్వచ్ఛమైన నీరు..**

ఈ పథకానికి ఎంపికైన కేంద్రాల్లో పోషకాల తోట(న్యూట్రీ గార్డెన్) పేరిట సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. అక్కడ వచ్చిన దిగుబడులను పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. రక్షిత నీటిని అందించేందుకు శుద్ధజల యంత్రాలు అమర్చనున్నారు. వీటి ఏర్పాటు బాధ్యతను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది.

**సమకూరనున్న వసతులు..**

తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, ఆహ్లాదకర వాతావరణం కల్పన, విద్యాబోధన మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకోను న్నారు. వారిలో పరిజ్ఞానం పెంపొందించేందుకు వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు ఏర్పాటు చేస్తారు. బల్లలు, కుర్చీలు, ఫర్నిచర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆకట్టుకునే బోధనకు దృశ్య, శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు అందుబాటు లో ఉంచుతారు. ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని ఒడిసి పట్టనున్నారు.

**పనులు ప్రారంభించాం..**

–హైమావతి, పీడీ, ఐసీడీఎస్.

జిల్లాలో 814 అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం పథకానికి ఎంపికయ్యాయి. వాటిలో పోషక తోటలు, ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇకపై అక్కడ ఆహ్లాద వాతావరణంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం అందించనున్నాం.

ఒక్కో కేంద్రానికి నిధులు

పోషకాల తోటకు : రూ.10 వేలు

ఇంకుడు గుంతలకు : రూ.16 వేలు

ఇతర సదుపాయాలకు : రూ.19,800

# కందిపప్పు వచ్చేసింది!



నక్కపల్లి : జిల్లాలో రేషన్ కార్డుల లబ్ధిదారులకు తీపికబురు అందింది. కందిపప్పు ధర మండిపోతున్న వేళ కూటమి ప్రభుత్వం రాయితీపై ఇవ్వదలిచిన కందిపప్పు నవంబరు నుంచి పూర్తిస్థాయిలో అందనుంది. అక్టోబరులో సరఫరా చేపట్టినా, సరకు సరిపడా లేక కొంతమందికే ఇది అందింది. తెదేపా పాలనలో ప్రజలకు బియ్యంతో పాటు, కందిపప్పు, పంచదార రాయితీపైనా, ఇతర నిత్యావసర సరకులు తగ్గింపు ధరకు అందించేవారు. వైకాపా పాలనలో ఇవన్నీ అటకెక్కిపోయాయి. కేవలం బియ్యం, అప్పుడప్పుడు కందిపప్పు, పంచదార ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఈ క్రమంలో నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయి. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే కందిపప్పు ధర కేజీ ఏకంగా రూ. 180కు చేరింది. ఫలితంగా సామాన్య, దిగువ తరగతి వాళ్లకు కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రాయితీపై కందిపప్పు ఇస్తామని ప్రకటించి దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టింది. కేజీ రూ. 67 చొప్పున ప్రతి కార్డుదారుడికి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 5,47,539 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి 547 టన్నులకుపైగా పప్పు అవసరం. కాగా అక్టోబరులోనే దీన్ని ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. సరకు రాకపోవడంతో కేవలం 50 టన్నులు మాత్రమే ఇచ్చారు. దీంతో నవంబరులో పూర్తిస్థాయిలో ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే 300 టన్నులకు పైగా సరకు గోదాములకు చేరింది. ఇక్కడినుంచి డిపోలకు పంపించారు. ఒకటో తేదీనుంచి మొదలయ్యే రేషన్ సరఫరాలో కందిపప్పు అందనుంది. వచ్చేనెల మొత్తం కార్తికం కావడంతో ప్రతి ఒక్కరికి పప్పు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఇది అందడం ప్రజలకు ఊరటనిచ్చే అంశం.

**ప్రతి లబ్ధిదారుడికీ ఇస్తాం** – కె.వి.ఎల్.ఎన్.మూర్తి, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారిజిల్లాకు 547 టన్నుల సరకు అవసరంగా కాగా, ఇందులో మూడొంతులకు పైగా సరకు ఇప్పటికే చేరింది. మిగిలింది వచ్చేస్తుంది. గతనెలలో అనివార్య కారణాలతో సరకు పూర్తిగా చేరలేదు. నవంబరు లో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సరకు కచ్చితంగా ఇస్తాం. ఇబ్బంది లేకుండా మండలాల్లో అధికారులు పర్యవేక్షిస్తారు.

# ధ్యానం.. ఆరోగ్య యోగం!

నెల్లిమర్ల : చుట్టూ కొండలు.. పచ్చని చెట్లు.. పక్కనే చంపావతి నది ప్రవాహం.. చల్లగా తాకే గాలి.. ప్రకృతి రమణీయతకు చిరునామాగా నిలిచే ఆ ప్రాంతం.. ఇప్పుడు ధ్యాన కేంద్రంగా మారింది. వందలాది మంది నిత్యం అక్కడ ధ్యానం చేస్తూ.. ప్రశాంతతను, ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు వేదికగా నిలిచింది నెల్లిమర్ల మండలంలోని కొత్తపేట చంపావతి తీరంలోని బృందావన్ వ్యాలీ. ఇక్కడ ఏర్పాటైన పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆకట్టుకుంటోంది. అధునాతన నిర్మాణాలతో పాటు పరుగు, నడకకు వీలుగా పూర్తిస్థాయి హంగులతో ఉద్యానాన్ని తీర్చిదిద్దారు. ప్రవేశం ఉచితం. ముందుగా తెలియజేసి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకుడు వీరారెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది, అందులో భాగంగా సమాజానికి తన వంతు సేవ చేయాలన్న ఉద్దేశంతో పిరమిడ్ ధ్యానమందిరాన్ని నిర్మించినట్లు చెప్పారు.

# జల మార్గంలో.. గగన విహారం

శ్రీశైలం : దేశంలోనే రెండో జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో త్వరలో జల విమానం (సీప్లేన్) ఎగరనుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలానికి సీప్లేన్ నడపాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. నవంబరు మొదటి, రెండో వారంలో ట్రయల్ రన్ పూర్తి కాగానే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. వచ్చే నెల 9న ప్రకాశం బ్యారేజీ వద్ద సీప్లేన్‌ను ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. శ్రీశైలంలోని పాతాళగంగ– అక్కమహాదేవి గుహలకు వెళ్లే జల మార్గం ఏరోడ్రోమ్ ఏర్పా టుకు అనుకూలంగా ఉందని అధికార యంత్రాంగం గుర్తించింది. వాయుమార్గంలో వచ్చే విమానం నీటిపై దిగి అర కి.మీ దూరం ప్రయాణించి జెట్టీ దగ్గర ఆగనుంది. సీప్లేన దేశంలోనే శ్రీశైలానికి ప్రత్యేక గుర్తింపు దక్కనుంది.

**సమన్వయంతోనే సాకారం**

సీప్లేన్ ద్వారా వచ్చే పర్యాటకులకు రోప్‌వే, దేవస్థానం అధికారుల సహకారం తప్పనిసరి. సీప్లేన్‌లో వచ్చిన వారు శ్రీగిరికి చేరుకోవడానికి తగిన సౌకర్యాలు కల్పించాలి. రోప్‌వే వద్ద నుంచి ఆలయం వరకు ప్రత్యేక వాహనాలు అందుబాటులో ఉంచాలి. దర్శనం టిక్కెట్లు, వసతి గదులు కేటాయించాలి. పర్యాటకులను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వ శాఖలకు ఆదాయం పెరగనుంది.

బోటు షికారు.. పర్యాటకుల హుషారు

జల మార్గం ద్వారా పర్యాటకులు శ్రీశైలం చేరుకోవడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణ పర్యాటకశాఖ తరఫున రెండు వైపులా బోట్లు (సీజన్‌కు అనుగుణంగా) నడుపుతున్నారు.

**రోడ్డు మార్గం.. అవస్థల ప్రయాణం**

జ్యోతిర్లింగ క్షేత్రం కావడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల భక్తులు శ్రీశైలం సందర్శనకు ప్రాధాన్యం ఇస్తారు. శని, ఆది, సోమవారాల్లో రోజుకు 3 వేలకు పైగా వాహనాలు (కార్లు, బస్సులు) వస్తాయి. మంగళవారం నుంచి వరకు 2 వేల వరకు వస్తుంటాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్స



వాల సమయంలో 30 వేల వాహనాలు వస్తాయి.

శ్రీశైలం దర్శనానికి వచ్చి వెళ్లాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదు. బస్సులు, కార్లలో వచ్చిన వారు ఒక్కరోజులో తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవడం కష్టం. హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి రావడానికి సగటున 8 గంట సమయం పడుతోంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు శ్రీశైలం వచ్చి వెళ్లాలంటే కనీసం 2 నుంచి నాలుగు రోజుల సమయం పడుతోంది. పులుల అభయారణ్యం కావడంతో ఎన్నో ఆంక్షలు, ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**అమరావతి టు శ్రీశైలం**

శ్రీశైలం జలాశయం వద్ద ఏరోడ్రోమ్ ఏర్పాటు చేస్తారు. సీప్లేన్ ఎగిరేందుకు, దిగేందుకు సుమారు 1.16 కి.మీ పొడవు, 120 మీటర్ల వెడల్పున నీరు అవసరం అవుతుంది. ఇందుకోసం జలాశయం వెనుక జలాల్లో ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్ ఎక్కేందుకు, దిగేందుకు వీలుగా ప్రత్యేక జెట్టీ ఏర్పాటు చేయనున్నారు.

సీప్లేన్ అందుబాటులోకి వస్తే భక్తులు, పర్యాటకులు ఒక పూటలోనే శ్రీశైలం వచ్చి వెళ్లే అవకాశం ఉంటుంది. దీనివల్ల చాలా సమయం ఆదా అవుతుంది. దీంతో పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరగనుంది. వారాంతాల్లోయాత్ర కోసం వచ్చే వారి సంఖ్య కూడా పెరుగు తుంది.

**అర్ధంతరంగా ఆగిన హెలీ టూరిజం**

చంద్రబాబు సారథ్యంలోని తెదేపా ప్రభుత్వం 2018లోనే హెలీ టూరిజానికి పచ్చజెండా ఊపింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి హెలికాప్టర్ సర్వీసు ప్రారంభించారు. రూ.2500 ఛార్జీ తీసుకునే వారు. తర్వాత కొన్ని అభ్యంతరాలు రావడంతో సమీపంలోని ప్రాజెక్టు పాఠశాల స్థలాన్ని హెలిప్యాడ్ కోసం వినియోగించారు. అక్కడా అవాంతరాలు ఎదురుకావడంతో హెలీ టూరిజాన్ని అర్ధంతరంగా నిలిపేశారు.

# ప్రాజెక్టులు.. పరిశ్రమలు.. జిల్లా ఏర్పాటు

ఒంగోలు : ఎన్డీఏ కూటమిలోని తెదేపా, జనసేన, భాజపా నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఎన్డీఏ కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల సమన్వయ కమిటీ సమావేశం ఒంగోలు రామనగర్‌లోని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యేలు ఆనం దృష్టికి తెచ్చారు. వెలిగొండతో పాటు, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తికి తీసుకోవాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరు, ప్రకాశంలో అద్దంకి నియోజకవర్గాల విలీనం అంశాన్ని ప్రస్తావించారు. యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గ తెదేపా బాధ్యులకు కూడా ఎమ్మెల్యేల తరహాలోనే నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. కనిగిరి నిమ్జ్, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్ సమావేశం దృష్టికి తెచ్చారు. సాగు నీటి సంఘాలతో పాటు, పీఏసీఎస్ ఎన్నికలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, దేవస్థాన కమిటీల అంశంపై ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గ తెదేపా బాధ్యులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రద్ధ చూపని గత పాలకులు...:** సమావేశం అనంతరం ఆనం విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించడం ద్వారా ఎక్కువ నిధులు విడుదల కానున్నట్లు తెలిపారు. వెలిగొండ పూర్తిపై వైకాపా ప్రభుత్వం శ్రద్ధ పెట్టి ఉంటే నెల్లూరు జిల్లా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు కృష్ణా జలాలు వచ్చి ఉండేవన్నారు. దొనకొండ నుంచి రైల్వే లైన్‌ను జిల్లా ప్రధాన లైన్‌కు కలపాలనే ఆలోచన ఉందని.. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

చురకలు



# రెండు నిమిషాలు ఆగినా చాలు..!

ఎలమంచిలి : ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఎలమంచిలిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ హాల్టు. దీనికోసం డైలీ పాసింజర్ల అసోసియేషన్‌తోపాటు ప్రజా ప్రతినిధులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ హాల్టు కల్పిస్తే డైలీ పాసింజర్లతోపాటు, ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి అనకాపల్లి తరువాత తుని వరకు హాల్ట్ లేదు. దీనికి ఎలమంచిలిలో హాల్టు ఇస్తే రోజూ వందలాది మంది ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది. బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే రైలు ఎలమంచిలి స్టేషన్‌లో ఉదయం 9.50 కి క్రాస్ చేస్తుంది. దీనికి హాల్టు ఇస్తే ఇటు ఉదయం విశాఖ వైపు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లు దీని హాల్ట్‌కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. పారిశ్రామికవాడగా గుర్తింపు పొందిన అచ్యుతాపురం సెజ్‌లో పనిచేసే అధికారులు కార్మికులు ఎలమంచిలి రైల్వే స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తారు. రాంబిల్లి ఎన్ఏఓబీ అధికారులకు నేవీ అధికారులు ఈ స్టేషన్ నుంచి దూరప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. స్టేషన్‌కి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించి ఇక్కడ అదనపు రైళ్ల హాల్టు కోసం చాలా కాలంగా ప్రయాణికులు వినతులు అందిస్తున్నారు. ఎలమంచిలి నుంచి రోజు బెంగుళూర్, భువనేశ్వర్‌కి వందల మంది పైగా వెళ్తుంటారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే రోజువారీ ప్రయాణికుల సంఖ్య వెయ్యిమందికి పైగా ఉంటుంది. వీరందరి అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ప్రశాంతికి హాల్టు ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.




**కష్టాలు తీరుతాయి..**

– సేనాపతి జయంత్, కార్యదర్శి, డైలీ పాసింజర్ల సంఘం, ఎలమంచిలి

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి హాల్టు ఇవ్వాలి. దీనికి హాల్టు ఇస్తే బెంగళూరు వెళ్లేవారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ ప్రాంత వాసులంతా ఈ రైలు ఎక్కాలంటే అనకాపల్లి వెళ్లాల్సి వస్తోంది. ఎలమంచిలిలో హాల్టు ఇస్తే నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరతాయి. దీనిపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం.

**ఎలమంచిలికి ప్రాధాన్యంఉంది**

– కేఏ సత్యనారాయణ, అధ్యక్షులు, డైలీ పాసింజర్ అసోషియేషన్, నారాయణపురం రాంబిల్లి మండలం.

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌కి ప్రాధాన్యం ఉంది. జిల్లాలో అనకాపల్లి తరువాత ఇదే పెద్ద స్టేషన్ ఇక్కడ ప్రధాన రైళ్లకు హాల్టు కోసం పోరాటం చేస్తున్నాం. ముందుగా ప్రశాంతి హాల్టు ఇవ్వాలని కోరుతున్నాం. ఇది విశాఖ వెళ్లే డైలీ పాసింజర్లకి, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. భువనేశ్వర్‌కి వెళ్లే వారు నేరుగా ఎలమంచిలి నుంచి ప్రయాణించే వీలుంది. ఇన్ని ప్రయోజనాలున్న ఈ రైలుకి ఎలమంచిలిలో హాల్ట్ సౌకర్యం కల్పించాలి.

# ధర దిగాలు.. రైతులు కుదేలు



అనంతపురం : ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వేరుసెనగ రైతులకే కన్నీళ్లే మిగులుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. చేతికి అందిన కాస్త పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. నెల వ్యవధిలోనే క్వింటాలుకు రూ.700 నుంచి రూ.1200 వరకు పడిపోయింది. ఉమ్మడి అనంత జిల్లాలో మార్కెట్ సదుపాయం లేకపోవడం.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు చెప్పిందే ధరగా మారిపోయింది. కల్లాల్లో పంటను ఉంచుకోలేక దళారులు చెప్పిన ధరకే అమ్మేసుకుంటున్నారు. రెండు వారాల కిందట క్వింటాలు ధర రూ.7,200 ఉండగా ప్రస్తుతం రూ.5,800 మించి ఇవ్వడం లేదు. తమ రెక్కల కష్టానికి ఫలితం లేకుండా పోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేరుసెనగకు రూ.6,783 మద్దతు ధర ప్రకటించారు. ఈ లెక్కన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు క్వింటాలుకు రూ.వెయ్యి దాకా నష్టపోతున్నారు.

**ఆయిల్‌ఫెడ్‌ను నిర్వీర్యం చేసిన వైకాపా**

2019కు ముందు తెదేపా ప్రభుత్వం ఆయిల్‌ఫెడ్ ద్వారా ఏటా వేరుసెనగ కొనుగోలు చేసేది. సగటున ఏటా 6 లక్షల క్వింటాళ్ల వరకు రైతుల నుంచి కొనేవారు. చివరగా 2018–19లో ఉమ్మడి అనంతలో 3 లక్షల క్వింటాళ్ల వేరుసెనగను సర్కారు కొనుగోలు చేసింది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర అందేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆయిల్‌ఫెడ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆయిల్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేశారు. మరోవైపు ఇక్కడ మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రైతులు బళ్లారి, కర్నూలు ప్రాంతాలకు పంటను తరలించాల్సి వస్తోంది.

**ఎకరాకు రూ.10 వేలు నష్టం**

పెరిగిన ధరలతో వేరుసెనగ రైతులపై పెట్టుబడి భారం ఎక్కువవుతోంది. ఎకరా పొలంలో వేరుసెనగ విత్తనానికి రూ.12 వేలు, దున్నడానికి రూ.2 వేలు, ఎరువులకు రూ.5 వేలు, మందులకు రూ.6 వేలు, కూలీలకు రూ.10 వేలు, కోతలకు రూ.12 వేలు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సుమారు 50 వేల వరకు వ్యయం చేస్తున్నారు. దిగుబడులు మాత్రం ఏటా తగ్గిపోతూ వస్తున్నాయి. సాధారణంగా ఎకరాకు 10 క్వింటాళ్లు మేర దిగుబడి రావాల్సి ఉండగా వాతావరణ ప్రతికూల పరిస్థితులతో 7 క్వింటాళ్లు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరాకు రూ.40 వేలకు మించి రావడం లేదు. పెట్టుబడితో పోలిస్తే ఎకరాకు రూ.10 వేలు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు వాపోతున్నారు.

**కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

– మురళీ, సింగంపల్లి, ఆత్మకూరు

ఐదు ఎకరాల్లో రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టి వేరుసెనగ సాగుచేశాను. పది రోజుల కిందట పంట తొలగించాను. ధరలు తగ్గడంతో పంటను ఇంటిలోనే నిల్వ ఉంచుకున్నాను. క్వింటాలు రూ.5 వేలకు మించి ఇవ్వడం లేదు. వ్యాపారులంతా ఏకమై ఉన్నట్టుండి ధరలు తగ్గించేశారు. వెంటనే ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

**రూ.50 వేలు నష్టపోయా..**

– శంకర్‌రెడ్డి, యర్రంపల్లి, చెన్నేకొత్తపల్లి

ఐదెకరాల్లో వేరుసెనగ సాగు చేశాను. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను బోరు కింద సాగు చేయడంతో 36 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కోతల సమయంలో ధరలు బాగా ఉన్నాయని చెప్పడంతో కష్టాలు తీరుతాయని ఆశపడ్డాం. వర్షానికి పంట కొంత దెబ్బతిన్నా.. ధర బాగా ఉండటంతో పెట్టుబడి అయినా వస్తుందని ఆశించాం. ఈ తరుణంలో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై క్వింటాలుపై రూ.1400 వరకు తగ్గించారు. పది రోజుల కిందటి క్వింటాలు రూ.7,200 పలికింది. ఇప్పుడు రూ.5,800 మించడం లేదు. అంటే సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే మాకు మేలు జరుగుతుంది.

# తగ్గిన ధరలు.. ఊపందుకోని కొనుగోళ్లు

అనకాపల్లి : దీపావళి బాణసంచా అమ్మకాలకు జిల్లాలో 231 దుకాణాలకు అనుమతులు లభించాయి. అనకాపల్లి పట్టణంలో జీవీఎంసీ ఉన్నతాధికారుల అనుమతులతో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 40 దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 271 దుకాణాలు ఏర్పాటు చేశారు. గతేడాది 197 దుకాణాలే పెట్టగా ఈ ఏడాది వీటి సంఖ్య పెరిగింది. అనకాపల్లి జిల్లాకేంద్రంలో ఐదేళ్లపాటు అమ్మకాలు చేసుకునేందుకు రెండు దుకాణాలకు అనుమతులు ఉన్నాయి. వారు సైతం మైదానంలో విక్రయాలు సాగించారు.

నర్సీపట్నంలో గత ఏడాది 56 బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటవ్వగా ఈ ఏడాది 34 దుకాణాలకే అనుమతులు తీసుకున్నారు. బుధవారం మధ్యాహ్నానికే వీటిని ఏర్పాటు చేసినా కొనుగోలుదారులు పెద్దగా కానరాలేదు. గతేడాది రెండు రోజుల ముందునుంచే విక్రయాలు జోరుగాసాగాయి. పట్టణంలో పెద్దచెరువు గట్టుమీద దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. వచ్చిపోయేవారిని అడ్డగించి ఫలానా దుకాణాల్లో కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.

గతంతో పోల్చుకుంటే బాణసంచా ధరలు 20 శాతం వరకు తగ్గినట్టు వ్యాపారులు చెబుతున్నారు. టోకు దుకాణాలు దగ్గర్లోనే అందుబాటులో ఉండటం ఇందుకు కారణమంటున్నారు.



**ఫోన్ చేయాల్సిన నంబర్లు**

అగ్నిప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. 108 అంబులెన్స్‌లకు, 100 నంబరుకు ఫోన్ చేసి చెప్పవచ్చు. బాణసంచా కాల్చేటప్పుడు తాటాకిళ్లు, గడ్డివాములను దృష్టిలో పెట్టుకుని తగినంత దూరం, జాగ్రత్తలు పాటించాలి. చేతితో పట్టుకుని కాల్చే ప్రయత్నం విరమించుకోవడం మేలు. నూలు వస్త్రాలు ధరించాలి. నీళ్ల బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

ఫోన్ నంబర్లు: అనకాపల్లి: 08924 22299, ఎలమంచిలి: 08934 231101, నర్సీపట్నం 08932–235101, 9963728766, చోడవరం 08934–245199, 9963729097, మాడుగుల 08934–22,4211, 9963729442

**అవుట్‌పోస్టులతో పర్యవేక్షణ** – ఆర్.వెంకటరమణ, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

జిల్లావ్యాప్తంగా 271 దుకాణాలకు అనుమతులు ఇచ్చాం. దుకాణాలు ఏర్పాటు చేసినచోట ఇద్దరు అగ్నిమాపక సిబ్బందితో అవుట్ పోస్టులను పెట్టాం. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే రక్షణ చర్యలు తీసుకునే ఏర్పాట్లు చేశాం. దుకాణదారులు నగదు చెల్లిస్తే ఆయా ప్రాంతాల్లో అగ్నిమాపక వాహనాన్ని పెడుతున్నాం. నర్సీపట్నంలో నగదు చెల్లించి వాహనాన్ని పెట్టుకున్నారు. అనకాపల్లిలో గురువారం నగదు కడితే ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అరికట్టేలా రెండు రోజుల పాటు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

# పుడమి మురవాలి.. గంగ బెంగ తీరాలి

కొత్తపట్నం : జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి ఏడాది పొడవునా క'న్నీటి' కష్టాలు తప్పడం లేదు. తక్కువ వర్షపాతంతో భూగర్భ జలాలు ఇక్కడ పాతాళం వైపు పరుగులు తీస్తుంటాయి. అదే సమయం లో ఇష్టారీతిన భూగర్భ జలాన్ని తోడేస్తున్నారు. ఈ పరిస్థితులతో కొన్ని గ్రామాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే 57 గ్రామాల్లో వ్యవసాయ బోరు బావులు, ఇసుక తవ్వకాలపై అధికార యంత్రాంగం నిషేధాజ్ఞలు విధించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వర్షపు బొట్టును ఒడిసి పట్టి భూమి లోకి ఇంకించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. భూగర్భ జలాలు వృద్ధి చెందే దిశగా కార్యాచరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. నీటి సంరక్షణ పనుల్లో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద



ఇంటింటా ఇంకుడు గుంతలు, వాగులు వంకలపై చెక్‌డ్యామ్‌లు, పొలాల్లో పంట కుంటలు, కొండల్లో కందకాల నిర్మాణాలను ఉద్యమంలా చేపట్టాలని నిర్ణయించింది.

**ఒక్కో గుంతకు రూ.6 వేలు...**

2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 33 వేల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఒక్కో గుంత పొడవు, వెడల్పు, లోతు 1.20 మీటర్లు ఉండేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఏర్పాటు చేసుకున్న వారికి ప్రోత్సాహకంగా ఉపాధి హామీ పథకం నుంచి రూ.6 వేల చొప్పున నగదు ఇవ్వనుంది. పనులు చేసినందుకుగాను కూలీల వేతనాలకు రూ.550బీ సామగ్రి కొనుగోలుకు రూ.5,450 అందించనుంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రూఫ్ వాటర్ సంరక్షణ నిర్మాణాలు(పై కప్పు పరీవాహక ప్రాంతాల నుంచి వర్షపు నీటి సేకరణ) చేపట్టాలని నిర్ణయించారు. ఈ తరహా నిర్మాణాలు జిల్లాకు 256 మంజూ రయ్యాయి. నేలల స్వభావం ఆధారంగా ఒక్కోదానికి రూ.52–రూ.57 వేలు చొప్పున అందించనున్నారు.

**అవగాహన కల్పిస్తూ.. ముందుకు...**

లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ విషయమై జిల్లాలోని సాంకేతిక సహాయకులు, ఈసీ, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇంకుడు గుంతలతో ఒనగూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఇందుకుగాను ప్రదర్శన నిమిత్తం ముందుగా ఒక్కొక్కటి నిర్మించాలని నిర్ణయించారు. వర్షపు నీటితో పాటు, ఇంట్లో నుంచి బయటకు వెళ్లే వృథా నీటిని కూడా భూమిలోకి ఇంకించేలా గుంతలు ఏర్పాటు చేయడంపై ప్రజల్లోకి ఉద్యమంలా తీసుకెళ్లేందుకు డ్వామా అధికారులు ప్రణాళిక చేశారు.

# వ్యవసాయ కనెక్షన్లకు ఆపసోపాలు



తాడిపత్రి : రైతులు బోరుబావులకు వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు తీసుకోవడం కష్టంగా మారింది. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో చిన్న, సన్నకారు రైతులకు విద్యుత్తు సర్వీసులు రాక అవస్థ పడుతున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ రైతులు 'తమకు సర్వీసులు ఇవ్వండి మహాప్రభో' అంటూ విద్యుత్తుశాఖ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై కథనం.

గుత్తి డివిజన్‌లోని గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు సబ్‌డివిజన్లలో వందల మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల కోసం సొమ్ము చెల్లించారు. ఇద్దరు ముగ్గురు రైతుల భాగస్వామంతో డీడీలు కడుతున్నారు. ఆ తర్వాత నిరీక్షణ తప్పడం లేదు. గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, యల్లనూరు, పుట్లూరు, విడపనకల్లు, వజ్రకరూరు తదితర మండలాల్లో ఒక సర్వీసు కోసం ఇద్దరు రైతుల చొప్పున రూ.24 వేలు డెవలప్‌మెంట్ ఛార్జీలు చెల్లించారు.

**600 వరకు బోర్ల తవ్వకాలు**

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి సబ్ డివిజన్లలో రైతులకు ఏడాది నుంచి సర్వీసులు ఇవ్వడం లేదు. గుత్తిడివిజన్ మొత్తం మీద సుమారు 600 బోర్లను వైకాపా ప్రభుత్వం జలకళ కింద రైతులకు ఉచితంగా బోర్లు తవ్వించింది. తొలుత బోర్లు తవ్వించి తాము విద్యుత్తు సర్వీసులు ఇప్పించి మోటార్లను కూడా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించిన వైకాపా ప్రభుత్వం తరువాత చేతులెత్తేసింది.

**ఇళ్లల్లోనే నియంత్రికలు**

రైతులు అప్పులు చేసి బోర్లకు విద్యుత్తు సర్వీసులు తీసుకునేందుకు డీడీలు తీసి ఇచ్చారు. వీటిని తీసుకున్న విద్యుత్తుశాఖ అధికారులు రైతులకు నియంత్రికలను ఇచ్చారు. గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో రెండు, మాముదూరులో మూడు, అనగానదొడ్డి,పెద్దొడ్డి తదితర గ్రామాల్లో నియంత్రికలను రైతులు తమ ఇళ్లల్లో ఉంచుకున్నారు. పొలాల్లో ఉండాల్సిన నియంత్రికలు రైతుల ఇళ్లల్లో ఉండిపోతున్నాయి. అవికాస్త తుప్పుపడుతున్నాయి. సకాలంలో విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

**మంజూరులో చేతివాటం!**

పైసలు ఇస్తేనే నియంత్రికలు, విద్యుత్తుతీగలు, ఇతర సామగ్రి ఇస్తారు. జిల్లాస్టోర్‌లో కనీసం విద్యుత్తు తీగలు కూడా అందుబాటులో లేవు. 8 నెలల కిందట గుత్తి డివిజన్‌లోని వజ్రకరూరులో పనిచేస్తున్న ఏఈఈ చంద్రశేఖర్ ఓ రైతుతో రూ.30వేలు నియంత్రికకు వసూలు చేస్తుండగా ఏసీబీ అధికారులు గుత్తిలో పట్టుకున్నారు. నియంత్రికలను ఇచ్చేటప్పుడు లంచాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో రైతు రామచంద్ర ఇంటిలో విద్యుత్తు నియంత్రికను ఉంచారు. ఆయన తన సోదరుడి పేర్లతో సర్వీసుకు ఏడాది కిందట దరఖాస్తు చేసుకొని మూడు సర్వీసులకు గాను డీడీలు కట్టారు. అధికారులు 8నెలల కిందట నియంత్రిక ఇచ్చారు. ఆ నియంత్రికను ఖాళీ పొలంలో ఉంచలేక భద్రతకోసం ఇంటిలో ఉంచుకున్నారు. నియంత్రిక తప్పుపడుతోంది. రైతులు తమకు సర్వీసులు ఇప్పించాలని గత సోమవారం తహసీల్దారు ఓబులేసుకు వినతిపత్రం ఇచ్చారు.

**సీనియారిటీ ప్రకారం కేటాయింపులు** –రాజశేఖర్, ఈఈ,గుత్తి

విద్యుత్తు సర్వీసులను సీనియార్టీ ప్రకారం ఇస్తాం. జిల్లాకేంద్రలోని స్టోర్‌లో సామగ్రిలేదు. దీనికి గాను ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇంకా నెలన్నర సమయం పడుతుంది. కొత్తగా బోర్లు వేయించుకుంటున్న రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే సినియార్టీ జాబితాలో ఉంటారు. కనెక్షన్ల మంజూరు విషయంలో అలసత్వం ఉండదు.

# పాలకుల అజ్ఞానం.. దూరమైన పుస్తక విజ్ఞానం

విజయనగరం : ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు, నిరుద్యోగులకు పుస్తక విజ్ఞానం దూరమవుతోంది. గత ప్రభుత్వం డిజిటల్ పేరుతో శాఖా గ్రంథాలయాలను పూర్తిగా పక్కనెట్టేసింది. కనీసం సిబ్బంది, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయింది. ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలు కట్టిన సెస్ సొమ్మును సైతం అడ్డదారిన బొక్కేసింది. దీంతో గత అయిదేళ్లూ నిర్వహణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో మళ్లీ గాడిలో పెట్టేందుకు కూటమి అడుగులు వేస్తోంది. ఈమేరకు ప్రణాళికలు రూపొందించింది.

**నిధులని.. నమ్మించి**

రెండు జిల్లాలకూ విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయం కీలకమైంది. ఇక్కడి నుంచే ఇతర శాఖలపై పర్యవేక్షణ ఉంటుంది. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరింది. పాఠకులు చదువుతున్న గది పైకప్పు దెబ్బతింది. పలుచోట్ల సీలింగ్ ఊడిపోయింది. ఈ పరిస్థితిని అప్పట్లో గ్రంథాలయ మాజీ ఛైర్‌పర్సన్ పద్మావతితో పాటు పలువురు బొత్స సత్యనారాయణను



కలిసి తెలియజేశారు. ప్రతిపాదనలు పంపించాలని, నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీఇచ్చారు. నమ్మేసిన అధికారులు రూ.1.20 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఆ ప్రక్రియ అక్కడితోనే ఆగిపోయింది.

**శిథిలం.. సిబ్బంది కొరత..**

ఉమ్మడి జిల్లాలో 41 గ్రంథాలయాలుండగా, 16 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన వాటికి సొంత భవనాలున్నా చాలావరకు శిథిలావస్థకు చేరాయి. మండల, గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. 41 శాఖల్లో కార్యదర్శి, గ్రంథపాలకుడు, సీనియర్, జూనియర్ సహాయకులు, రికార్డు సహాయకుడు, కార్యాలయ సహాయకులు.. ఇలా మొత్తం 108 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం 34 మంది మాత్రమే ఉన్నారు.

**ఆశలు రేకెత్తించి..**

ప్రతి సచివాలయంలోనూ డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేసి, హైస్పీడ్ అంతర్జాల సౌకర్యంతో కంప్యూటర్లను సమకూర్చుతామని వైకాపా గొప్పలు చెప్పింది. విదేశాలు, రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ స్వగ్రామాలకు వచ్చేవారు వాటిని సద్వినియోగం చేసుకునేలా తీర్చిదిద్దుతామని ఆశలు రేకెత్తించింది. కానీ ఎక్కడా కానరావడం లేదు. కేంద్ర గ్రంథాలయంలో 8 కంప్యూటర్లతో ఈ–కేంద్రం ప్రారంభించినా.. సేవలు అంతంతే.

**సెస్ రాక ఇబ్బందులు..**

పంచాయతీలు, నగరపాలికలు, పురపాలికలు 8 శాతం మేర సెస్ కట్టాలి. గత పాలకవర్గం వసూళ్లపై దృష్టిపెట్టలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. ఆయా కార్యాలయాల నుంచి రూ.5 కోట్ల వరకు రావాలి. ప్రస్తుతం సెస్ నిల్వ రూ.56 లక్షలు మాత్రమే ఉంది. దీంతో ప్రతినెలా జీతాలకు అవస్థలు తప్పడం లేదు. ఏడు ప్రాంతాల్లో కొత్త భవనాలు మంజూరైనా స్థలాలు లేక నిర్మాణాలకు నోచుకోవడం లేదు. కొన్నిచోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమైనా.. నిధుల్లేక ఆగిపోయాయి. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5 కోట్లతో ప్రతిపాదనలు చేశామని గ్రంథాలయాల కార్యదర్శి బి.లక్ష్మి తెలిపారు.

# సై'కిల్' అవ్వాల్సిందేనా?

చెన్నేకొత్తపల్లి : గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు నడక భారం తగ్గించాలన్న ఉద్దేశంతో గత తెదేపా ప్రభుత్వం 8, 9వ తరగతులకు సైకిళ్లు పంపిణీ మొదలు పెట్టింది. 2014 నుంచి 2019 వరకు సైకిళ్లు పంపిణీ చేశారు. 2018 చివరిలో సైకిళ్లు రావడం, వాటిని పంపిణీ చేయకపోవడంతో మూలన పడేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఉన్నత పాఠశాలలో ఓ గదిలో 155 సైకిళ్లను ఉంచి తాళం వేశారు. ఆరేళ్లుగా వాటిని పట్టించుకోలేదు. తుప్పు పడుతున్నాయి. వైకాపా ప్రభుత్వ పాలనలో కనీసం కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. సైకిళ్ల విషయాన్ని స్థానిక మండల విద్యాధికారులు మున్వర్‌బాషా, ప్రసన్న కుమార్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను డీఈఓకు నివేదించామన్నారు. రూ.లక్షలు వెచ్చించి ఇలా నిరుపయోగంగా మూలనపడేస్తే ఎవరికి లాభమంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



## దేవస్థానంలో నెయ్యి కొనుగోలుకు ప్రత్యామ్నాయ చర్యలు

సింహాచలం : సింహాచలం దేవస్థానంలో రైతు డెయిరీ సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో ఆహార భద్రతా అధికారులు 945 కిలోల నెయ్యి సీజ్ చేసిన నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు సన్నాహాలు చేపట్టారు. ప్రస్తుతం దేవస్థానంలో సుమారు 71వేల లడ్డూలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు సుమారు 25వేలకు పైగా లడ్డూలు విక్రయానికి అవసరమవుతాయి. లడ్డూల తయారీతో పాటు ఆలయంలో దీపారాధన, ఇతరత్రా వాటికి నెయ్యి తక్షణ అవసరం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రంలోని దేవస్థానాలను ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న డెయిరీల నుంచి ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తూ నెయ్యి కొనుగోలు చేయాలని సూచించారు. ఆ మేరకు సింహాచలం దేవస్థానం అధికారులు విశాఖ డెయిరీ నుంచి తాత్కాలికంగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఉన్నతాధికారుల అనుమతుల మేరకు తొలి విడతగా సోమవారం వంద డబ్బాల (1500 కిలోలు) నెయ్యి కొనుగోలు చేయనున్నట్లు స్టోర్సు విభాగం ఏఈవో పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు.

## రెవెన్యూ బదిలీలలు

కర్నూలు : జిల్లాలో జరిగిన రెవెన్యూ బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. సిఫార్సు లేఖలకు ప్రాధాన్యమిచ్చారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అందలమెక్కించారు. ఎలాంటి లేఖలు ఇవ్వనివారిని దూరంగా విసిరేశారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పాతుకుపోయిన వారిని ఏమాత్రం కదిలించలేదు. ఇలా రెవెన్యూ బదిలీలు అస్తవ్యస్తంగా జరిగాయి. బదిలీల ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించాల్సి ఉండగా దానిని పక్కన పెట్టారు. నిర్వహించిన బదిలీల్లో సుమారు 400 మందికి స్థానచలనం కలిగించారు. బదిలీల్లో పలువురు తమ పలుకుబడి ఉపయోగించారు. దరఖాస్తు చేసుకోకపోయినా..బదిలీలకు దరఖాస్తు చేసుకోనివారిని ఉన్నఫళంగా బదిలీ చేశారు. కొందరు వ్యక్తులు సదరు స్థానాలపై కన్నేసి తమ పలుకుబడి ఉపయోగించడంతో వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి వారికి అవకాశమిచ్చారు. తాము దరఖాస్తు చేసుకోకపోయినా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంతో అవాక్కయ్యారు. బదిలీల వ్యవహారంలో కొందరు కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి.

గతంలో వైకాపా ప్రభుత్వంలో పలువురు వీఆర్వోలు ఆ పార్టీ నాయకులతో అంటకాగారు. వారి చెప్పినట్లు విన్నారు. పెద్దఎత్తున అక్రమాలకు సహకరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి తెదేపా నాయకులతో అంటకాగుతూ తమకు అవసరమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. ఈ బదిలీల ప్రక్రియను చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు అందించి..కల్లూరు మండలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వీఆర్వోను ఆగస్టులో దేవనకొండ మండలానికి డిప్యుటేషన్‌పై వేశారు. ఆ తర్వాత దానిని రద్దు చేసి ఆగమేఘాలపై ఆయన కోరుకున్న ఓర్వకల్లు మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. కల్లూరు మండలానికి చెందిన ఓ వీఆర్వో సి.బెళగల్ మండలానికి మొదట సిఫారసు లేఖ తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఒక్క రోజులోనే మనసు మార్చుకొని తిరిగి ఓర్వకల్లు మండలానికి వేయించుకున్నారు. మరో ముగ్గురు వీఆర్వోలు సైతం సి.బెళగల్ మండలానికి బదిలీపై వెళ్లాలని నిర్ణయించుకొని ప్రజాప్రతినిధుల లేఖలు తెచ్చుకున్నారు. ఒక్కరోజులోనే వారు తిరిగి తాము కోరుకున్న మంచి డిమాండ్ ఉన్న స్థానాలకు బదిలీ చేయించుకున్నారనే విమర్శలున్నాయి. కృష్ణగిరి మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వోను ఆయన సొంత గ్రామానికి బదిలీ చేశారు. లేఖలు లేకుంటే అంతే..ఎలాంటి సిఫారసు లేఖలు లేని వీఆర్వోలను దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. లేఖలకు ప్రాధాన్యం ఇచ్చారేతప్ప



వారి పనితీరును ఎక్కడా గుర్తించలేదు. పలువురు ముడుపులు ఇవ్వకపోవడంతోనే దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలున్నాయి. కర్నూలు అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వీఆర్వోను వెల్దుర్తి మండలానికి బదిలీ చేశారు. ఓర్వకల్లు మండలం నుంచి ఓ వీఆర్వోను కృష్ణగిరి మండలానికి వేశారు. కర్నూలు గ్రామీణ మండలంలో పనిచేసే వ్యక్తిని దేవనకొండ మండలానికి బదిలీ చేశారు. వీరంతా ఎలాంటి సిఫారసు లేఖలు ఇవ్వకపోవడంతో దూర ప్రాంతాలకు బదిలీలు చేశారనే ఆరోపణలున్నాయి.

ప్రభుత్వాలు మారినా..ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ కొందరు వీఆర్వోలు మాత్రం ఆయా స్థానాల్లోనే కొనసాగుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగారు. ఐదేళ్లపాటు తమ స్థానాలను పదిలపరుచుకున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా నాయకులను ప్రసన్నం చేసుకుని అక్కడే కొనసాగుతున్నారు. కొందరు కొత్తగా పోస్టింగ్ వచ్చినప్పటి నుంచి సుమారు 16 ఏళ్లపాటు మండలాన్నే వదిలి వెళ్లకపోవడం గమనార్హం. కర్నూలు గ్రామీణ మండల పరిధిలో పనిచేసే ఓ వీఆర్వో 2008 నుంచి కొనసాగుతూనే ఉండటం గమనార్హం. మధ్యలో కొద్ది నెలలపాటు వేరే మండలానికి డిప్యుటేషన్‌పై వెళ్లి తిరిగి తన స్థానానికి వచ్చేశారు.

వారికి వర్తించవా..కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి ఒకే సీటులో పనిచేస్తున్న కొందరు రెవెన్యూ సిబ్బందిని మార్చడం లేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి కలెక్టరేట్‌లో ప్రక్షాళన జరగాలని ఆదేశాలు ఇచ్చినా బేఖాతరు చేశారు. కొందరు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అదే సీటులోనే కొనసాగుతున్నారు. వీరిని వివిధ మండలాలకు మార్చినా.. తమ పలుకుబడితో తిరిగి డిప్యుటేషన్‌పై అదే సీట్లలో వాలిపోతుండటం గమనార్హం. కొందరు కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నా వారిని రానీయడం లేదన్న ఆరోపణలున్నాయి.

# చెర వీడిన.. 'సీతాకోక చిలుక..'



కొమ్మాది: ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతూ నాటి వైకాపా పెద్దలు తీసుకున్న నిర్ణయానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని లేఅవుట స్థలాలను పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించాలే తప్ప ప్రయివేటు వ్యక్తులకు బదలాయించడం కుదరదని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఏకే సింఘాల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాడు జీవీఎంసీ కౌన్సెల్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేశారు.

ఆగమేఘాలపై కౌన్సెల్‌లో తీర్మానం: మధురవాడ సర్వే నెంబరు 192/12పీలో స్థానిక నాయకులకు చెందిన 484.39 చదరపు గజాల స్థలాన్ని జీవీఎంసీకి బదలాయించి ఎంఎస్ఆర్ లేఅవుట్ నెంబరు 5/87లోని బటర్‌ఫ్లై (సీతాకోకచిలుక) పార్కు స్థలాన్ని వారికి కేటాయించాలని జీవీఎంసీ కౌన్సెల్‌లో తీర్మానం చేశారు. ప్రయివేటు వ్యక్తులకు లబ్ధి చేకూరేలా స్థల మార్పిడి చేయవద్దని అప్పట్లో ప్రతిపక్షాలు, పత్రికలు ఘోషించినా వైకాపా పాలకవర్గం పట్టించుకోలేదు. ఆగమేఘాలపై స్థల మార్పిడి తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టును ఆశ్రయించారు.లేఅవుట్ లోని స్థలాల వినియోగంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని మూడు వారాల్లోగా మూర్తియాదవ్‌కు సమాధానం ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దానిపై ఆయన సంతృప్తి చెందకపోతే, తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఆ ఉత్తర్వులను పరిశీలించిన మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి తాజాగా భూబదలాయింపును నిలిపివేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు.

తీర్మానానికి ముందే నోట్ తయారీ..

మధురవాడ సర్వే నెంబరు 192/12పీలోని ప్రయివేటు వ్యక్తులకు చెందిన 489 గజాల స్థలంలోకి వెళ్లడానికి దారి లేదు. దీంతో గజం రూ.10వేలకు మించి కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. పక్కనే ఎంఎస్ఆర్ లేఅవుట్ లోని బటర్‌ఫ్లై పార్కుకు కేటాయించిన స్థలం ముందు బీటీ రోడ్డు ఉంది. పరస్పర బదలాయింపు విధానం ద్వారా ఆ స్థలాన్ని తీసుకుంటే గజం ధర రూ.80వేల వరకు పలుకుతుంది. 489 గజాల స్థలం ధర రూ.3.91కోట్లకు చేరుకుంటుందని గుర్తించారు. దీంతో స్థల యజమానులు అప్పటి వైకాపా పెద్దలను కలిసి బేరం కుదుర్చుకున్నారు. తర్వాత కౌన్సెల్ సమావేశంలో దాన్ని ఆమోదం పొందేలా చేశారు. నాడు ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకించినా జీవీఎంసీ పాలకవర్గం ఏకపక్షంగా వ్యవహరించింది. తీర్మానానికి ముందే అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ భూ బదలాయింపు నోట్ తయారు చేయడం గమనార్హం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. కౌన్సెల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వైకాపా పెద్దల అక్రమాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

పార్కు నిర్మాణాన్ని అటకెక్కించి..: ఎంఎస్ఆర్ లేఅవుట్ లో సీతాకోక చిలుక(బటర్ ఫ్లై) ఆకారంలో పార్కు నిర్మించాలని పాలకవర్గం తీర్మానించింది. 2021 ఆగస్టు 17న గుత్తేదారు శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత వైకాపా నాయకులు రంగ ప్రవేశం చేయడంతో గుత్తేదారు పనులు ప్రారంభించకుండా జాప్యం చేశారు. అనంతరం భూ బదలాయింపు ప్రతిపాదన వచ్చింది. తర్వాత గుత్తేదారు పార్కు నిర్మాణ పనులు చేపట్టకుండా 500 చదరపు గజాల స్థలం మినహాయించి ప్రహరీ నిర్మించాడు. దీనిపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తక్షణమే మొత్తం స్థలానికి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. అయితే జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

# గడ్డ కట్టే నూనెలతో నెయ్యి కల్తీ



విశాఖపట్నం : నూనెలతో పోలిస్తే నెయ్యి కల్తీ సులభం. అత్యున్నత ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలల్లో తప్ప సాధారణంగా నాణ్యతను గుర్తించలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గడ్డకట్టే స్వభావం ఉన్న పామాయిల్, వనస్పతిని నెయ్యిలో కలుపుతారు. నెయ్యితో పోలిస్తే ఆ నూనెల ధర తక్కువ. వీటితో ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదు. జంతువుల కొవ్వు కలిపితే ఇంకా ప్రమాదకరం. దేవాలయాల్లో వినియోగించే నెయ్యిలో కల్తీల స్థాయిని గుర్తించే ప్రాంతీయ ప్రజా ప్రయోగశాలల్లో తగిన సాంకేతిక పరికరాలు లేవు. తిరుమలలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిందంటున్న నేపథ్యంలో ఆహార భద్రత తనిఖీ రాష్ట్ర ప్రయోగశాల చర్చనీయాంశమవుతోంది.

ప్రకటన ఇచ్చి ఊరుకుంది..

విభజన తర్వాత రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ప్రయోగశాలను విశాఖలో నిర్మించినా వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాలేదు. భవనాలు, మైక్రోబయాలజీ పరికరాలు వచ్చినా సిబ్బంది నియామకం జరగలేదు. ఇతర సాంకేతిక పరికరాలు కొన్ని ఉండాలి. ఎన్ఏబీఎల్(నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్) గుర్తింపు రావాలి. ఉద్యోగాల భర్తీకి గత ప్రభుత్వం ప్రకటన ఇచ్చి ఊరుకుంది. ముఖ్యమైన ప్రతి నమూనానూ హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపుతున్నారు. అక్కడి నుంచి ఫలితాలు వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుంది.

ప్రాంతీయ ప్రయోగశాలలదీ అదే తీరు

రాష్ట్రంలో విశాఖ, కర్నూలు, గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ ప్రజా ప్రయోగశాలలున్నాయి. వీటిలో సిబ్బంది కొరత వేధిస్తుంది. విశాఖలో 20 మందికి ఆరుగురే ఉన్నారు. దేవాలయాల ప్రసాదాలు, నెయ్యిలో నాణ్యత పరిశీలనకు ఈ ప్రాంతీయ ప్రయోగశాలలకు నమూనాలు పంపితే కల్తీ ఉందా లేదా అనేదే తేలుస్తారు. అది ఏ రకమైన కల్తీనో చెప్పే సాంకేతికత లేదు.

ఆహార తనిఖీ అధికారిని సభ్యుడిగా చేస్తే...: ఆలయాల్లో ప్రసాదాల తయారీ భక్తుల మనోభావాలతో కూడిన విషయం. ప్రసాదాల టెండర్ల కమిటీలో ఆహార తనిఖీ భద్రతాధికారిని సభ్యుడిగా చేరిస్తే మేలనే అభిప్రాయం ఉంది. గుత్తేదారులకు ఫుడ్ లైసెన్స్ ఉందా లేదా, బ్రాండ్ ఏంటి, తీసుకొచ్చిన నమూనాల్లో తగిన ప్రమాణాలున్నాయా లేదా అని సత్వరం గుర్తించడానికి వీలుంటుంది. ఏ ప్రధాన ఆలయంలోనూ ఇలా చేస్తున్న దాఖలాలు లేవు. గుత్తేదారుల బిల్లుల మంజూరుకు తూతూమంత్రంగా తనిఖీలు చేయిస్తున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతీయ ప్రయోగశాలల్లో నివేదికల్లో వాస్తవాలు బయటకు రాకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

# ధర ఘనం.. మరి నాణ్యత..?

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయానికి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యత రంగు, రుచి, వాసన ఉండటం లేదు.. మండు వేసవిలోనూ గడ్డలు కట్టేస్తోందంటూ గతంలోనే ఇక్కడి అర్చకులు, పరిచారకులు, ప్రసాదాల తయారుచేసే పోటు సిబ్బంది, పర్యవేక్షించే అధికారులు పలు దఫాలు ఆలయ ఈవోల దృష్టికి తీసుకొచ్చారు. మనమేమీ చేయలేమంటూ కొందరు చేతులు దులుపుకొంటే.. మరికొందరైతే అధిష్ఠాన నిర్ణయమంటూ ఫిర్యాదుదారుల నోరు నొక్కేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది. తిరుమల లడ్డూల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ కావడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో కమిషనర్ సత్యనారాయణ దేవాదాయ శాఖ పరిధిలోని ఆయా ఆలయాలకు సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతపై తనిఖీలకు ఆదేశించారు. వైకాపా ప్రభుత్వం ఏర్పాటుకు ముందు శ్రీకాళహస్తిలో విజయ, నందిని తదితర కంపెనీల నెయ్యిని వినియోగిస్తూ వచ్చారు. తరువాత వైష్ణవి, తిరుమల తదితర కంపెనీల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

నెలకు ఎనిమిది టన్నుల వరకు..

ముక్కంటి ఆలయానికి అవసరమైన నెయ్యి నిల్వలను తిరుపతి గుత్తేదారులు సరఫరా చేస్తున్నారు. లడ్డూ ప్రసాదంతోపాటు చక్కెర పొంగలి, ఉప్పు పొంగలి తదితర అన్న ప్రసాదాలకు నెయ్యిని వినియోగిస్తుంటారు. వీటితోపాటు హోమాలు, నేతిదీపాలకు ఇదే నెయ్యిని సమకూరుస్తున్నారు. నెలకు 7 నుంచి 8 టన్నుల నెయ్యిని వినియోగిస్తున్నారు.

ధరలు పరిశీలిస్తే..



2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు వైష్ణవి, తిరుమల నెయ్యి కిలో రూ.497.49 వంతున, 2023 ఆగస్టు 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు వైష్ణవి నెయ్యిని కిలో రూ.569.50 వంతున గుత్తేదారులు సరఫరా చేశారు. ఇదే ధరలకు గతంలో సరఫరా చేసిన కంపెనీల నెయ్యి అందుబాటులో ఉన్నా కాదని కొత్తగా కొనుగోలు చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఇకనైనా విమర్శలకు తావులేకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## కాలిన కమ్మీల్లో.. కోట్లు దండుకున్నారు

చిత్తూరు : కాలిపోయి.. తుప్పు పట్టిన తీగలు, కమ్మీల నుంచి కోట్లు దండుకున్న వైనం.. విద్యుత్తు శాఖలో కిందిస్థాయి అధికారుల తీరును చూస్తే ఇసుక నుంచే తైలం తీస్తారనే సామెత నిజమైందనడంలో సందేహం లేదు.. అయిదేళ్ల వైకాపా ప్రభుత్వంలో విద్యుత్తుశాఖ అవినీతిలో కూరుకుపోయింది.. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అవినీతి, అక్రమాలకు అడ్డూ లేకుండా పోయింది. తిరుపతి సర్కిల్ పరిధి చిత్తూరు జిల్లాలోని పలమనేరు, అన్నమయ్య జిల్లా పీలేరులోని నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో తుప్పుపట్టిన వైరు(స్క్రాప్) పక్కదారి పట్టించి రూ.3.5 కోట్లు స్వాహా చేశారు.. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు బయటకు పొక్కనీయకుండా దాచడం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ పరిధిలో నియంత్రికల మరమ్మతు కేంద్రాలు ఎనిమిది ఉన్నాయి. కాలిపోయిన నియంత్రికలను ఈ కేంద్రాలకు తరలిస్తే అక్కడ మరమ్మతులు చేసి మళ్లీ వాటిని అప్పగిస్తారు. దగ్ధమైన నియంత్రికల్లో కాలిపోయిన రాగి, అల్యూమినియం వైర్లు తొలగించి కొత్తవాటిని అమర్చి వినియోగదారులకు అందిస్తారు. ఒకవేళ నియంత్రిక పనికి రాదనుకుంటే నిబంధనల ప్రకారం దాన్ని విద్యుత్తు శాఖ గోదాముకు అప్పగించి అక్కడి నుంచి కొత్తదాన్ని అందజేస్తారు. ఈ సమయంలో కాలిపోయిన, తుప్పు పట్టిన రాగి, అల్యూమినియం వైర్లను సైతం గోదాములో అప్పగించాలి. ప్రైవేటు గోదాముల్లో ఇలా జరిగినా ఆయా వైర్లను ప్రభుత్వ గోదాముకే అప్పగించాలి. మరమ్మతు కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక విభాగం ఉంది. సర్కిల్ పరిధిలో ఈఈలు, డీఈఈలు ఉంటారు. నెలకు రెండుసార్లు ఈఈ, ఆరుసార్లు డీఈఈలు ఈ కేంద్రాలకెళ్లి పర్యవేక్షించాలి. రికార్డుల నిర్వహణ మొదలు మరమ్మతులు, సిబ్బంది పనితీరు



సైతం పరిశీలించాలి. కానీ తమ వాటా చేరింది కదా..? అక్కడేం జరిగితే తమకేమన్నట్లు ఉన్నతాధికారులు వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పలమనేరులో రూ.2.5 కోట్లు

పలమనేరులోని కేంద్రంలో రూ.2.5 కోట్ల విలువైన తుప్పు వైరు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఇక్కడి అధికారి కాలిపోయిన వైర్లను గోదాముకు అప్పగించకుండా అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేశారు. ఇలా వచ్చిన సొమ్ము సుమారు రూ.2.50 కోట్లు స్వాహా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేంద్రంలో 150 నియంత్రికలకు లెక్కల్లేవు. 50 నియంత్రికలు అసలు ఎవరికిచ్చారో తెలియదు. ఆ వివరాలు లేవు. కేంద్రానికి తరలించినవి పూర్తిగా పనికిరాకపోతే పేపరు నోటీసు ద్వారా మరొకటి అందజేయాలి. ఇదీ నిబంధన. అసలు ఎలాంటి నోటీసులివ్వకుండా అందజేశారు. రికార్డుల నిర్వహణే లేదు.

పీలేరులో రూ.కోటి అన్నమయ్య జిల్లా

పీలేరులోని కేంద్రంలోనూ రూ.కోటి దండుకున్నారు. అక్కడ పనిచేసే ఉప-ఇంజినీరు తుప్పు పట్టిన రాగి, అల్యూమినియం తీగలను చెన్నైలో విక్రయించి స్వాహా చేశారని ఆ శాఖ అధికారులే నిర్ధారించినట్లు సమాచారం. వెలుగులోకి రావడంతో తీగను చెన్నై నుంచి తెచ్చి అప్పగిస్తానని సదరు అధికారి చెప్పడం, ఇందుకు చెన్నైకి వెళ్లారని సమాచారం. రికవరీ చేస్తాంరాగి, అల్యూమినియం తీగలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు గుర్తించాం. రికవరీకి చర్యలు చేపట్టాం. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేది లేదు.మహేశ్వరరెడ్డి, ఈఈ, నియంత్రికల మరమ్మతు కేంద్రాల విభాగం

## మ్యుటేషన్ పేరుతో ముంచేశారు

కర్నూలు : చట్ట నిబంధనల ప్రకారం దస్తావేజులు, వారసత్వహక్కు పత్రాలు తదితరాలన్నీ జాగ్రత్తగా పరిశీలించి భూములను మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకున్నారు. తమకు నచ్చినవారికి మ్యుటేషన్ చేసి అందినకాడికి దండుకుంటున్నారు.హాలహర్వి మండలం ఎస్.విరుపాపురం గ్రామ సర్వే నంబరు 66/సి3లో గ్రామానికి చెందిన బసప్ప అనే వ్యక్తి 1.06 ఎకరాలను 1988లో కొనుగోలు చేశారు. ఆయనకు ఇద్దరు సోదరులు. ఉమ్మడి కుటుంబంలో ఆయన కుటుంబ పెద్ద కావడంతో బసప్ప పేరుతో భూమి కొనుగోలు చేసినప్పటికీ కుటుంబసభ్యులందరూ కలిసే వ్యవసాయం చేసుకునేవారు. ఆ ముగ్గురు సోదరులు చనిపోయిన తర్వాత వారి వారసుల్లో అత్యధికులు నేటికీ కలిసే వ్యవసాయం చేసుకుంటున్నారు. చట్టప్రకారం ఆ భూమిని పంచుకోకపోవడం రెవెన్యూ అధికారులకు కలిసి వచ్చింది. గతేడాది జూన్‌లో అప్పట్లో హాలహర్వి తహసీల్దారు మల్లికార్జునస్వామి 35 సెంట్లను కె.వీరభద్రకు, మరో 71 సెంట్లను బోళగోటగౌడు, కె.నాగప్ప అనే వారికి మ్యుటేషన్ చేయడంతో బసప్ప వారసులు హతాశులయ్యారు. వారిలో కె.వీరభద్ర ఒక్కరే బసప్ప కుటుంబసభ్యుడు కాగా, బోళగోటగౌడు, కె.నాగప్పకు వారి కుటుంబంతో ఏమాత్రం సంబంధం లేదు. వారికి భూమి విక్రయించిన దాఖలాలు లేవు. ఆ భూములను వారి పేరుతో మ్యుటేషన్ చేయించడంతో బసప్ప కుటుంబసభ్యుల వారసులు గతేడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆ వివాదాన్ని పరిష్కరిస్తానని మళ్లీ ఆ తహసీల్దారే నచ్చజెప్పి రూ.45 వేలకు బేరం చేసుకున్నారన్నది బాధితుల ఆరోపణ. ఈ మేరకు ఫోన్‌పే చేశానని బసప్ప కుటుంబసభ్యుల వారసుడైన విశ్వనాథ్ ఆరోపిస్తున్నారు. ఆ మొత్తం ఇచ్చినా పని పూర్తిచేయలేదని.. ఆ తర్వాత బదిలీపై వెళ్లిపోయారని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వ కాలంలో మొత్తం 10 సార్లు, ప్రస్తుత తెదేపా ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడుసార్లు కలెక్టరేట్‌కు వెళ్లి మొరపెట్టుకున్నామని విశ్వనాథ్ చెప్పారు.ఈ విషయమై కౌతాళం మండల తహసీల్దారు మల్లికార్జునస్వామి మాట్లాడుతూ తాను హాలహర్వి మండల తహసీల్దారుగా పనిచేసిన కాలంలో ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయలేదని చెప్పారు. ఫోన్‌పేలో నా ఫోన్ నంబరుకు డబ్బులు పంపినట్లు వారికి ఎలా రసీదులు వచ్చాయో తెలియదన్నారు. నేను నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నానని పేర్కొన్నారు.

ఆక్రమించుకుని..వెల్దుర్తి మండలం నార్లాపురం గ్రామానికి చెందిన కె.పుల్లయ్యకు గ్రామంలోని సర్వే నంబరు 231లో 4.23 ఎకరాలు ఉంది. ఆ మేరకు పన్ను కాగితాలు ఆయన వద్ద ఉన్నాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన భూమిపై కొందరి కన్ను పడింది. 4.23 ఎకరాల్లో 1.59 ఎకరాలకు ఆయనకు పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉంది. భూమి మాత్రం వారి ఆధీనంలో లేదు.

# ఆవిష్కరణలకు కేంద్రం.. అంకురాలకు ప్రోత్సాహం

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నెలకొల్పిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఆవిష్కరణలకు ప్రాణం పోస్తోంది.కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ కేంద్రం అంకుర సంస్థలను ప్రోత్సహిస్తోంది. 2018లో నెలకొల్పిన ఈ కేంద్రంలో 2021 నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించారు. ఐవోటీ, ఏఐ ఆధారిత డొమైన్లపై పనిచేస్తున్న అంకుర సంస్థల అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఆయా సంస్థలకు మార్గనిర్దేశం చేయడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించేలా కృషి చేస్తున్నారు. విపణిలోకి వచ్చేందుకు సిద్ధమైన సంస్థలను పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు.ప్రమాదం జరగకుండా ఉండాలంటే..: ఇటీవల అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి చోట 'ప్రిడిక్టివ్ అనలిటిక్స్' అనే సాంకేతికత సాయంతో ప్రమాదాలను ముందుగానే పసిగట్టవచ్చు. ఆ సాంకేతికతను వినియోగిస్తే యంత్రంలోని ఒక భాగం పనిచేయక పోయినా, ఏదైనా సమస్య వచ్చినా యాజమాన్యానికి హెచ్చరికలు అందుతాయి. తద్వారా ప్రమాదాలను నివారించేందుకు అవకాశము ంటుంది. సీవోఈలోని అంకుర సంస్థల వద్ద ఆ తరహా సాంకేతికత అందుబాటులో ఉంది.

రాష్ట్ర ప్రభుత్వంలో 10 ప్రాజెక్టులు: సీవోఈలో ప్రాణం పోసుకున్న



అంకుర సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 10 ప్రాజెక్టులు చేపట్టారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, పాఠశాల విద్య, మార్క్‌ఫెడ్, ఏపీఎస్ఆర్టీసీలో వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపారు. వైద్యారోగ్య శాఖలో 2022లో నాలుగు ప్రాజెక్టులు చేపట్టగా ఒక్కో దానికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పాఠశాల విద్యలో ఒక ప్రాజెక్టుకు రూ.5 లక్షలు నిధులు వచ్చాయి. ఇక్కడి అంకురాలు విశాఖ పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డ్(హెచ్ఎస్ఎల్), గెయిల్ సహా పలు ప్రైవేటు సంస్థల్లో సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాయి. విశాఖ పోర్టుకు నాలుగు, హెచ్ఎస్ఎల్, గెయిల్‌తో ఒక్కో ప్రాజెక్టు చేపట్టాయి.

వివరాలు ఇలా..పేరు: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)
నమోదు చేసుకున్న అంకుర సంస్థలు: 57
వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు: 600కు పైగా
సమకూరిన నిధులు: రూ.131 కోట్లు

మూడేళ్లుగా ఆవిష్కరణలు

మాది విశాఖపట్నం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ చేశా. మూడేళ్లుగా సీవోఈలో ఆవిష్కరణలు చేస్తున్నా. మా సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల నిధులు సమకూరాయి. మా బృందంలో 20 మంది పనిచేస్తున్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ నుంచి ఇటీవల ప్రతిపాదనలు వచ్చాయి. ప్రస్తుతం ఓ ప్రైవేటు సంస్థతో కలసి పనిచేస్తున్నాం. ఎం.శ్రీనివాస్, స్ఫటిక టెక్నాలజీస్

అందుబాటులో అత్యాధునిక సాంకేతికత

అంకురాల వద్ద ఉత్పత్తికి సంబంధించిన ప్రొటోటైప్ (నమూనా) ఉంటే వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేందుకు సహకరిస్తాం. పరిశ్రమల్లో నెలకొన్న అనేక సమస్యలకు అంకుర సంస్థల వద్ద పరిష్కారాలున్నాయి. పొరుగు దేశాల్లో లభించే అత్యాధునిక సాంకేతికత ఇక్కడ అందుబాటులో ఉంది. పరిశ్రమలు ముందుకొస్తే అనేక అంకుర సంస్థలకు సహకారం లభిస్తుంది.పూజా విద్యా శంకర్, హెడ్, సీవోఈ

## వైకాపా నిర్లక్ష్యం.. కూటమి ప్రాధాన్యం

కుప్పం : త్రిరాష్ట్ర కూడలిలో చెన్నై-బెంగళూరు ప్రధాన రైల్వే మార్గంలో కీలకంగా కుప్పం రైల్వే స్టేషన్ ఉంది. ఈ మార్గం నిత్యం పలు రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకను కలుపుతున్నా అభివృద్ధికి అమడదూరంలో ఉండటంతో.. ఈ ప్రధాన మార్గానికి.. మరో ప్రత్యామ్నాయ మార్గం నిర్మించేందుకు కేంద్రం తలచింది. కుప్పం- మారికుప్పం మధ్య రైల్వేలైను ప్రతిపాదించారు. కర్ణాటకలో పరిధిలో పనులు వేగంగా జరుగుతుండగా.. వైకాపా రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే వారికి పరిహారం అందించేందుకు అడుగులు పడ్డాయి.

అమృత్ భారత్‌లో అభివృద్ధి

కుప్పానికి తూర్పున తమిళనాడులో జోలారుపేట జంక్షన్.. పడమరలో కర్ణాటకలో బంగారుపేట జంక్షన్లు 30 కి.మీ. దూరంలోనే ఉన్నాయి. ఇరు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే రైళ్లన్నీ కుప్పం మీదుగా వెళ్లాల్సిందే. ఇంత కీలకంగా ఉన్నా.. అభివృద్ధి జరగలేదు. ఇటీవల కేంద్రం అమృత భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.

2011లో ప్రతిపాదనలు..

కుప్పం-మారికుప్పం మధ్య 23.7 కిలోమీటర్ల నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటు కోసం 2011 ప్రాంతంలో రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందు కోసం గుడుపల్లె మండలంలో 238.50 ఎకరాల భూమి, కుప్పం మండలంలో 9.15 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించారు. కర్ణాటకలో భూసేకరణ పూర్తై పనులు చురుకుగా సాగుతున్నాయి. కర్ణాటకలోని మారికుప్పం రైల్వేస్టేషన్ నుంచి కర్ణాటక సరిహద్దు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైకాపా పాలనలో ఇక్కడి రైతులకు పరిహారం ఇవ్వక భూసేకరణ నిలిచింది. సీఎం కాగానే చంద్రబాబు ఆ పనులు పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వందరోజుల్లోనే 95 మందికి పరిహారం ఇచ్చి రైల్వే అధికారులకు అప్పగించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. మార్గం ఇలా..కర్ణాటకలోని మారికుప్పం రైల్వే స్టేషన్ నుంచి అత్తినత్తం, బిసానత్తం, పొగురుపల్లె, కోటచెంబగిరి, కుప్పిగానిపల్లె, అగరం, కనమనపల్లె, గుండ్లసాగరం, నక్కనపల్లె, మల్దేపల్లె, కుప్పం రైల్వే స్టేషన్‌కు చేరనుంది. ఇప్పటికే కర్ణాటకలో వేగంగా జరుగుతున్న నూతన ట్రాక్ పనులు జరుగుతూ, రైల్వే అండర్ బ్రిడ్జిలు పూర్తి చేశారు.

నెలలోనే రూ.7 కోట్ల చెల్లించాలి

గుడుపల్లె, కుప్పం మండలాల్లో భూసేకరణ పనులు పూర్తి చేశాం. ట్రాక్ నిర్మాణంలో భాగంగా నష్టపోయే రైతులకు నెల వ్యవధిలో రూ.7 కోట్ల మేర పరిహారం చెల్లించాం. 95 శాతం భూ సేకరణ చేపట్టి రైల్వే అధికారులకు అప్పగించాం.శ్రీనివాసరాజు, ఆర్డీవో, కుప్పం

# పాల బకాయిలు రూ.70లక్షలు




రాయదుర్గం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాల బిల్లుల బకాయిలు సుమారు రూ.70లక్షల దాకా రావాల్సి ఉండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క రాయదుర్గంలోనే 210 మందికి రూ.17లక్షల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లా కేంద్రంలోని ఏపీ డెయిరీ మూతపడింది. ఫలితంగా ఉమ్మడి అనంత జిల్లాలోని 16 పాలశీతలీకరణ కేంద్రాలు మూతపడ్డాయి. ఇందులో వెలుగు ఆధ్వర్యంలో 3, ఏపీ డెయిరీ ఆధ్వర్యంలో 13 కేంద్రాలు పని చేసేవి. బకాయి బిల్లుల కోసం రైతులు ఏపీ డెయిరీ, వెలుగు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరవయ్యారు. గత వైకాపా ప్రభుత్వం అమూల్ పాల డెయిరీని ప్రారంభిస్తామని, బకాయి బిల్లులు చెల్లిస్తామని హామీలిచ్చి ఆ తర్వాత చేతులెత్తేసింది.

నిరుపయోగంగా యంత్రాలు

జిల్లాలోని 16 పాలశీతలీకరణ కేంద్రాల్లోని కాలర్, కాంప్రైజర్ యంత్రాలు, 2,500 లీటర్ల పాల ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. అవి తుప్పు పడుతున్నాయి. రాయదుర్గంలోని కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళ కొందరు మద్యం తాగి సీసాలను అక్కడే పడేసి వెళ్తున్నారు.

ప్రైవేటు డెయిరీల నిలువు దోపిడి

పాల శీతలీకరణ కేంద్రాలు మూతపడటంతో ప్రైవేటు డెయిరీల యజమానులు పాడి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అర లీటరు పాల ప్యాకెట్ ధర రూ.27 పలుకుతుండగా ప్రైవేటు డెయిరీల నిర్వాహకులు ఆవు పాలు లీటరు రూ.28 నుంచి రూ.36కు, గేదె పాలు రూ.40-60 వరకు నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలు డిమాండును బట్టి మారుతుంటాయి. రాయదుర్గం నియోజకవర్గంలో పాడిరైతుల నుంచి సేకరించిన పాలను బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లోని దొడ్ల, శ్రీనివాస డెయిరీలకు విక్రయిస్తున్నారు. బకాయి బిల్లుల విషయమై ఏపీ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరణ కోరగా రూ.70లక్షల బిల్లులకు సంబంధించి ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రస్తుతం పాలశీతలీకరణ కేంద్రాలు, పాడిరైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఏపీ డెయిరీ ప్రారంభం కాగానే బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాల శీతలీకరణ కేంద్రాలు ప్రారంభించాలి

- ఎర్రిస్వామి, గలగల, పాడిరైతు పాల బిల్లు రూ.12 వేలు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం బిల్లు చెల్లించక పోవటంతో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాం. ధరలు డిమాండును బట్టి మారుతుంటాయి. విధిలేని పరిస్థితుల్లో వారు చెల్లించిన బిల్లులు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం పాలశీతలీకరణ కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

# ఉచిత ఇసుక.. మరింత సులభంగా



అనంతపురం : 'ఉచిత ఇసుక విధానాన్ని' రాష్ట్ర ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. ఇకపై ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌పై అవగాహన లేనివాళ్లు గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది సహకారంతో బుక్ చేసుకోవచ్చు. వాగులు, వంకలు, నదుల నుంచి సమీప గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లలో ఉచితంగా తీసుకెళ్లొచ్చు. ఇక నుంచి 24 గంటలూ ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులో ఉంటుంది.

కిలోమీటరుకు రూ.13.50

ఇసుక వినియోగదారులు సొంతంగా సమకూర్చుకున్న లేదా గనులు, భూగర్భ శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనాలను నిల్వ కేంద్రాలకు వెళ్లి ఇసుక తీసుకెళ్లవచ్చు. ట్రాక్టర్, టిప్పర్లలో తీసుకెళ్లే వారికి కిలోమీటరుకు చొప్పున టన్నుకు రవాణా ఛార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాక్టర్‌లో నాలుగన్నర టన్నులు ఇసుకను తీసుకోవచ్చు రూ.13.5ల చొప్పున నాలుగన్నర టన్నులకు కిలోమీటరుకు రూ.60.75లు కాగా పది కిలోమీటర్లకు రూ.607.5లు ధర నిర్ణయించారు. ఈ ధర పది కిలోమీటర్ల వరకు వర్తిస్తుంది. 10 కిలోమీటర్ల పైన 40 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.12.8లు వసూలు చేస్తారు. 40 నుంచి 80 కిలోమీటర్ల వరకు రూ.6.8లు చెల్లించాలి.

ఆన్‌లైన్‌లో బుక్ ఇలా

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ కోసం 'మైన్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లోకి వెళ్తే ..ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే పోర్టల్ ఉంటుంది. తొలుత అందులోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాధారణ వినియోగదారు, బల్క్ వినియోగదారు, ట్రాన్స్‌పోర్టల్ రిజిస్ట్రేషన్ అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో ఆయా వినియోగదారులు ఆప్షను ఎన్నుకుని ఆధార్, చరవాణి నంబర్లు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది దాంతో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత నిర్మాణం చేయదలచుకున్న దాని వివరాలు, కచ్చితమైన చిరునామా నమోదు చేయాలి. తర్వాత ఇసుక డెలివరీ కావాల్సిన చిరునామా నమోదు చేస్తే, గూగుల్ శాటిలైట్ మ్యాప్‌లో ఆ ప్రాంతం కనిపిస్తుంది. ఫిర్యాదుల సెల్ ఇసుక పంపిణీలో ఎలాంటి సమస్యలు, సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా విన్నవించుకోవడానికి అనంతపురం జిల్లా కేంద్రంలోని గనులు, భూగర్భశాఖ డీడీ కార్యాలయంలో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబరు 1800 425 6039, ల్యాండ్ లైన్ నంబరు 08554 298380కు తెలియజేయవచ్చు. అలాగే వీటిని మానిటరింగ్ చేయడానికి నలుగురు అధికారులను నియమించారు.

# పీఏసీఎస్‌లపై పిడుగు

విశాఖపట్నం : గోరు చుట్టుపై రోకలిపోటు చందంగా తయారైంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి. రుణాలు సకాలంలో వసూలవ్వక, బకాయిలు పేరుకుపోయి వీటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. గత పాలకుల తీరుతో గ్రామాల్లో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో ఆదాయపు పన్ను శాఖ రూ.కోట్లలో పన్ను చెల్లించాలంటూ డిమాండు నోటీసులు జారీ చేయడంతో సంబంధిత అధికారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నుంచి రుణాలు తీసుకుని రైతులకు పంట రుణాలుగా అందిస్తూ లక్ష్యం మేరకు వార్షిక టర్నోవరు పెంచుకునేందుకు పీఏసీఎస్‌లు కృషి చేస్తూ వచ్చాయి. సహకార శాఖ అధికారుల సూచన మేరకు గతంలో పాన్ కార్డులు తీసుకున్నాయి. వార్షిక టర్నోవరు రూ.కోటి దాటిన సంఘాలు ఆదాయపు పన్ను చెల్లించాలని ఆ శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. వీటిని ఆయా సంఘాల పెద్దలు పట్టించుకోలేదు. తాజాగా డిమాండు నోటీసులు జారీ కావడంతో ఉపశమనం కల్పించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

31 సంఘాలకు నోటీసులు: ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 సహకార సంఘాలున్నాయి. 2018-19లో వీటికి పాన్ కార్డులు జారీ అయ్యాయి. ఆయా సంఘాల్లో జరిగే ఆర్థిక లావాదేవీలన్నీ రికార్డు అయ్యాయి. వార్షిక టర్నోవరు రూ.కోటి దాటిన 31 సహకార సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిలో 23 చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. రూ. 43.46 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఆదాయపు పన్ను శాఖ అధికారుల నుంచి నోటీసు రావడంతో సంఘాల సిబ్బంది లబోదిబోమంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు కోర్టుకెళ్లారు. ప్రభుత్వమే జోక్యం చేసుకోవాల'ని చోడవరం




మండలం లక్ష్మీపురం సంఘం పూర్వ అధ్యక్షుడు సేనాపతి సత్యారావు పేర్కొన్నారు.

వార్షిక టర్నోవరు పెరగడంతో..

జిల్లాలో 31 సహకార సంఘాలకు నోటీసులు జారీ అయ్యాయి. చెల్లించాల్సిన మొత్తం రూ.కోట్లలో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సంఘాల వార్షిక టర్నోవరుపై ఏటా నివేదిక రూపంలో అందజేయాలి. నివేదిక ఇచ్చిన సంఘాలన్నింటికీ ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ప్రస్తుతం కోర్టు స్టే ఇచ్చింది.
బొడ్డేడ శ్రీనివాసరావు, జనరల్ మేనేజరు, డీసీసీబీ

# వస్తే వంద.. రాకుంటే వెయ్యి

సత్యవేడు : ఉపాధిహామీ పథకం అమలులో అవినీతి కొత్త పుంతలు తొక్కుతోంది. కూలీల రెక్కల కష్టం రాబందుల పాలవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా కూలీలను దోచుకొనే సిబ్బందికి కొదవ ఉండటం లేదు. స్థానిక నేతలు, అధికారులు తిలా పాపం తలా పిడికెడులా పంచుకుంటూ కూలీల పొట్టకొట్టడం పరిపాటిగా మారింది.

నెలకు రూ.10 కోట్లపైనే

జిల్లా వ్యాప్తంగా పథకంలో పనిచేస్తున్న 2.7 లక్షల కూలీల్లో సగంమంది నుంచి రూ.వంద వసూలు చేసినా వారానికి రూ.1,35,00,000, నెలకు రూ.5 కోట్ల మేర కూలీల నగదుకు కోత పడుతోంది. పనికి హాజరుకాని వ్యక్తుల పేరిట మరో రూ.10 కోట్ల మేర సిబ్బంది జేబుల్లోకి వెళుతోంది. ఇలా సిబ్బంది అనతికాలంలోనే ఇళ్లు, పొలాలు కూడబెడుతున్నారు.

హాజరు నమోదు, వసూళ్లు ఇలా..

పనికి వెళ్లేందుకు సుముఖంగా ఉన్న కూలీల వివరాలతో వారంలో తొలిరోజు సోమవారం మస్టర్ వేస్తారు. వారాంతంలో పని వివరాలతో మొత్తం వేతనాన్ని ఖరారు చేసి సోమ, మంగళవారాల్లో కూలీల ఖాతాలకు నగదును జమచేయటం సాధారణంగా జరిగే పద్ధతి. ఇందులో క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవోలు తమకు అనుకూలమైన రీతిలో వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో



ప్రశ్నించేవారు లేకపోవడంతో అదే పంథా నేటికీ కొనసాగిస్తున్నారు. భయంతో బయటపడని కూలీలు సత్యవేడు నియోజకవర్గంలో వెలుగుచూసిన అవినీతి ఉదంతాలు జిల్లా వ్యాప్తంగా విస్తరించాయి. నగదును తూచ తప్పకుండా క్షేత్ర సహాయకులకు లంచంగా ఇస్తున్నా బహిరంగంగా చెప్పటానికి కూలీలు వెనకడుగు వేస్తున్నారు. భవిష్యత్తులో పనులు చూపరన్న భయంతో వారుంటున్నారు. విచారణ అధికారులు సైతం సిబ్బంది తప్పిదాలు కప్పిపుచ్చుతుండటంతో అవినీతి ఊడలు అంతకంతకూ పాతుకుపో యాయి.

వెలుగులోకి ఇలా..

నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురం క్షేత్ర సహాయకుడు మాధవయ్య తనకు వారానికి రూ.100 చొప్పున ఇవ్వాలని కూలీలను ఇటీవల బెదిరించడం వివాదాస్పదమైంది. తాను పైఅధికారులకు ఇవ్వాలంటూ వసూళ్లకు పాల్పడగా ఆగ్రహించిన కొందరు కూలీలు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి పథకం అమలులో లోగుట్టుగా సాగుతున్న అవినీతిని తేటతెల్లం చేశారు.

పెళ్లకూరు మండలం రావులపాడుకు చెందిన వ్యక్తి తిరుపతిలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా.. ఆయన ఖాతాలో ఇటీవల రూ.1,200 నగదు జమయింది. వెంటనే ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు అతడికి ఫోన్‌చేసి అతని పేరును మస్టర్‌లో నమోదు చేసినందున నగదు జమయిందని పేర్కొంటూ.. నగదులో సగం ఉంచుకుని మరో సగాన్ని తనకు బదిలీ చేయాల్సిందిగా హుకుం జారీచేశారు. ఈ విషయమై సదరు ఉద్యోగి స్థానిక ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా తక్షణ స్పందన కరవైంది.

నేను రూ.2 వేలు ఇచ్చా

పనికి వెళ్తున్నా వారానికి రూ.100 చొప్పున క్షేత్ర సహాయకునికి ఇవ్వాల్సిందే. లేకుంటే మరో వారం పనులు చూపరు. హాజరుకాని వ్యక్తుల నుంచి బిల్లులో రూ.1,000 లాక్కుంటారు. నేను ఇప్పటివరకు రూ.2వేలకు పైగా నగదును లంచంగా ఇచ్చా. చంద్రకళ, రాజగోపాలపురం, సత్యవేడు

## గ్రావెల్ మాఫియా.. కబంధ హస్తాల్లో అసైన్డ్ నేలలు

చిల్లకూరు : భూమిలేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ నేలలు గ్రావెల్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కిపోతున్నాయి. 50 అడుగుల మేర గ్రావెల్ తవ్వేస్తుండటంతో భారీ గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. తీరప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ పరిస్థితి చిల్లకూరు మండలంలోని తిక్కవరం, కలవకొండ, పొన్నవోలు, నెలబల్లి రెట్టపల్లి, తిమ్మనగారిపాలెం తదితర గ్రామాల్లో నెలకొంది. మండలంలోని పలు ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా లేఅవుట్లు ఏర్పాటవుతున్నాయి. దీనికి తోడు సాగరమాల రహదారి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. వీటికి ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్ తరలిస్తూ నింపుకొం టున్నారు.

ఎక్కడెక్కడంటే..తిక్కవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 860లో ఉ



న్న ప్రభుత్వ భూమిని చేడిమాల, తిక్కవరం గ్రామాలకు చెందిన పేదలకు ఒక్కొక్కరికి 71 సెంట్ల మేర గతంలో డీకేటీ పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో గ్రావెల్ నిక్షిప్తమై ఉంది. ఇదే అదనుగా కొందరిని లోబర్చు'కొని' తవ్వకాలకు తెరతీశారు. వాస్తవానికి అసైన్డ్ భూముల్లో మైనింగ్‌కు వీల్లేదు. దీంతో అక్రమార్కులు కొత్త ఎత్తుగడ వేశారు. లబ్ధిదారులే భూములను చదును చేసుకుంటున్నట్లు వినతిపత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఇంకేముంది క్షణాల్లో వారు పచ్చజెండా ఊపేశారు. వాహనాలు తిరిగేందుకు వీలుగా తిక్కవరం చెరువుకు నీరందించే గంగకాలువను సైతం పూడ్చి రోడ్డు నిర్మాణం చేపట్టారు. పొన్నవోలు సర్వే నంబరు 57లోని ప్రభుత్వ భూముల్లో నిత్యం గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములు చివరకు చెరువును తలపిస్తున్నాయి. ఎక్కడా అనుమతుల్లేవు

చిల్లకూరు మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఎక్కడా అనుమతుల్లేవు. అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దృష్టికి తీసుకెళ్తాం. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు. రంగకుమార్, ఏడీ, భూగర్భ గనులశాఖ, గూడూరు

చురకలు



## లక్కీ భాస్కర్ హిట్‌తో హుషారుగా ఉంది

ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకుంది. కానీ కాలం ఇన్నాళ్లు కలిసి రాకపోవడంతో ఆశించిన స్థాయిలో కమర్షియల్ సక్సెస్ లు దక్కలేదు. ఈ ఏడాది ఆరంభంలో ఈమె సెకండ్ హీరోయిన్‌గా నటించిన మహేష్ బాబు గుంటూరు కారం సినిమా సైతం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచింది. కానీ ఇదే ఏడాదిలో విజయ్‌తో కలిసి నటించిన ది గోట్ సినిమా విడుదల అయ్యి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ సైతం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. లక్కీ భాస్కర్ సినిమాలో మీనాక్షి చౌదరికి మంచి పాత్ర దక్కింది. అందంగా కనిపించడంతో పాటు నటన ప్రతిభ చూపించే అవకాశం దక్కింది. సోషల్ మీడియాలో లక్కీ భాస్కర్ సినిమాతో మీనాక్షికి లక్ కలిసి వస్తుందా అంటూ విడుదలకు ముందు వరకు అంతా అనుకున్నారు. లక్కీ భాస్కర్ సినిమా మీనాక్షికి లక్‌ను తెచ్చి పెట్టడం మాత్రమే కాకుండా ఏకంగా స్టార్ హీరోయిన్ ఇమేజ్‌ను తెచ్చి పెట్టే స్థాయిలో ఆ సినిమా హిట్ అయింది. తాజాగా సినిమా సక్సెస్ మీట్ జరిగింది. యూనిట్ సభ్యులు సినిమా సక్సెస్ నేపథ్యంలో ఆనందం వ్యక్తం చేశారు. తాజాగా మీనాక్షి తన తదుపరి సినిమా 'మట్కా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో ఎల్లో చీర కట్టులో కనిపించి కన్నుల




విందు చేసింది. మట్కా ట్రైలర్ లాంచ్‌లో ఫోటోలకు ఫోజ్ ఇస్తున్న సమయంలో మీనాక్షి చౌదరి చాలా హుషారుగా కనిపించింది. లక్కీ భాస్కర్ సినిమా హిట్‌తో వచ్చిన హుషారు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి కెరీర్ లో ఓ డీసెంట్ హిట్ ను సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి ముందు ముందు మరిన్ని సూపర్ హిట్‌లను సొంతం చేసుకోవడం ఖాయం అని, ఆ సమయంలో మరింత హుషారుగా మీనాక్షి చౌదరి కనిపించడం ఖాయం అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మీనాక్షి చౌదరికి లక్కీ భాస్కర్ తో తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లోనూ మంచి విజయం దక్కింది. ముందు ముందు ఆమె నుంచి మరిన్ని సినిమాలు వస్తాయని అంతా ఆశిస్తున్నారు. లక్కీ భాస్కర్ తో పాటు అదే స్థాయి అంచనాలున్న విశ్వక్ సేన్ నటించిన మట్కా, మెకానిక్ రాకీ సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆ సినిమాలతో విజయాలను మీనాక్షి చౌదరి తన ఖాతాలో వేసుకోవడం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఈ రెండు సినిమాలు కాకుండా వచ్చే ఏడాది మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. మొన్నటి వరకు చిరంజీవి విశ్వంభర సినిమాలో మీనాక్షి చౌదరి నటిస్తుందనే వార్తలు వచ్చాయి. ఇటీవల ఆమె లక్కీ భాస్కర్ సినిమా ప్రమోషన్‌లో మాట్లాడుతూ తాను ఆ సినిమాలో భాగం కావడం లేదని, ఆ సినిమా కోసం తనను ఎవరూ సంప్రదించలేదని క్లారిటీ ఇచ్చింది.

## తీరిక సమయంలో అడవిలో సమంత విహారం

రాజ్ & డికె వెబ్ సిరీస్ లలో నటిస్తూ నిరంతరం ట్రెండింగ్ లో ఉంటోంది సమంత. ప్రస్తుతం రక్త భ్రహ్మాండ్ అనే వెబ్ సిరీస్ కోసం రాజ్ అండ్ డీకేతో కలిసి పని చేస్తోంది. అలాగే 'సిటాడెల్: హనీ బన్నీ' ఈ నవంబర్ 7న స్ట్రీమింగుకి వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో వరుణ్ ధావన్, సమంత గూఢచారి పాత్రలలో నటించారు. ఇంతకుముందు రిలీజైన ట్రైలర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ వెబ్ సిరీస్‌లో సామ్ డేర్ డెవిల్ స్టంట్స్ తో మెరుపులు మెరిపించనుంది. ధావన్ బోయ్ తో సమంత జోడీ అందరికీ నచ్చింది. ఇదిలా ఉంటే సమంత ప్రస్తుత షెడ్యూళ్ల నుంచి చిన్నపాటి రిలీఫ్ కోసం ఒక దట్టమైన అటవీ ప్రాంతానికి వెకేషన్ కి వెళ్లింది. అక్కడి నుంచి విడుదలైన ఫోటోగ్రాఫ్స్ లో సామ్ ఎంతో ప్లెజెంట్ గా కనిపిస్తోంది. సుదూర తీరంలో దట్టమైన అడవిలో పచ్చదనంలో



పులులు తిరిగే చోట సమంత డేర్ డెవిల్ స్టంట్ ఉత్కంఠ రేపుతోంది. రాజస్థాన్ లోని ప్రఖ్యాత 'రణతంబోర్ అటవీ ప్రాంతం' నుంచి కొన్ని అందమైన ఫోటోలను సామ్ షేర్ చేసింది. ఆనందకరమైన కొన్ని రోజులు ఇప్పుడు వెర్రి నవంబర్‌కి సిద్ధంగా.. సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బర్వారా (రాజస్థాన్) పాత –కొత్త అందాల కలయిక... అద్భుతమైన అనుభవానికి ధన్యవాదాలు! అని రాసింది. ఇప్పటికే స్పాట్ నుంచి తన అద్భుతమైన ఫోటోలను షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. అడవి జంతువులతో పాటు ప్రకృతి వైభవాన్ని అన్వేషించింది సామ్.

అక్కడ స్థానికంగా పాటరీ వృత్తికారుల గురించి, ఆహార పదార్థాల సేకరణ గురించి ఈ ఫోటోలు ఆవిష్కరిస్తున్నాయి. ఒక పోస్ట్‌కు క్యాప్షన్ ఇస్తూ "సగం పులితో పాటు ప్రకృతి వైభవాన్ని చూశాను. PS చివరి స్లయిడ్ టైగర్.. అద్భుతమైన ఫోటోగ్రాఫ్" అని రాసింది. ఈ వారం ప్రారంభంలో సమంత జైపూర్‌కు ప్రయాణమైంది. అక్కడ ఫోటోగ్రాఫర్లు సామ్ ని వెంబడించి కెమెరాల్లో బంధించారు. ఈ టూర్ లో సమంత విభిన్నమైన రంగు రంగుల దుస్తులను కూడా ధరించి కనిపించింది. కొన్నిటిలో స్థానిక ట్రెడిషన్ కూడా కనిపించింది. కొన్ని ఫోటోల్లో లేడి పిల్లల సంచారం కూడా కనిపించింది. అక్కడ పాడుబడిన వందేళ్ల నాటి కోట కనిపించింది.




# 'ఎఫ్ 2' రేంజ్ లో నవ్విస్తారా?



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్లలో అనిల్ రావిపూడి ఒకరు. 'పటాస్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన అనిల్.. యాక్షన్ కు తన మార్క్ ఎంటర్టైన్మెంట్ జోడించి ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ కొడుతూ, అపజయం ఎరుగని దర్శకుడిగా కొనసాగుతున్నారు. అయితే 'ఎఫ్ 2' తర్వాత ఆ రేంజ్ లో నవ్వించిన సినిమా అనిల్ నుంచి రాలేదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో దర్శకుడు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సంక్రాంతికి ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నారు. విక్టరీ వెంకటేశ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమా "సంక్రాంతికి వస్తున్నాం". 'ఎఫ్ 2' 'ఎఫ్ 3' చిత్రాల తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న హ్యాట్రిక్ మూవీ కావడంతో, అందరిలో ఆసక్తి నెలకొంది. ఇందులో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. టైటిల్ కు తగ్గట్టుగానే సంక్రాంతిని టార్గెట్ గా పెట్టుకొని రూపొందిస్తున్న సినిమా ఇది. ఫ్యామిలీ ఆడియన్స్ ను థియేటర్లకు రప్పించే చిత్రం అవుతుందని, అనిల్ మరోసారి తన మార్క్ కామెడీతో నవ్విస్తారని అభిమానులు భావిస్తున్నారు. వెంకీ - అనిల్ కలిసి చేసిన 'ఎఫ్ 2: ఫన్ అండ్ ఫ్రస్టేషన్' సినిమా 2019 సంక్రాంతికి విడుదలై, బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్టయ్యింది. థియేటర్లలో నవ్వులు పోయించింది. కానీ ఆ తర్వాత అనిల్ రావిపూడి డైరెక్ట్ చేసిన 'సరిలేరు నీకెవ్వరు', 'ఎఫ్ 3', 'భగవంత్ కేసరి' సినిమాలు కమర్షియల్ గా సక్సెస్ సాధించాయి కానీ.. ఆయన మార్క్ కామెడీ కాస్త తగ్గిందనే కామెంట్లు వచ్చాయి. అయితే పొంగల్ ఫెస్టివల్ సీజన్ లో రాబోతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో, అనిల్ తన స్ట్రాంగ్ జోన్ లో ఎంటర్టైన్ చెయ్యాలని అందరూ కోరుకుంటున్నారు. ఇదిలా ఉంటే వెంకటేశ్ కు కూడా సంక్రాంతి సెంటిమెంట్ ఉంది. గతంలో 'చంటి', 'కలిసుందాం రా', 'లక్ష్మి', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'ఎఫ్ 2'.. లాంటి సినిమాలు ఇదే సీజన్ లో వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. కాకపోతే గతేడాది సంక్రాంతికి వచ్చిన 'సైంధవ్' సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. పండక్కి తనకు కలిసొచ్చిన ఎంటర్టైనర్ తో కాకుండా, యాక్షన్ డ్రామాతో రావడం వెంకీని దెబ్బేసింది. కానీ ఈసారి మాత్రం ఫ్యాన్స్ తన నుంచి ఎలాంటి సినిమా ఆశిస్తున్నారో, అలాంటి కంటెంట్ తో 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ వస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' అనేది ఎక్సలెంట్ వైఫ్, ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ మధ్య జరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్టైనింగ్ స్టోరీ అని చిత్ర బృందం చెబుతోంది. ఇందులో వెంకటేష్ భార్యగా ఐశ్వర్య రాజేష్, మాజీ ప్రేయసిగా మీనాక్షి చౌదరి కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, ఉపేంద్ర లిమాయే, వీటీ గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి లాంటి నటులు కామెడీ పాత్రలను పోషిస్తున్నారు. మరి ఈ సినిమాతో వెంకీమామ, అనిల్ రావిపూడి కలిసి 'ఎఫ్ 2' రేంజ్ లో నవ్విస్తారో లేదో చూడాలి.

# 100 కోట్లు కొట్టినా.. సౌండ్ లేదేంటి?



ఒకప్పుడు సినిమా రంగంలో సక్సెస్ అనేది సెంటర్ల మీద ఆధారపడి ఉండేది. కానీ, ఇప్పుడు అవి వసూలు చేసే కలెక్షన్లను డిసైడ్ అవుతుంటుంది. ఒక్కోసారి టాక్ బాలేకపోయినా సినిమాలు హిట్ అవుతుంటాయి. ఒక్కోసారి టాక్ బాగున్నా మూవీలు డిజాస్టర్లుగా మారుతుంటాయి. ఏది ఏమైనా ప్రతి సినిమా యూనిట్ సక్సెస్ మీట్ మాత్రం పెట్టుకుంటూనే ఉంటోంది. అలాంటిది తాజాగా ఓ మూవీ మాత్రం దీన్ని పక్కన పెట్టేసింది. అదే 'అమరన్'. కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివ కార్తికేయన్ హీరోగా రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందించిన చిత్రమే 'అమరన్'. మేజర్ ముకుంద్ వరదరాజన్ నిజ జీవిత కథతో తెరకెక్కిన ఈ చిత్రం ఆరంభంలోనే అందరి దృష్టిని లాక్కుంది. అందుకు తగ్గట్లుగానే అంచనాలను ఏర్పరచుకుని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 31వ తేదీన అత్యధిక థియేటర్లలో విడుదల అయింది. రియల్ స్టోరీతో వచ్చిన 'అమరన్' సినిమాను మొదటి ఆట నుంచే తమిళంతో పాటు తెలుగులోనూ ప్రేక్షకుల నుంచి అదిరిపోయే టాక్ కూడా లభించింది. దీనికి తగ్గట్లుగానే ఈ మూవీ విజయవంతంగా ప్రదర్శితం అవుతోంది. ఫలితంగా కేవలం మూడు రోజుల్లోనే శివ కార్తికేయన్ సినిమా ఏకంగా రూ. 107 కోట్లు గ్రాస్ వసూళ్లను సాధించి సత్తా చాటింది. దీంతో ఈ యంగ్ హీరో కెరీర్‌లో ఈ మార్క్ దాటిన మూడో సినిమాగా నిలిచింది. 'అమరన్' సినిమాకు తమిళంలో కంటే తెలుగులో అద్భుతమైన స్పందన దక్కుతోంది. దీంతో ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వరుసగా మూడు రోజుల్లో రూ. 2.81 కోట్లు, రూ. 2.21 కోట్లు, రూ. 2.02 కోట్లు వసూలు చేసింది. అలా రూ. 7.04 కోట్లు షేర్‌తో పాటు రూ. 12 కోట్లు గ్రాస్‌ను వసూలు చేసింది. ఫలితంగా రూ. 5.50 కోట్ల టార్గెట్‌తో వచ్చిన ఈ చిత్రం హిట్ స్టేటస్‌ను చేరుకోవడంతో పాటు రూ. 1.54 కోట్లు లాభాలను కూడా సొంతం చేసుకుంది. తెలుగులో మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించినా 'అమరన్' మూవీ యూనిట్ మాత్రం సక్సెస్ మీట్‌ను నిర్వహించలేదు. దీంతో ఇప్పుడిది హాట్ టాపిక్ అవుతోంది.

సక్సెస్ కాకున్నా పార్టీలు చేసే ఈరోజుల్లో విజయాన్ని అందుకున్న సినిమాను లైట్ తీసుకోవడం చాలా మందిని ఆశ్చర్యపరుస్తోంది. అయితే, దీనికి కారణం శివ కార్తికేయన్, సాయి పల్లవి అందుబాటులో లేకపోవడమే అని ఓ టాక్ వినిపిస్తోంది. మరి రానున్న రోజుల్లో అయినా 'అమరన్' టీమ్ తెలుగులో సక్సెస్ మీట్ పెడుతుందో లేదో చూడాలి. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన 'అమరన్' సినిమాను రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా బ్యానర్లపై కమల్ హాసన్, మహేంద్రన్, వివేక్‌లు నిర్మించారు. ఇందులో భువన్ అరోరా, రాహుల్ బోస్, శ్రీ కుమార్ తదితరులు నటించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించాడు.

## ఒళ్లంతా టాట్యూలు చీరలో బయట పెట్టేసిందిగా!

బాలీవుడ్ ట్యాలెంటెడ్ నటుడు జాకీ ష్రాఫ్ కి ఎయిటీస్ సౌత్ స్టార్లతో ఉన్న అనుబంధం గురించి తెలిసిందే. దక్షిణాదిన ఎనభైల తారలు ప్రతియేటా ఏర్పాటు చేసే పార్టీలో అతడు తళుక్కున మెరుస్తుంటాడు. గ్రూప్ ఫోటోలో అతడు తప్పనిసరిగా కనిపిస్తాడు. జాకీ ష్రాఫ్ హిందీ చిత్రసీమలో పేరున్న నటుడు. దక్షిణాదినా పలు చిత్రాల్లో నటించాడు. ఇప్పుడు అతడి నటవారసుడు టైగర్ ష్రాఫ్ స్టార్ గా కొనసాగుతున్నాడు. కొన్ని పరాజయాలు ఇటీవల అతడిని వెంటాడినా కానీ, టైగర్ ప్రతిభ విషయంలో ఎలాంటి డౌట్లు లేవు. అతడు భవిష్యత్ సూపర్ స్టార్ అన్న నమ్మకం జాకీకి అభిమానులకు కూడా ఉంది. ఇకపోతే ఇదే ఫ్యామిలీలో మరో రెబల్ స్టార్ గురించి



బయటి ప్రపంచానికి తెలిసింది కొంత తక్కువే. ముఖ్యంగా సౌత్ ఆడియెన్ కి ఈ భామ తక్కువగా తెలుసు. జాకీ ష్రాఫ్ కుమార్తె, టైగర్ ష్రాఫ్ సోదరి అయిన కృష్ణా ష్రాఫ్ రెబలియన్ యాటిట్యూడ్ అన్ని వేళలా హాట్ టాపిగ్గా మారుతోంది. ఈ భామ సోదరుడి స్ఫూర్తితో ఫిట్ నెస్ కోసం జిమ్ముల్లో తీవ్రంగా శ్రమిస్తుంది. మార్షల్ ఆర్ట్స్ లోను ప్రవేశం ఉంది. దీంతో తన లుక్ రఫ్ గా టోన్డ్ గా అథ్లెటైజర్ లా కనిపిస్తుంది. అయినా కృష్ణా ష్రాఫ్ చీర కడితే ఎలా ఉంటుందో పలు సందర్భాల్లో అభిమానులు పరిశీలించారు. ఇప్పుడు బ్లాక్ కలర్ డిజైనర్ చీర, దానికి కాంబినేషన్ బ్లౌజ్ ధరించిన కృష్ణా ష్రాఫ్ ఒక చేత్తో వైన్ గ్లాస్ పట్టుకుని కనిపించింది. ఇక రివీలింగ్ శారీలో కృష్ణా శరీరాకృతి స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె ఫిట్ బాడీ, అదే సమయంలో మత్తెక్కించే అందం బయటపడింది. ఈ లుక్ చూడగానే అభిమానులు సెలబ్రేషన్ మోడ్ లోకి వెళ్లిపోయారు. తాజాగా కృష్ణా ష్రాఫ్ షేర్ చేసిన అందమైన ఫోటోలు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ఒంటిపై ఉన్న టాట్టూలు కుర్రకారుకు కిక్కు తెస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం కృష్ణా ష్రాఫ్ బోయ్ ఫ్రెండ్ లేని ఒంటరి. గత డేటింగులకు బాయ్ చెప్పేసి లోన్ లీగా ఉంది.. కృష్ణా లేటెస్ట్ ఫోజులకు ఇప్పుడు ఫ్యాన్స్ అమాంతం పెరిగారు.

## సైలెంట్ కిల్లర్‌లా టాలీవుడ్‌లో కన్నడ బ్యూటీ

ఇటీవలి కాలంలో నిధి అగర్వాల్, రష్మిక మందన్న, నభా నటేష్, కృతి శెట్టి లాంటి కన్నడ భామలు తెలుగు సినీపరిశ్రమలో వరుసగా అవకాశాలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. మలయాళీ భామలతో పోటీపడుతూ కన్నడం నుంచి కథానాయికల హవా టాలీవుడ్ లో పెరిగిందనడానికి ఇది సూచిక. ఇప్పుడు మరో కన్నడ బ్యూటీ టాలీవుడ్‌లో ఆరంగేట్రంతోనే వేవ్స్ క్రియేట్ చేస్తోంది. సైలెంట్ కిల్లర్ లా దూసుకొస్తున్న ఈ బ్యూటీ పేరు రుక్మిణి వసంత్. 2023లో కన్నడ దర్శకుడు హేమంత్ రావ్ తెరకెక్కించిన 'సప్త సాగరదాచే ఎల్లో – సైడ్ A అండ్ SSE సైడ్ B చిత్రాలలో రుక్మిణి తన చక్కటి నటనతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత కేజీఎఫ్ ప్రశాంత్ నీల్ కథ అందించిన భగీరలోను నటించింది. ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. నటిగా రుక్మిణికి మంచి మార్కులు పడ్డాయి. అదే క్రమంలో రుక్మిణి వసంత్‌కి టాలీవుడ్ లో విజయ్ దేవరకొండ సహా పలువురి సినిమాల్లో ఆఫర్లు వచ్చాయి. అయితే ఇంతలోనే రామ్ పోతినేని సరసన నటించేందుకు ఓకే చెప్పిందని కథనాలొచ్చాయి. రుక్మిణి వసంత్‌ను పలువురు చిత్రనిర్మాతలు సంప్రదించారని, వాస్తవానికి దాదాపు డజను స్క్రిప్ట్‌లు విన్నా కానీ దేనికీ సంతకం చేయడానికి పెద్దగా ఆసక్తి చూపలేదని తెలిసింది. కానీ చివరికి రామ్ పోతినేనితో కలిసి ఒక చిత్రానికి సంతకం చేసిందని సమాచారం. రవికిరణ్ కోలాతో కలిసి



విజయ్ దేవరకొండ చిత్రంలో ఆమె నటిస్తుందని పుకార్లు వచ్చాయి.. కానీ ఆమె దానిని తిరస్కరించిందని కూడా కథనాలొచ్చాయి. తమిళంలో టాప్ స్టార్స్ విజయ్ సేతుపతి, శివకార్తికేయన్‌లతో సినిమాలకు సంతకాలు చేసింది. శివ రాజ్‌కుమార్ భైరతి రణగల్, భగీరా సహా పలు కన్నడ చిత్రాలలోను రుక్మిణి నటిస్తోంది. సేతుపతి సినిమా త్వరలో విడుదలకు రానుంది. ఇందులో తన షూటింగ్‌ను రుక్మిణి ముగించింది. శివకార్తికేయన్‌తో దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. శివరాజ్ కుమార్ భైరతి రణగల్ అనే చిత్రంలోను రుక్మిణి కథానాయిక. ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలై ఆకట్టుకుంది. రుక్మిణి వ్యక్తిగత విషయాలు పరిశీలిస్తే ఆసక్తికరం. అశోక చక్ర గ్రహీత కల్నల్ వసంత్ వేణుగోపాల్ కుమార్తె ఈ ప్రతిభావని. లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్స్ నుండి నటన నుండి పట్టభద్రురాలైంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536